# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


**నేడు నంద్యాల జిల్లాలో సీఎం పర్యటన**

- మీ భూమి మీ హక్కుకు హాజరు
- రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు

2



## కనీస మద్దతు ధరకు

# పొగాకు కొనాల్సిందే

- రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు
- వేలం ప్రక్రియను వేగవంతం చేయాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- అధికారులు, బయ్యర్లతో సమీక్ష

రైతులకు భరోసా కల్పించేలా వెంటనే పొగాకు కొనుగోళ్ల కోసం వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబా బు ఆదేశించారు. రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సచివాలయంలో బుధవారం పొగాకు కొనుగోళ్ల ప్రస్తుత స్థితిపై అధికారులు, ట్రేడర్లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కిలోకు రూ.200 తగ్గకుండా మొత్తం కొనుగోళ్లు చేసి తీరాలని స్పష్టం చేశారు.

# మారిటైమ్ బిజినెస్‌కు ఏపీ అనుకూలం



- దుగరాజపట్నం షిప్ బిల్డింగ్‌లో పెట్టుబడులు పెట్టండి
- మారిటైమ్ బోర్డుతో పనిచేసేందుకు ముందుకు రండి
- కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్
- దక్షిణకొరియాలో నాలుగోరోజు పర్యటన

4

దక్షిణకొరియా పర్యటనలో భాగంగా నాలుగో రోజు బుధవారం మంత్రి లోకేష్ బుసాన్ నగరంలో పర్యటించారు. బూ యంగ్ గ్రూప్, బీఎన్‌కే, హ్వాసంగ్ గ్రూప్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అపెక్స్- కొరియా పెట్టుబడిదారుల సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. పాదరక్షల తయారీ సంస్థ షూఆల్స్ ఫ్యాక్టరీని సందర్శించారు. కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుసాన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావే శంలో పాల్గొన్నారు. భారత తూర్పుతీరంలో **1053** కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం కలిగి మారిటైమ్ వ్యాపారానికి అత్యంత అనుకూలమైన ప్రాంతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ డెస్క్, ఇండియా షిప్ టెక్నాలజీ సెంటర్, ఉమ్మడి నైపుణ్య శిక్షణ, ఆర్ అండ్ డీ సంస్థల ఏర్పాటుకు ఏపీ మారిటైమ్ బోర్డుతో భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి చేశారు.

# హాస్టళ్లు, గురుకులాల డైట్ ఛార్జీలు పెంపు

- రెండో త్రైమాసికం నుంచి వర్తింపు
- ఇక హాస్టళ్ల స్థానంలో గురుకులాలనే నిర్మిద్దాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు శిక్షణ కేంద్రాలు
- వసతిగృహాలు, రెసిడెన్షియల్ విద్యాలయాలకు రూ.100 కోట్లతో మెయింటెనెన్స్ గ్రాంట్
- దత్తత తీసుకునేలా ఎన్ఆర్ఐలను సంప్రదించాలి
- పేదల జీవనోపాధికి పీ4 అనుసంధానం
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

3



హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు చెల్లించే డైట్ ఛార్జీలను **10** శాతం పెంచాలని నిర్ణ యించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో బుధవారం సంక్షేమ శాఖలపై జరిగిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు వర్తింపజేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింటెనెన్స్‌కు రూ.**100** కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమ హాస్టళ్లను ఎన్ఆర్ఐలు దత్తత తీసుకునేలా వారితో సంప్రదింపులు జరపాలని సూచించా రు. పేదల జీవనోపాధిని మెరుగుపరిచి ఆదాయం సమకూ ర్చేందుకు అన్ని మార్గాలను అన్వేషించాలని, పీ4 ద్వారా సాయం అందించాలని సూచించారు.

# కారుణ్య మరణాలకు మార్గం సుగమం

## మార్గదర్శకాలకు ప్రభుత్వం ఆమోదం



తీవ్రమైన వ్యాధులతో చికిత్సకు సహకరించని స్థితిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల రోగుల విషయంలో కీలక నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. వైద్య ఆర్యోగ్య మంత్రి సత్యకుమార్ ఆమోదం తెలిపిన మార్గ దర్శకాలతో కారుణ్య మరణాలకు సంబంధించి విధి విధానాలకు చట్టబద్ధమైన రూపం లభించింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అను గుణంగా అటువంటి రోగులకు కారుణ్య మరణం లభించేలా విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది.



# కృష్ణా డెల్టాకు పట్టిసీమతో ఊపిరి

- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు
- పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల ద్వారా నీటి విడుదల

9

# ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్తకు కార్యరూపం

- 12 బ్రాండ్లు, ఫ్రాంచైజీ సంస్థలతో టైఅప్
- అమరావతిలో వ్యాపార భాగస్వాముల సదస్సు



ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమంలో భాగం గా మెప్మా, పురపాలక శాఖ, ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరా వతి సీఆర్‌డీఏ కార్యాలయంలో వ్యాపార భాగస్వాముల సదస్సు జరిగింది. స్వయం సహాయక సంఘాల్లో మహిళా పారిశ్రామిక వేత్తల కోసం 12 ప్రముఖ బ్రాండ్లు, ఫ్రాంచైజీ భాగస్వామ్య సంస్థలు తమ వ్యాపార నమూనాలను ప్రదర్శించాయి. అనంత రం మంత్రి నారాయణ మెప్మా మిషన్ డైరెక్టర్, భాగస్వామ్య సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలు జరిగాయి. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని స్వయం సహాయక సంఘాల కుటుంబాలు ఈ ఫ్రాంచైజీ సంస్థల యూనిట్లను ఏర్పాటు చేసు కునేందుకు సహకారం అందిస్తారు.

చైతన్యరథం

# కనీస మద్దతు ధరకు పొగాకు కొనాల్సిందే


- రైతులను ఇబ్బంది పెట్టే కంపెనీలపై కఠిన చర్యలు
- టుబాకో బోర్డుపైనా సీఎం చంద్రబాబు అసంతృప్తి
- ఇండెంట్‌కు మించి సాగుతో ధర తగ్గిందన్న అధికారులు



అమరావతి (చైతన్యరథం): రైతుల్లో నమ్మకం, ధైర్యం కల్పించే లా వెంటనే పొగాకు కొనుగోళ్లు పెద్దఎత్తున జరపాలని, ఇందు కోసం వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పొగాకు కంపెనీలకు స్పష్టం చేశారు. ట్రేడర్లు కొనుగోళ్లు తగ్గించడం సరికాదని, కర్నాటకలో తలెత్తని సమస్య ఏపీలో ఎందుకు ఉత్పన్నం అవుతోందని ప్రశ్నించారు. టుబాకో బోర్డు పనితీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించా రు. సచివాలయంలో బుధవారం పొగాకు కొనుగోళ్ల ప్రస్తుత స్థితి పై అధికారులు, ట్రేడర్లతో సమీక్ష నిర్వహించారు. మొత్తం 28 కంపెనీలు సమర్పించిన ఇండెంట్ వివరాలు, ప్రస్తుతం జరిపిన కొనుగోళ్ల శాతాన్ని సమీక్షలో పరిశీలించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోలు చేయకుండా ప్రభుత్వానికి సహకరించకపోతే సహిం చేది లేదని హెచ్చరించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలకు మళ్లితే తలెత్తే పరిస్థితి గురించి పొగాకు కంపెనీలు ఆలోచన చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్ద తు ధర కిలోకు రూ.200 తగ్గకుండా మొత్తం కొనుగోళ్లు చేసి తీరాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అతిపెద్ద మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు అయిన ఐటీసీ లిమిటెడ్, గాడ్ ఫ్రే ఫిలిప్స్ (ఐ) లిమిటెడ్, వీఎస్టీ ఇండస్ట్రీస్ 95.50 మిలియన్ మెట్రిక్ టన్నుల పంట కొనుగోళ్లకు ఇండెంట్ ఇవ్వగా.. ఇప్పటివరకు కేవలం 17.6 మిలియన్ మెట్రిక్ టన్నుల పొగాకు మాత్రమే కొనుగోలు చేయడాన్ని తప్పుబట్టారు. ఈ సీజన్‌లో ఐదవ సారి ఇదే అంశంపై సమీక్ష నిర్వహించాల్సి వచ్చిందంటే కంపెనీల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రైతులు డిమాండ్‌కు మించి పొగాకు సాగు చేయడం ప్రస్తుత సమస్యకు కారణమని ట్రేడర్లు వివరించారు. ఇప్పటికే అవసరానికి మించి కొనుగోళ్లు చేశామని..దానికి తోడు ఎగుమతులు కూడా తగ్గాయని తెలిపారు. అయినప్పటికీ కొనుగో ళ్లు కొనసాగిస్తామని కంపెనీల ప్రతినిధులు వెల్లడించారు. పొగాకు బహిరంగ మార్కెట్ లేకపోవడం సమస్యను తీవ్రం చేశాయని అధికారులు వివరించారు. అలాగే కంపెనీలు 142 మిలియన్ కిలోలకు ఇండెంట్ ఇవ్వగా, రైతులు 232 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి చేశారని, దీంతో ధర పతనం..కొనుగోళ్లు లేక పోవడం జరిగిందని తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు అచ్చెన్నా యుడు, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధు లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హ్యాట్సాఫ్ టు ది టీమ్

## లోకేష్ బృందానికి కోట్రా ఇండియా, సౌత్ హెడ్ ప్రశంసలు






Kyunghoon Kim
@Kyunghoon_Kim_

Economic diplomacy at full throttle.

The team led by @naralokesh has met with Shoealls, SOLUM, APACT, Samsung, LG, Boo Young, Hwaseung, and many more showcasing everything Andhra Pradesh has to offer.

Only halfway through the visit - Roadshow on Friday.

Hats off to the team!






*దక్షిణకొరియా: ఆంధ్రప్రదేశ్ పెట్టుబడి దౌత్యం ప్రపంచ వేదికపై మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందింది. దక్షిణకొరియా పర్యటనలో మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని బృందం నిర్వహి స్తున్న ఆర్థిక దౌత్యాన్ని కోట్రా(కొరియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమో షన్ ఏజెన్సీ) ఇండియా, దక్షిణాసియా హెడ్ క్యుంగ్‌హూన్ కిమ్ ఎక్స్ వేదికగా ప్రశంసించారు. ఆర్థిక దౌత్యం పూర్తిస్థాయిలో విజయవంతంగా సాగుతోంది. ఆంధ్రప్ర దేశ్ విజన్, అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరిస్తూ లోకేష్ బృందం షూ ఆల్స్, సోలమ్, ఏపాక్ట్, శాంసంగ్, ఎల్జీ, బూ యంగ్, హ్వాసెంగ్ తదితర మరెన్నో కంపెనీలను కలిసింది. పర్యటన ఇంకా సగంలోనే ఉంది. శుక్రవారం సియోల్‌లో ఆంధ్రప్రదేశ్ రోడ్‌షో జరగనుంది. సియోల్ లో జరగనున్న ఆంధ్రప్రదేశ్–సౌత్‌కొరియా బిజినెస్ ఫోరం, సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోతో మరిన్ని పెట్టుబడులు, భాగ స్వామ్యాలకు మార్గం సుగమం కావాలని ఆకాం క్షిస్తూ నారా లోకేష్ బృందానికి హ్యాట్సాఫ్ అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.*

చైతన్యరథం



# హాస్టళ్లు, గురుకులాల మెస్‌ఛార్జీలు పెంపు





- ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచి వర్తింపు
- ఇక హాస్టళ్ల స్థానంలో గురుకులాలనే నిర్మిద్దాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు శిక్షణ కేంద్రాలు
- వసతిగృహాలు, రెసిడెన్షియల్ విద్యాలయాలకు రూ.100 కోట్లతో మెయింటెనెన్స్ గ్రాంట్
- దత్తత తీసుకునేలా ఎన్ఆర్ఐలను సంప్రదించాలి
- పూర్వ విద్యార్థుల నెట్ వర్కింగ్ ఏర్పాటు చేయాలి
- పేదల జీవనోపాధికి పీ4 అనుసంధానం
- అన్ని వైపుల నుంచి ఆదాయం సమకూరాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి(చైతన్యరథం): బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు చెల్లించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం సంక్షేమ శాఖలపై జరిగిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని.. వచ్చే ఏడాది నుంచి పెంచుదామని ఆర్థిక శాఖ అధికారులు సూచించినా ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు వర్తింపజేయాలని సీఎం స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో విద్య ద్వారానే మార్పు వస్తుంది..దీనికి తగినట్టుగానే వారికి అన్ని రకాల అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలతో పాటు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉంది.. ఈ మేరకే డైట్ ఛార్జీలు పెంచు తున్నామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు లబ్ధి చేకూర్చే విషయంలో వారికి కలిగే ప్రయోజనాన్ని పరిగణన లోకి తీసుకోవాలని సూచించారు.

## మెరుగైన వసతులతో గురుకులాలు

సంక్షేమ శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో పెద్దఎత్తున గురుకులాల నిర్మాణం చేపట్టాలని ఆదేశిం చారు. ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాల ని తెలిపారు. హాస్టళ్ల స్థానంలో గురుకులాల నిర్మాణం చేపట్టేందు కు పెద్దపీట వేయాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో నెట్‌జీరో విధానాన్ని అమలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగా లు ఉన్నాయో విశ్లేషించాలి. బయో డైవర్శిటీ పార్కుల తరహాలో గురుకులాలను నిర్వహించాలి. మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలతో గురుకులాలను నిర్మిద్దాం. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింటెనెన్స్ గ్రాంట్ ఇవ్వాలి. దీని నిమిత్తం రూ.100 కోట్లు కేటాయిస్తున్నాం. హాస్టళ్లు, గురుకులాల్లో చదివే విద్యార్థులను ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు ప్రిపేర్ చేసేలా చర్య లు తీసుకోవాలి. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇప్పించాలి. పోటీ పరీక్షలకు గురుకు లాల్లో చదువుతున్న విద్యార్థులను సిద్ధం చేయాలి. విద్యతో సమా నంగా శిక్షణ అందించాలి. బెస్ట్ టీచర్లను నియమించి ఉత్తమ శిక్షణ ఇవ్వాలి. హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుంటూ ప్రతిభ కనబరిచే ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ప్రారంభించాలి. ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను మ్యాపింగ్ చేసి నైపుణ్యం పెంచి పారిశ్రామిక అవసరాలకు వర్క్‌ఫోర్స్ సిద్ధం చేయాలి. హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠ శాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ఓ వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయాలి. సంక్షేమ హాస్టళ్లను ఎన్ఆర్ఐలు దత్తత తీసుకునేలా వారితో సంప్రదింపులు జరపాలి. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాల ల్లో పూర్వ విద్యార్థుల నెట్ వర్కింగ్ చేయాలి. రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాల్లో స్వచ్ఛందంగా ముందుకువచ్చి విద్య, వైద్య సేవలు అందించే వారికి అవకాశం కల్పించాలని సూచించారు.

## పేదలకు పథకాల లబ్ధి చేకూరాలి

పేదలు, బలహీన వర్గాలకు సంక్షేమం అందించడమే కాదు.. వారి జీవనోపాధిని మెరుగుపరిచి ఆదాయం సమకూర్చేందుకు అన్ని మార్గాలను అన్వేషించాలి. ప్రభుత్వం వైపు నుంచి అందించే సంక్షేమం, మెప్మా, డ్వాక్రా పథకాల ద్వారా ఉపాధి కల్పించడంతో పాటు పీ4 ద్వారా సాయం అందాలి. వ్యవసాయం, ఉద్యాన రంగం, పాడి పరిశ్రమ, జీ రామ్ జీ సహా వివిధ సంక్షేమ పథకా ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మేలు చేకూర్చాలి. సాస్కి, పూర్వోదయ, జీ రామ్ జీ వంటి పథకాల లబ్ధి బడుగు వర్గాలకు దక్కేలా చూడాలి. ఉద్యాన, రబ్బర్, కాఫీ, పసుపు వంటి పంటల సాగును ప్రోత్సహించి ఆ వర్గాల రైతులకు లబ్ధి కలిగేలా చూడాలి. ఇప్పటికే కొన్ని విధానాల ద్వారా వారి జీవన స్థితిగతులను మెరు గుపరిచేలా పాలసీలు తీసుకున్నాం. లిక్కర్ షాపుల్లో కల్లుగీత వృత్తిదారులకు, క్వారీల్లో వడ్డెర్లకు కోటా పెట్టాం. నాయీ బ్రాహ్మ ణులు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ఇలా వివిధ వర్గాలకు ఆర్థికంగా సాయం చేస్తున్నాం. ప్రభుత్వపరంగా అందించే సాయ మే కాకుండా వారి అభివృద్ధికి ఏమి చర్యలు తీసుకోవాలనే అం శంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. ఈ మేరకు వివిధ కుల కార్పొరేషన్ల బైలాస్ మార్చే అంశాన్ని పరిశీలించాలి. బ్రాహ్మణ కార్పొరేషన్ విధానాలను మిగిలిన కార్పొరేషన్లు కూడా అవలం భించేలా చర్యలు తీసుకోవాలి. జీ రామ్ జీ ద్వారా అంగన్వాడీ భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సందర్భంగా సంక్షేమ శాఖల్లో తాము తీసుకున్న చర్యలను మంత్రులు, అధికారులు వివరించారు. కొందరు విద్యార్థులు హోం సిక్‌కు గురవుతున్నారని.. అలాంటి విద్యార్థుల కోసం తల్లిదండ్రులతో మాట్లాడేలా స్మార్ట్ కార్డ్ బేస్డ్ టెలిఫోన్ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. తల్లిదండ్రులతో రోజులో 4 నిమిషాలు మాట్లాడుకునే సదుపాయం కల్పించామని తెలిపారు. సాస్కి కింద సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో రూ.120 కోట్లతో ఆర్వో పాంట్లు, టాయిలెట్స్ సహా ఇతర మౌళిక వసతులను కల్పించే పనులు చేపట్టామని వివరించారు. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు పూర్తి చేశామని... ఈ నెలాఖరు నాటికి టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేస్తామని సీఎంకు అధికారులు వివరించారు. సమీక్షలో మంత్రులు డీబీవీ స్వామి, సవిత, సంధ్యారాణి, ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ సంక్షేమ సలహాదారు మహ్మద్ షరీఫ్ సహా వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నేడు నంద్యాల జిల్లాలో సీఎం పర్యటన

## మీ భూమి మీ హక్కుకు హాజరు - రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు

అమరావతి (చైతన్యరథం): నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్య టించనున్నారు. మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాల్గొంటా రు. ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 11.20 గంటలకు బనగానపల్లెకు చేరుకుంటారు. 11.40 గంటలకు తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శిస్తారు. ప్రజలకు అందించే సేవలను తెలుసుకుంటారు. అనంతరం రైతులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 2.35 గంటలకు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. సాయంత్రం 5.40 గంటలకు తిరిగి అమరావతి చేరుకుంటారు.

చైతన్యరథం





# మారిటైమ్ వ్యాపారానికి ఏపీ అనుకూలం

- **దుగరాజపట్నం షిప్ బిల్డింగ్‌లో పెట్టుబడులు పెట్టండి**
- **మారిటైమ్ బోర్డుతో పనిచేసేందుకు ముందుకు రండి**
- **కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్**
- **రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్**

బుసాన్ (సౌత్‌కొరియా): భారత తూర్పుతీరంలో 1053 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం కలిగి మారిటైమ్ వ్యాపారానికి అత్యంత అనుకూలమైన ప్రాంతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబ డులు పెట్టాలని మంత్రి నారా లోకేష్ కోరారు. ఒక మేజర్, 5 నాన్ మేజర్ ఆపరేషనల్ పోర్టుల ద్వారా రాష్ట్రంలో ప్రతిఏటా 330 మిలియన్ టన్నులకు పైగా సరుకుల రవాణా జరుగుతోందని వివరించారు. కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుసాన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేష్ పాల్గొన్నారు. ఏపీలో మరో నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయని, 1.10 లక్షల ఎకరాలకు పైగా ఇండస్ట్రి యల్ ల్యాండ్ బ్యాంక్ ఏపీలో అందుబాటులో ఉందని వివరించారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక ఓడరేవు/షిప్ యార్డ్/ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

భారత్‌లో మొట్టమొదటి స్టేట్ అప్రూవ్డ్ షిప్ బిల్డింగ్ క్లస్టర్ దుగరాజపట్నంలో రూ.30 వేల కోట్లతో 3,488 ఎకరాల్లో నిర్మితమవుతోందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సంయుక్తంగా విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో అభివృద్ధి చేస్తున్న ఈ క్లస్టర్ శ్రీసిటీ, కృష్ణపట్నం పోర్టులకు సమీపంలో ఉండటంతో పాటు కనెక్టివిటీ కలిగి ఉందని తెలిపారు. భారతీయ ఎగుమతి మార్కెట్ల కోసం కొరి యన్ పరికరాల స్థానికీకరణకు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపా యాలు, ఉమ్మడి సౌకర్యాల ఏర్పాటుకు కొరియా మెరైన్ ఎక్విప్ మెంట్ అసోసియేషన్ (కేవోఎంఈఏ) ప్రతినిధులను ఆహ్వానించారు. దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ క్లస్టర్‌లో టెస్టింగ్/సర్టిఫికేషన్ ల్యాబ్‌లతో పాటు ఇంజన్లు, ప్రొపల్షన్, నావిగేషన్, డెక్ మెషినరీ, ఎలక్ట్రికల్స్, అవుట్ ఫిట్టింగ్, ప్రత్యేక మెరైన్ పరికరాల తయారీ, అనుబంధ పార్కును ఏర్పాటు చేయాలని కోరారు.

## నౌకా నిర్మాణాలకు ఆర్థిక సహకారం

భారతదేశంలో సుమారు US$12.3 బిలియన్ల నౌకా నిర్మాణ ఆర్డర్లు ఉన్నాయని వివరించారు. ఇప్పటికీ 93 శాతం అంతర్జాతీయ సరుకు రవాణా విదేశీ నౌకల ద్వారానే జరుగుతోంది. తీరప్రాంత నౌకలలో 50 శాతం 20 ఏళ్లకు పైబడినవి, ఎంవో పీఎన్‌జీ పరిధిలోని 112 నౌకలు, విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో నౌకల మరమ్మతులకు డిమాండ్ ఉందని తెలిపారు. భారత ప్రభుత్వం రూ.70 వేల కోట్ల మారిటైమ్ ప్యాకేజీ ప్రకటిం చింది. ఇందులో భాగంగా ఒక్కొక్క నౌకా నిర్మాణానికి 15 నుంచి 25 శాతం ఆర్థికసాయం అందుతోందని వివరించారు. రూ.25 వేల కోట్ల మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా కొత్త యార్డులకు మూలధన వ్యయంలో 25 శాతం వరకు గ్రాంట్ల రూపంలో అందుతోంది.

నౌకా నిర్మాణానికి మౌలిక సదుపాయాల హోదా లభిస్తోందని వివరించారు.

## మెరైన్ ఎక్విప్‌మెంట్ డెస్క్ ఏర్పాటు చేయండి


ఆంధ్రప్రదేశ్‌లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలను చేతల్లో అమలు చేసి చూపిస్తున్నాం. కియా (US$2 బిలియ న్లు, సుమారు 24 నెలల్లో ట్రయల్ ప్రొడక్షన్), ఎల్జీ ఎలక్ట్రానిక్స్ (శ్రీసిటీ, ఒక సంవత్సరంలోపే శంకుస్థాపన), ఏఎం/ఎన్ఎస్ (US$15.3 బిలియన్లు, 17 నెలల్లో శంకుస్థాపన) ప్రాజెక్టులు ఇందుకు నిదర్శ నం. కొరియన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో పనిచేస్తున్నాయి, చెన్నై రీజియన్‌లో మరో 50 కంపెనీల వరకు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ డెస్క్, ఇండియా షిప్ టెక్నాలజీ సెంటర్, ఉమ్మడి నైపుణ్య శిక్షణ, ఆర్ అండ్ డీ సంస్థల ఏర్పాటుకు ఏపీ మారిటైమ్ బోర్డుతో భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో హాన్లా ఐఎంస్, హ్యుందయ్ వెల్డింగ్, డేసన్ షిప్ యార్డు, సన్ బో ఇండస్ట్రీస్, ఓరియంటల్ ప్రెసిషన్ అండ్ ఇంజనీరింగ్, ఫైన్ కొరియా, జేవో ఇంజనీరింగ్ తదితర సంస్థల ప్రతినిధులు

# ఏపీలో పాదరక్షల యూనిట్ ఏర్పాటు చేయండి

***సింగిల్‌విండో విధానంలో అనుమతులు ఇస్తాం - బూ యంగ్ గ్రూప్ సీఈవోతో లోకేష్ భేటీ***



బుసాన్ (సౌత్ కొరియా): పాదరక్షలు, షూ లేసులు, మెటల్ హార్డ్‌వేర్, అనుబంధ పరికరాల తయారీలో పేరెన్నికగన్న బూ యంగ్ గ్రూప్ సీఈవో అండ్ ప్రెసిడెంట్ డైరెక్టర్ ర్యాన్ కాంగ్, బిజినెస్ స్ట్రాటజీ, ప్లానింగ్ మేనేజర్ మిల్లీ రిచర్డ్‌సన్‌లతో మంత్రి నారా లోకేష్ బుసాన్‌లో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో బూ యంగ్ గ్రూప్ పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బూ యంగ్ గ్రూప్ రాష్ట్రానికి వస్తే సింగిల్ విండో విధానంలో అనుమతులతో పాటు రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జోన్లలో కంపెనీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కనెక్టివిటీ సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. బూ యంగ్ గ్రూప్ సీఈవో ర్యాన్ కాంగ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో బూ యంగ్ పాదరక్షల తయారీ, విడిభాగాల యూనిట్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేస్తూ రెడీ బిల్ట్ షెడ్ల కోసం అన్వేషి స్తున్నట్లు చెప్పారు. స్కైకార్ప్ గ్రూప్ అంతర్భాగంగా ఉన్న తమ సంస్థ అంతర్జాతీయ నెట్‌వర్క్‌తో పాటు 4,300 గ్లోబల్ కస్టమర్లు, 1.10 లక్షలకు పైగా అంతర్జాతీయ షిప్‌మెంట్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. తమకున్న గ్లోబల్ నెట్‌వర్క్ భారతీయ తయారీరంగాన్ని ప్రపంచ పంపిణీ వ్యవస్థతో అనుసంధానిస్తుందని వివరించారు.





చైతన్యరథం

# ఏపీలో హ్యోసంగ్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్

## గ్రూప్ ప్రతినిధులతో లోకేష్ చర్చలు - సానుకూలంగా స్పందించిన సంస్థ







బుసాన్ (సౌత్ కొరియా): ఫుట్‌వేర్, మెటీరియల్స్, ఆటో మోటివ్ కాంపొనెంట్స్, ఓడీఎం స్పోర్ట్ ఫ్యాషన్ పరికరాల తయారీలో పేరున్న హ్యోసంగ్ గ్రూప్ ఉన్నతస్థాయి బృందంతో మంత్రి నారా లోకేష్ బుసాన్‌లో భేటీ అయ్యారు. కుప్పంలో హ్యోసంగ్ పాదరక్షల తయారీ యూనిట్ ఏర్పాటుకు ముందుకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. దిగుమతులపై ఆధారపడటం తగ్గించి ఖర్చులను తగ్గించుకోవడానికి సరఫరాదారులతో అనుసంధానా నికి ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపొనెంట్ అండ్ మెటీరియల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని కూడా కుప్పంలోనే ఏర్పాటు చేయా లని సూచించారు. ప్రీమియం బ్రాండ్ల కోసం పెర్ఫార్మెన్స్ టెక్నాల జీ, ఏఐ ఫిట్టెడ్ కస్టమైజేషన్, సస్టయినబుల్ మెటీరియల్స్‌ను కవర్ చేస్తూ నెక్స్ట్ జెన్ అథ్లెటిక్స్ ఫుట్‌వేర్ ఆర్ అండ్ డీ, ఆసియా-పసిఫి క్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కు సేవలందించేలా ఒక సమగ్ర దక్షిణ భారత తయారీ క్లస్టర్‌ను (కుప్పంలో ప్రధాన కార్యాలయం, తిరుపతిలో విడిభాగాల తయారీ, విశాఖపట్నంలో డిజైన్ అండ్ కార్పోరేట్/లాజిస్టిక్స్ విభాగాలు) అభివృద్ధి చేయాలని కోరారు. హ్యోసంగ్ ఫుట్‌వేర్ టైర్-1, టైర్-2 స్థాయి విక్రేతలతో ఒక సప్లయర్ సమావేశాన్ని ఏపీలో నిర్వహిం చాలని విజ్ఞప్తి చేశారు.

### ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తాం

హ్యోసంగ్ కార్పోరేషన్ అఫ్లియేటెడ్ బిజినెస్ సీఈవో హెయో సియోంగ్-రియోంగ్ మాట్లాడుతూ హ్యోసంగ్ ఫుట్‌వేర్ కుప్పంలో రూ.900 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ నాన్-లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్‌ను ఇప్ప టికే ప్రకటించిందని తెలిపారు. అడిడాస్‌తో సహా గ్లోబల్ బ్రాండ్‌ల కు ప్రముఖ ఓఈఎం సరఫరాదారు అయిన ఈ ప్లాంట్, సంవ త్సరానికి 20 మిలియన్ల జతల స్పోర్ట్స్ షూలను తయారు చేస్తుం దని వివరించారు. ప్రారంభంలో ప్రధానంగా ఎగుమతి కోసం, ఆ తర్వాత దేశీయ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. హ్యోసంగ్ కార్పోరేషన్ ఆటో విడిభాగాల విభాగం పూణే, చెన్నై, అనంతపురం జిల్లా గూడపల్లిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తా మని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో హ్యోసంగ్ ఆటో బిజినెస్ డివిజన్ హెడ్ జియోన్ హ్యూన్ హో, మెటీరియల్ బిజినెస్ డివిజన్ హెడ్ లీ మూ జంగ్, ఇండస్ట్రియల్ ప్రొడక్ట్ బిజినెస్ హెడ్ యూన్ జిన్ మిన్, మేనేజ్ మెంట్ డివిజన్ హెడ్ క్వాక్ మ్యుంగ్ చుల్, స్ట్రాటజీ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ లీ జిన్ సియోక్ (మార్క్ లీ), కాన్స్టాంటిన్ వాసిలీవ్ పాల్గొన్నారు.














## బుసాన్‌లో అపెక్స్-కొరియా

# పెట్టుబడిదారుల సహాయ కేంద్రం

### ఏపీలో యూనిట్లకు అనుసంధాన సేవలు ప్రారంభించిన మంత్రి నారా లోకేష్








బుసాన్ (సౌత్ కొరియా): దక్షిణ కొరియా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్‌లో ఏపీఈడీబీ ఆధ్వర్యంలో అపెక్స్- కొరియా (ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్- కొరియా) పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగం (ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ అండ్ అవుట్‌రీచ్ సెల్)ను మంత్రి లోకేష్ ప్రారంభించా రు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపే కొరియా సంస్థలకు, ఏపీ ప్రభుత్వానికి మధ్య అపెక్స్ కొరియా అనుసంధానకర్తగా పనిచేస్తుందని లోకేష్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో యూనిట్లను ఏర్పాటు చేసిన సంస్థలకు అవసరమైన సేవలను కూడా అపెక్స్ కొరియా అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఏపీఈడీబీ సీఈవో సగిలి షన్మోహన్, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, పరిశ్రమలశాఖ కమిషనర్ శుభం బన్సాల్, దక్షిణకొరియాకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

















# షూఆల్స్ ఫ్యాక్టరీని సందర్శించిన లోకేష్

## బూట్ల తయారీ విధానం పరిశీలన

బుసాన్ (సౌత్ కొరియా): బుసాన్‌లోని ప్రఖ్యాత మెడికల్ డివైస్ సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ తయారీ సంస్థ షూఆల్స్ ఫ్యాక్ట రీని మంత్రి నారా లోకేష్ సందర్శించారు. రక్త ప్రసరణను ఉత్తేజ పరచడం, కండరాల అలసటను తగ్గించడానికి మెడికల్ మాగ్నెటిక్ జనరేటర్లు, చిప్‌ల అంతర్నిర్మిత టెక్నాలజీతో షూస్ తయారీ విధా నాన్ని ఆసక్తిగా తిలకించారు.

నడకలో అసౌకర్యాన్ని తగ్గించి పాదా లను ఆరోగ్యవంతంగా ఉంచడానికి ప్రత్యేకమైన మెడిచియో వైబ్రేషన్ చిప్‌లను అమర్చే విధానాన్ని పరిశీలించారు. షూఆల్స్ ప్రతినిధులు తయారీ విధానం, ప్రత్యేకతలను లోకేష్‌కు వివరించారు. మాగ్నెటిక్ థెరపీ, షాక్ అబ్సార్ప్షన్, కూలింగ్ సోల్స్, యాంటీ బాక్టీరియల్ మెటీరియల్స్ ఏకీకరణతో ఎంఎఫ్‌డీఎస్-సర్టిఫైడ్ మెడికల్ ఫుట్‌వేర్ తయారీలో తమ సంస్థ ప్రత్యేకత కలిగి ఉందని చెప్పారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, ఈవా ఉమెన్స్ యూని వర్సిటీ మెడికల్ సెంటర్‌తో కలిసి ఏఐ స్మార్ట్ మెడికల్ ఫుట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. థెరపిటిక్ షూస్‌ను చేతితో తయారు చేయడమే గాక స్మార్ట్ హెల్త్‌కేర్, నొప్పి నివారణ కోసం ఎర్గోనమిక్ డిజైన్‌ను వైద్య సాంకేతికతతో మిళితం చేసి బూట్లను తయారు చేస్తామని వివరించారు. మెడికల్ అండ్ ఎర్గోనమిక్ టెక్నాలజీలో తాము పేటెంట్ కలిగి ఉన్నట్లు చెప్పారు. అరికాళ్లలోని గాలి ప్రసరణకు అనుమతించి తద్వారా పాదాలను చల్లగా దుర్గంధ రహితంగా ఉంచే విధంగా ఇన్నోవ్షియో కూలర్ సిస్టమ్ అమర్చు తున్నట్లు తెలిపారు.















# రైలులో బుసాన్‌కు లోకేష్

**దక్షిణకొరియాలో నాలుగోరోజు పర్యటన**



సియోల్ (సౌత్ కొరియా): దక్షిణకొరియాలో ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్ నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం ఉదయం మంత్రి నారా లోకేష్ సియోల్ నుంచి బుసాన్‌కు రైలులో బయలుదేరారు. బుసాన్‌లో ఏపీఈడీబీ ఆధ్వ ర్యంలో ఉదయం అపెక్స్- కొరియా (ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్- కొరియా) పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగం (ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ అండ్ అవుట్‌రీచ్ సెల్)ను ప్రారంభించనున్నారు. తర్వాత కొరియా మెరైన్ ఎక్విప్ మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొంటారు. అనంతరం బీఎన్‌కే ఫైనాన్షియల్, బూయాంగ్ గ్రూప్, హ్యుంగ్ సాంగ్ గ్రూప్ ఉన్నత స్థాయి బృందాలతో మంత్రి లోకేష్ భేటీ కానున్నారు. పారిశ్రామిక వేత్తలతో సమావేశాల అనంతరం సాయంత్రం షూఆల్స్ ఫుట్‌వేర్ ఫ్యాక్టరీని సందర్శిస్తారు. అనంతరం బుసాన్ నుంచి రాత్రికి తిరిగి సియోల్ చేరుకుంటారు.

# అమరావతిలో బీఎన్‌కే ఫైనాన్షియల్ శాఖ





## ఆర్‌టీఐహెచ్‌లో మెంబర్/మెంటార్‌కు ఆహ్వానం

## గ్రూప్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ చర్చలు

బుసాన్ (సౌత్ కొరియా): బీఎన్‌కే ఫైనాన్షియల్ గ్రూప్ ఎండీ లీ క్వాంగ్ జున్, బీఎన్‌కే క్యాపిటల్ సీఈవో సన్ డే జిన్, మేక్ ఇన్ ఇండియా కొరియా చైర్మన్ జంగ్ డియోక్ మిన్, ఎస్‌బీ సన్ బో కంపెనీ చైర్మన్ క్యూమ్ సిక్, హ్యుందయ్ మోటార్స్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ కోఆపరేషన్) చోయ్ సియుంగ్ హూన్‌లతో మంత్రి నారా లోకేష్ బుసాన్‌లో సమావేశమయ్యారు. పెట్టుబడు లు, నిధుల నిర్వహణ, కన్సల్టింగ్ సేవల ద్వారా స్టార్టప్‌లు, ఎస్‌ఎంఈలకు మద్దతు ఇచ్చేందుకు బీఎన్‌కే వెంచర్ క్యాపిటల్ సంస్థ.. ఏపీలోని ఆర్‌టీఐహెచ్‌లో మెంబర్/మెంటార్‌గా చేరాలని ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి ప్రాజెక్టులైన అమరా వతి, పారిశ్రామిక పార్కులు, విద్యుత్ మౌలిక సదుపాయాలు మొదలైన వాటికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్ అందించే అవకాశా లను పరిశీలించాలని కోరారు. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, నౌకా నిర్మాణం, ఇంధన పరిశ్రమలకు చెందిన క్లయింట్‌లను వారి పెట్టుబడి/ఉత్పత్తి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసుకునే లా ప్రోత్సహించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న అమరావతిలో బీఎన్‌కే ఫైనాన్షియల్ శాఖ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం

బీఎన్‌కే ఫైనాన్షియల్ గ్రూప్ ఎండీ లీ క్వాంగ్ జున్, బీఎన్‌కే క్యాపిటల్ సీఈవో సన్ డే జిన్ మాట్లాడుతూ బీఎన్‌కే ఫైనాన్షియల్ గ్రూప్‌లో మూడు బ్యాంకులు (బుసాన్, క్యోంగ్నామ్, సేవింగ్స్), బీఎన్‌కే సెక్యూరిటీస్, క్యాపిటల్, అసెట్ మేనేజ్‌మెంట్, క్రెడిట్ ఇన్ఫర్మేషన్, సిస్టమ్, వెంచర్ క్యాపిటల్ అంతర్భాగాలుగా ఉన్నా యని చెప్పారు. కొరియాలో 398 దేశీయ శాఖలు, చైనా, భారత్, ఆగ్నేయ/మధ్య ఆసియాలలో 75 అవుట్ లెట్లు కలిగి ఉన్నట్లు తెలి పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దక్షిణ కొరియాలోని మూడు ప్రాంతీయ ఫైనాన్షియల్ హోల్డింగ్ గ్రూపు లలో ఒకటిగా ఉన్న బీఎన్‌కే ఫైనాన్షియల్ గ్రూప్ ఏకీకృత ఆస్తులు \$101.9 బిలియన్లు అంటే రూ.9.64 లక్షల కోట్లుగా ఉన్నాయి.

# కృష్ణా డెల్టాకు పట్టిసీమతో ఊపిరి

- పట్టిసీమ ఒట్టిసీమ అన్న జగన్ ఏం చెబుతారు?
- చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనం పట్టిసీమ
- సూపర్ ఎల్ నినోను సమర్థంగా ఎదుర్కొంటాం
- పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల ద్వారా నీటి విడుదల
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



ఏలూరు (చైతన్య రథం): పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు గోదావరి వృథా జలాలను కృష్ణా డెల్టాకు తరలించాలన్న ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన పట్టిసీమ ఎత్తిపోతల సత్ఫలితాలు ఇచ్చిందని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. కేవలం రూ.1,300 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన పట్టిసీమవల్ల వేల కోట్ల రూపాయల పంట పండిందన్నారు.

బుధవారం ఉదయం ఏలూరు జిల్లాలో పట్టిసీమ, తూర్పు గోదావరి జిల్లాలో తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. పట్టిసీమ డెలివరీ పాయింట్, తాడిపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు దగ్గర గోదావరికి జలహారతి ఇచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా జలాలతో అనుసంధానం చేసి, నదుల అనుసంధానానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నాడు పట్టిసీమ ఒట్టిసీమ అన్న జగన్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇప్పటివరకు పట్టిసీమ ద్వారా 442కు పైగా టీఎంసీని కృష్ణా డెల్టాకు తరలించామని, రూ.50 వేల కోట్ల ఆదాయాన్ని సృష్టించామని అన్నారు. దూరదృష్టి, ముందుచూపు, నిర్మాణాత్మక ఆలోచన కలిగిన నాయకుడు ఉంటే ప్రజలకు ఏవిధంగా మేలు జరుగుతుందో పట్టిసీమే ఉదాహరణ అని మంత్రి పేర్కొన్నారు. పాలన అనుభవం లేకపోవడం, విధ్వంసపు ఆలోచనలవల్లే జగన్ తన పాలనా కాలంలో పట్టిసీమవైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. గోదావరికి ఎగువనుంచి వస్తున్న నీటిని సముద్రంలోకి పోకుండా ఒడిసిపట్టుకుని కృష్ణా డెల్టాకు తరలించడం గొప్ప విషయం అన్నారు. ఆల్మట్టి నుంచి జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్ వరకు ఖాళీ జలాశయాలతో ఉన్న కృష్ణాకు ఈ పట్టిసీమ నేడు ఊపిరి పోస్తుందన్నారు.

### ఎల్ నినోను సమర్థంగా ఎదుర్కొందాం

చంద్రబాబు సూచనలతో సూపర్ ఎల్ నినోను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి రామానాయుడు చెప్పారు. ముందస్తు ప్రణాళికలతో ప్రతి నీటి బొట్టునూ సమర్థంగా వినియోగించుకుంటున్నామన్నారు. ఎల్ నినో, సూపర్ ఎల్ నినోల గురించి ప్రపంచవ్యాప్తంగా ఆందోళన చెందుతున్న ప్రస్తుత తరుణంలో మన రాష్ట్రంలో ఈ ఉపద్రవాన్ని ఎదుర్కోవడానికి కూటమి ప్రభుత్వం అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటుందన్నారు.

ఎల్ నినో లేని రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు జలధార-జలహారతి 100 రోజుల కార్యక్రమం చేపట్టారన్నారు. అతివృష్టి, అనావృష్టి ప్రాంతాల్లో డ్రైన్లు, కాలువలు ఏర్పాటు చేసి వీటిని సమీప చెరువులకు అనుసంధానించడం ద్వారా ప్రతి నీటి బొట్టు ఒడిసిపట్టవచ్చు అన్నారు. జలధార-జలహారతి కార్యక్రమంలో ఇప్పటికి 98 రోజులు పూర్తయ్యాయని, ఈ పనులన్నీ సత్ఫలితాలు ఇవ్వబోతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం భూమినే జలాశయంగా మార్చుకుని భూగర్భ జల సంపదను వృద్ధి చేయడమేనని ఆయన వివరించారు. భూగర్భ జల మట్టం ఒక మీటరు పెరిగితే 99 టీఎంసీల నీరు లభ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. అలాగే సమర్థ నీటి యాజమాన్యం వల్ల నీటి పొదుపును పాటించవచ్చు అన్నారు. ఉదాహరణకు మన కృష్ణా నదిని తీసుకుంటే జూరాల, ఆల్మట్టి, శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీళ్లు లేవు. మన పులిచింతలలో మాత్రం ఈరోజు కూడా 28 టీఎంసీల నీరు ఉంచుకోగలిగామని మంత్రి వివరించారు. 70 సంవత్సరాల చరిత్ర తీసుకుంటే జూలై 5వ తేదీన కూడా గోదావరికి ఇన్‌ఫ్లోలు లేకపోవడం ఇదే మొదటిసారి అని మన ఇరిగేషన్ నిపుణులు చెబుతున్నారు. నిన్న 56,000 క్యూసెక్కుల నీరు వచ్చిందని, ఈ నీటిలో 8,000 క్యూసెక్కులను ప్రతిరోజు పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు పంపుతామన్నారు.

ఇలా ప్రాధాన్యక్రమంలో అత్యవసరాల ప్రాతిపదికన నీటిని పొదుపుగా వాడుకుందామన్నారు. ఎల్ నినోని సమర్థంగా ఎదుర్కొందామన్నారు. ప్రతినిత్యం, ప్రతి ఎకరాకు, ప్రతి రైతుకి నీరు అందించాలని ఆలోచించే చంద్రబాబు ఉండటం మనకు దృష్టాంతంగా రామానాయుడు అభివర్ణించారు. అలాగే ప్రభుత్వంతో పాటు ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు ముఖ్యంగా రైతు సోదరులు కూడా పూర్తిగా సహకరించాలని రామానాయుడు విజ్ఞప్తి చేశారు. ఆరుతడి పంటలకు అవకాశం ఉన్న చోటల్లా ఆ పంటలు వేసి నీటి పొదుపును పాటించాలన్నారు. అలాగే ముందు తాగునీటికి, ఆ తరువాతనే సాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.



# గల్లంతైన మత్స్యకారులకు
# పరిహారం అందించిన మంత్రి కొల్లు

విశాఖపట్నం (చైతన్య రథం): చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతయిన ఆరు మత్స్యకార కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 10 లక్షలు చొప్పున 60 లక్షల రూపాయల పరిహారాన్ని రాష్ట్ర ఎక్సైజ్, గనుల మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ తదితరులు అందజేశారు.



బుధవారం స్థానిక హార్బర్ మెకనైజ్డ్ బోటు అసోసియేషన్ భవనంలో మత్స్యకార కుటుంబాలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి మంత్రి చెక్కులు పంపిణీ చేశారు. మత్స్య శాఖనుండి 5 లక్షలు, సీఎం రిలీఫ్ ఫండ్ నుండి 5 లక్షలు అందించి, అన్ని రకాలుగా ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ మత్స్యకారుల గల్లంతు విషయం ప్రభుత్వానికి సమాచారం అందిన వెంటనే అధికారులను, కోస్ట్‌గార్డ్‌ను అప్రమత్తం చేశామన్నారు. నావెల్, కోస్ట్‌గార్డ్‌తో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం జరిగి 72 గంటలు దాటిన ఈరోజు వరకు వారి ఆచూకీ లభించకపోవడంతో.. కారి చిన్న ఇచ్చిన సమాచారం, కోస్ట్‌గార్డ్ నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలమేరకు ఆరు కుటుంబాలకు మత్స్యశాఖ నుండి 5 లక్షలు, సీఎం రిలీఫ్ ఫండ్ నుండి 5 లక్షలు కలిపి మొత్తం 10 లక్షలు అందించడం జరిగిందన్నారు. బోటు ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన, బోటు మునిగిపోవడంతో నష్టపోయిన కారి చిన్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.10 లక్షల రూపాయలు పరిహారం ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. హుద్‌హుద్ తుఫానులో బోటు మునిగిపోతే 6 లక్షల రూపాయలు చొప్పున పరిహారం ఇచ్చి భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా నష్టపరిహారం అందజేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో మత్స్యకారులకు సంబంధించి నష్టపరిహారం కేసులు చాలా పెండింగులో ఉన్నాయని.. వారికి ఒక్క పైసా కూడా పరిహారం ఆనాటి ప్రభుత్వం ఇవ్వలేదని అంటూ.. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడు కోట్ల 15 లక్షల రూపాయలు విడుదలచేసి ఆ కుటుంబాలకు అంద జేస్తున్నామన్నారు.వేట నిషేధసమయంలో ఇచ్చే భృతిని 20వేలకు పెంచి అందించామని.. కొన్ని సాంకేతి కారణాలవల్ల ఈ ఏడాది కొంతమందికి ఆగాయని వారికోసం రూ.9కోట్ల రూపాయలు త్వరలో విడుదల చేసి నూరుశాతం అందిస్తామన్నారు. 50 సంవత్సరా లకే పెన్షన్ ఫిషింగ్ బోట్‌లకు ఆయిల్ సబ్సిడీ ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, గత ప్రభుత్వంలో ఒక వల ముక్క కూడా మత్స్యకారులకు ఇవ్వలేదని దుయ్యబట్టారు. మత్స్యకారులకు వలలు, బోట్లకు సబ్సిడీ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగాఉందని మంత్రి పేర్కొన్నారు. గల్లంతైన వారి ఆచూకీ లభిస్తుందని చూస్తున్నామని.. గాలింపు చర్యలు ఇంకా కొనసాగు తాయని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, మార్కెటింగ్ ఫెడరేషన్ చైర్మన్, బంగారాజు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ వర్దన్, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి పలువురు అధి కారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సముద్రంలో గల్లంతైన వారి కుటుంబ సభ్యులు రగుతుల లక్ష్మీ, కే మౌనిక, కే నారాయణమ్మ, ఎ.లక్ష్మి, దమయంతిలకు మంత్రి రవీంద్ర చెక్కులను పంపిణీ చేశారు.



చైతన్యరథం

# ప్రజల్లోకి.. ప్రభుత్వ సంక్షేమం!

- **అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విస్తృత ప్రచారం**
- **డిజిటల్ కమ్యూనికేషన్ బలోపేతానికి మంత్రి కొలుసు దిశానిర్దేశం**



అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింతవేగంగా, ప్రభావవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. తాడేపల్లిలోని ఏపీ డిజిటల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంత్రి బుధవారం సందర్శించి సంస్థ కార్యకలాపాలను సమీక్షించార. ఈ సందర్భంగా గత రెండేళ్లలో ప్రభుత్వ సోషల్ మీడియా వేదికల ద్వారా సుమారు మిలియన్ల వ్యూయర్ టచ్‌పాయింట్లు నమోదైన అంశంపై చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి చేరేలా డిజిటల్ ప్రచారాన్ని విస్తరించాలని సూచించారు. సమావేశంలో ప్రధానంగా.. ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ కార్యక్రమాలకు సంబంధించిన ధృవీకరించబడిన సమాచారాన్ని సకాలంలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌తో పంచుకోవాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేయడం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ సందేశాల విస్తరణకు డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లను ప్రభుత్వ కమ్యూనికేషన్‌లో భాగస్వాములను చేసే విధంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఏపీడీసీని ఆదేశించారు. ప్రజలకు విశ్వసనీయమైన సమాచారం అందించేందుకు పోలీసు శాఖ ధృవీకరించిన సమాచారాన్ని ఏపీడీసీతో సమన్వయం చేసుకునే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ చేరువను పెంచేందుకు వ్యూహాత్మక సోషల్ మీడియా ప్రచారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ సోషల్ మీడియా వేదికల కోసం నాణ్యమైన డిజిటల్ కంటెంట్ రూపొందించేందుకు ప్రత్యేక కంటెంట్ క్రియేటర్లను నియమించాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రజల్లో అధిక ఆదరణ పొందుతున్న రీల్స్ మరియు షార్ట్-ఫామ్ వీడియో కంటెంట్ ప్రభుత్వ డిజిటల్ కమ్యూనికేషన్‌లో కీలక భాగంగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాహిత నిర్ణయాలను, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర డిజిటల్ వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోషల్ మీడియా యూనిట్లను పూర్తిస్థాయిలో క్రియాశీలం చేసి, ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. సమావేశంలో మంత్రి పార్థసారథి సంస్థ ఉద్యోగుల సమస్యలను కూడా అడిగి తెలుసుకుని, సంస్థ కార్యకలాపాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి సుష్మిత, ఐ అండ్ పీఆర్ స్పెషల్ ఆఫీసర్ గల్లా శేషుకుమార్, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కారుణ్య మరణాలకు మార్గం సుగమం!

- **సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు చర్యలు**
- **మార్గదర్శకాలను ఆమోదించిన మంత్రి సత్యకుమార్ యాదవ్**
- **వైద్యులు, రోగుల కుటుంబీకుల నిర్ణయాలకు చట్టబద్ధత**
- **అంతిమ దశలో ఉన్న రోగులకు ఊరట**



అమరావతి (చైతన్య రథం): తీవ్రమైన వ్యాధులకు గురై, చికిత్సకు లొంగని స్థితిలో వెంటిలేటర్ సహాయంతో ఊపిరి పీల్చుకుంటూ, మరణానికి చేరువై నరక యాతన అనుభవించే రోగులకు ఊరట కల్పించేదిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన నిర్ణయాన్ని తీసుకుంది. సుప్రీం కోర్టు ఆదేశాలకనుగుణంగా అటువంటి వారికి కారుణ్య మరణం లభించేలా విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. వ్యాధినుంచి కోలుకునే అవకాశం ఏమాత్రమూ లేక చికిత్సల పేరిట నానా ఇబ్బందులు పడే వారికి ఈ నిర్ణయం ఎంతో ఊరట కల్పించనుంది.

## గౌరవప్రద మరణం పౌరుల ప్రాథమిక హక్కు

భారత రాజ్యాంగంలోని 21వ అధికరణ కింద గౌరవప్రదమైన మరణం పౌరుల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసిన సుప్రీం కోర్టు ఇందుకు సంబంధించి 2018లో 'కామన్ కాజ్' అనే స్వచ్ఛందసంస్థ దాఖలుచేసిన రిట్ పిటిషన్‌లో ఇచ్చిన తీర్పునకు జనవరి 2023లో కొన్ని సవరణలు చేసింది. అంతకుముందు అవసాన దశలో ఉన్న వారికి వైద్యులందించే లైఫ్ సపోర్ట్ సిస్టంను (వెంటిలేటర్ సపోర్ట్ వంటివి) తొలగించేందుకు సంబంధించి ఎటువంటి చట్టపరమైన నిబంధనలు లేకపోవడంతో ఆసుపత్రులు, వైద్యులు, రోగుల కుటుంబాలకు పలు చిక్కులు ఎదురయ్యే పరిస్థితి ఉండేది. దీని కారణంగా... చికిత్స నిష్ప్రయోజనమని తెలిసినా కృత్రిమంగా రోగులు ఊపిరి పీల్చుకుంటూ పలు కష్టనష్టాలకు గురయ్యేవారు.

## కారుణ్య మరణాలకు మార్గదర్శకాలు

అవసాన దశలో ఉన్న రోగులకు సహజ రీతిలో కారుణ్య మరణాల అవకాశాలను కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా రూపొందించిన మార్గదర్శకాలను వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి బుధవారం ఆమోదం తెలిపారు. వీటి ద్వారా రోగుల స్వయం నిర్ణయాధికారాన్ని గౌరవిస్తూ చికిత్సనందించే వైద్యులు, కారుణ్య మరణాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే రోగుల కుటుంబీకులకు చట్టపరమైన రక్షణ లభిస్తుంది. ఎటువంటి అవకతవకలకు వీలులేకుండా ఈ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయడానికి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, జిల్లాస్థాయి డిఎంహెచ్‌వోలను ప్రభుత్వం బాధ్యులను చేసింది.

## ప్రధాన మార్గదర్శకాలు:

వ్యాధితో బాధపడుతున్న రోగి ఎటువంటి నిర్బంధానికి గురికాకుండా, పూర్తి చేతనావస్థలో ఉండి, స్వతంత్రంగా, ఇద్దరు సాక్షుల సమక్షంలో ఇక ముందు తనకందించాల్సిన చికిత్సపై పరిస్థితులకనుగుణంగా తగు నిర్ణయం తీసుకునే గార్డియన్‌ను సూచిస్తూ సంతకంతో కూడిన 'అడ్వాన్స్ డైరెక్టివ్'ని రూపొందించవచ్చు. దీనిని నోటరీ లేదా గజిటెడ్ అధికారి ధ్రువీకరించాలి. చికిత్సకు లొంగక అవసాన దశకు చేరిన రోగి పరిస్థితిని చికిత్సనందిస్తున్న వైద్యులు పరీక్షించి అడ్వాన్స్ డైరెక్టివ్‌లో పొందుపరచిన నిర్ణయాన్ని అందులో సూచించిన గార్డియన్‌కు తెలియజేసి, కొనసాగుతున్న చికిత్సను ఆపివేయడం ఉత్తమమని వైద్యుడు నిర్ణయానికొస్తే ఆ సంగతి గార్డియన్‌కు వివరించాలి. ఇతరుల విషయంలో చికిత్సను ప్రారంభించడం నిష్ప్రయోజమని భావిస్తే ఆ విషయాన్ని గార్డియన్‌కు తెలపాలి. అట్టి పరిస్థితుల్లో చికిత్సనందిస్తున్న ఆసుపత్రి అవసాన దశలో ఉన్న రోగి పరిస్థితిని పరిశీలించేందుకు, చికిత్సనందిస్తున్న వైద్యునితోపాటు 5 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన మరో ఇద్దరు వైద్యులతో ప్రైమరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి 48 గంటల్లో ప్రాథమిక నిర్ణయాన్ని తీసుకోవాలి. రోగికి చికిత్సనందించడం నిష్ప్రయోజనమని ప్రైమరీ మెడికల్ బోర్డు భావిస్తే సదరు వైద్యుడు, డిఎంహెచ్ఓ మరియు చికిత్సతో సంబంధంలేని మరో ఇద్దరు వైద్యులతో కూడిన సెకండరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలి. ఈ రెండు మెడికల్ బోర్డుల అభిప్రాయాలను, గార్డియన్ సమ్మతిని ఆసుపత్రి చికిత్సను ఆపివేసే ముందు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు తెలియజేయాలి. సెకండరీ మెడికల్ బోర్డు రోగికి చికిత్సను ఆపివేయడానికి అంగీకరించనపుడు రోగి సూచించిన గార్డియన్ హైకోర్టును ఆశ్రయించవచ్చు. హైకోర్టు 20 ఏళ్ల అనుభవంగల వైద్యులతో స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేస్తుంది.


## అనుకోని పరిస్థితుల్లో...

అవసాన దశలో ఉన్న రోగి ముందస్తుగా 'అడ్వాన్స్‌డ్ డైరెక్టివ్'ను ఇవ్వని పరిస్థితుల్లో రోగి పరిస్థితిని సంబంధిత డాక్టర్ ఆసుపత్రికి తెలియజేస్తే, వారు ప్రైమరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి రోగి సంబంధించిన వారితో చికిత్సను ఆపివేయడం లేక ప్రారంభించక పోవడం వలన కలిగే పరిణామాలను క్షుణ్ణంగా వివరించి వాటిని రాతపూర్వకంగా పొందుపరుస్తారు. అనంతరం సెకండరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేస్తారు. భిన్నాభిప్రాయాలు ఎదురైతే రోగి సంబంధీకులు హైకోర్టును ఆశ్రయించవచ్చు. చివరిగా రోగికి లైఫ్ సపోర్టును తొలగిస్తే ఆ సంగతిని సంబంధిత మేజిస్ట్రేట్ హైకోర్టుకు తెలియపర్చాలి. ఈ ప్రక్రియకు సంబంధించిన రికార్డుల్ని రోగి మరణానంతరం మూడేళ్లవరకు భద్రపర్చాలి. కారుణ్య మరణాలకు వీలుకల్పించే ఈప్రక్రియను అత్యంత పటిష్టంగా పర్యవేక్షించాలని, ఏ దశలోనూ పొరపాటు జరగకుండా తగుచర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

# సొంతిళ్లులా బీసీ గురుకులాలు, హాస్టళ్లు

- **10 శాతం డైట్ ఛార్జీల పెంపు**
- **రూ.500 కోట్ల సాస్కి నిధుల కేటాయింపు**
- **సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు**

అమరావతి (చైతన్య రథం): అన్ని సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థుల డైట్ బిల్లులు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోడంపై బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. ఎంజేపీ స్కూళ్ల శాశ్వత భవన నిర్మాణాలకు రూ.500 కోట్ల సాస్కి నిధులు మంజూరు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీచేశారు. బీసీ బిడ్డల విద్యపట్ల సీఎం చంద్రబాబుకున్న చిత్తశుద్ధికి డైట్ ఛార్జీల పెంపుతోపాటు సాస్కి నిధులు మంజూరే నిదర్శన మన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదలచేశారు.డైట్ ఛార్జీల పెంపుతో విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం అందించే వీలుకలుగుతుందన్నారు. ముఖ్యంగా బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం రెండేళ్లలో వందల కోట్లు వెచ్చిస్తోందన్నారు.



అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం పెట్టిన రూ.110 కోట్ల డైట్ బిల్లులను చెల్లించిందన్నారు. ఎప్పటికప్పుడు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తూ వస్తోందన్నారు. ఎంజేపీ గురుకులాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఇటీవల ఆరు ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. కొత్తగా పది గురుకుల పాఠశాలలను మంజూరు చేశామన్నారు. ఇప్పుడు ఎంజేపీ గురుకులాలకు శాశ్వత భవనాలు కల్పించాలన్న లక్ష్యంతో రూ.500 కోట్ల సాస్కి నిధుల మంజూరుకు సీఎం చంద్రబాబు ఆదేశించడం ఆనందకర విషయమన్నారు. బీసీ గురుకులాల్లో సొంతింటి కంటే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఎంజేపీ గురుకులాల్లో ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. బీసీ బిడ్డలు ఉన్నత చదువులు అభ్యసించేలా సీఎం చంద్రబాబునాయుడు ఎన్ని కోట్లయినా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి సవిత ప్రకటనలో పేర్కొన్నారు.

# మెస్ ఛార్జీల పెంపు నిర్ణయంపట్ల మంత్రి డిఎస్ బీవీ స్వామి హర్షం

**సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి**

అమరావతి (చైతన్య రథం): సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల మెస్‌ఛార్జీలు 10శాతం పెంపునకు ప్రభుత్వం నిర్ణయించడం పట్ల సాంఘికసంక్షేమ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి స్వామి.. "రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల మెస్ ఛార్జీలు 10శాతం పెంపునకు ప్రభుత్వ నిర్ణయం శుభపరిణామం. ఇది విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించేందుకు దోహదపడుతుంది. కూటమి పాలనలో పేద విద్యార్థులకు కార్పొరేట్ దీటుగా నాణ్యమైన విద్య, మెరుగైన సంక్షేమం అందిస్తున్నాం. వైసీపీ హయాంలో హాస్టళ్లు, గురుకులాలు సమస్యలకు నిలయాలుగా ఉండేవి. రెండేళ్లలో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో సమూల మార్పులు తీసుకొచ్చాం. రూ.143 కోట్లతో 700హాస్టళ్లకి మరమ్మతులు చేశాం. రూ.58కోట్లతో అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో అదనపు మరుగుదొడ్లు నిర్మించాం. పేద విద్యార్థుల్ని డాక్టర్లు, ఇంజనీర్లు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పంతో ఐఐటి, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లను పెంచాం. తిరుపతి, విజయవాడ, విశాఖ స్టడీ సర్కిళ్లలో 450మందికి ఉచితంగా సివిల్స్ కోచింగ్ ఇస్తు న్నాం.నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉద్యోగఅవకాశాల కల్పనకు చర్యలుచేపట్టాం. విదేశీ విద్యను అభ్యసించే అన్నివర్గాల పేద విద్యార్థుల కోసం పథకా నికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పేద విద్యార్థులు సమాజం లో ఉన్నతస్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం. పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించేం దుకు కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చుకైనా వెనకాడదు" అని పేర్కొన్నారు.



# వెల్లువెత్తిన భూకబ్జా ఫిర్యాదులు

- వైసీపీ నేతల భూదాహం.. గ్రీవెన్స్‌లో వెల్లడైన బాధితుల గోడు
- భూరికార్డుల గందరగోళం, బెదిరింపులు..
- మంత్రి వాసంశెట్టికి వెల్లువెత్తిన అర్జీలు
- రెవెన్యూ రికార్డుల జాప్యంపైనా పలువురు బాధితుల ఫిర్యాదు
- సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చిన మంత్రి సుభాష్



మంగళగిరి (చైతన్య రథం): ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం ఇప్పగుంట గ్రామానికి చెందిన ముతకని కవిత నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. తాము ఎంతో కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ముతో 2022లో తమ బంధువు నుంచి ఒక ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశామని, మతిస్థిమితం సరిగా లేని కుమారుడు, వృద్ధురాలైన బంధువుతో కూడిన తమ పేద కుటుంబం కొనుగోలు చేసిన ఈ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకుడు కోనంకి మాధవరావు అక్రమంగా ఆక్రమించుకున్నాడని ఆమె వాపోయారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులను, ధన బలాన్ని అడ్డుపెట్టుకుని తమను ఇల్లు కట్టుకోనివ్వకుండా అడ్డుకోవడంతో పాటు, మద్యం సేవించి బూతులు తిడుతూ ప్రాణ బెదిరింపులకు దిగాడని, తమపైనే అక్రమ కేసులు పెట్టించి కోర్టుల చుట్టూ తిప్పి మానసిక ఒత్తిడికి గురిచేశాడని ఆరోపించారు. ఈ వేధింపులు భరించలేక తమ కుటుంబం ఆత్మహత్యకు సిద్ధపడగా స్థానిక బంధువులు అడ్డుకుని ప్రాణాలు కాపాడారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ బీటీ నాయుడులను ఆమె కోరారు.

తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన జె.బి. గిరిధర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. కోటిలింగాల పరిధిలోని కె-5 ఇసుక ర్యాంప్ తొలుత అంబేద్కర్ చైతన్య సంఘానికి కేటాయించగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసోసియేషన్లకు నేరుగా ఇవ్వకూడదన్న కారణంతో సభ్యులందరినీ 'గుర్రం జాషువా ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ'లో చేర్చి, తనను ప్రెసిడెంట్‌గా నియమించి ర్యాంప్ అనుమతులు పొందారని తెలిపారు. కానీ ర్యాంప్ ప్రారంభమైన 20 రోజుల్లోనే వైసీపీకి చెందిన వల్లూరి రాజకుమార్, అతని సోదరులు రంగంలోకిదిగి, అసలైన సభ్యులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సొసైటీ నుంచి తొలగించారని ఆరోపించారు. ఇటీవల ఒక రిటైర్డ్ ఉద్యోగిని ఎలక్షన్ ఆఫీసర్‌గా చూపిస్తూ, ముందస్తు నోటీసులు లేకుండా, డీసీఓ అనుమతి లేకుండానే ఏకగ్రీవ ఎన్నిక జరిగినట్టు తప్పుడు పత్రాలు సృష్టించి తనను పదవినుంచి తొలగించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ర్యాంప్‌ను నిర్వహిస్తున్న సొసైటీకి ఇసుక తవ్వకాలకు అవసరమైన అర్హతలు, లైసెన్సులు, బోట్లు ఏవీ లేవని, పైగా ర్యాంప్‌కు వెళ్లే బాటపై కోర్టు స్టే ఉన్నా, మహిళలను అధికారుల వద్దకు పంపి తప్పుడు కేసులు పెట్టిస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తూ వల్లూరి సోదరులు ర్యాంప్‌ను ఇతరులకు అమ్ముకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. తాము కొత్తగా ఏర్పాటు చేసుకున్న 100 శాతం అర్హత కలిగిన ఎస్సీ బోట్స్‌మెన్ సొసైటీకి ర్యాంప్‌ను కేటాయించి, విషయంపై విచారణ జరిపించాలని కోరారు.



అనంతపురం జిల్లా రాయదుర్గానికి చెందిన నీలం యల్లమ్మ తమ అత్త, మామ పేరిట ఉన్న 20 ఎకరాల వారసత్వ భూమిని స్థానిక వీఆర్వోతో కుమ్మక్కై ఇద్దరు వ్యక్తులు అక్రమంగా తమ పేర్ల మీద ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రశ్నించినందుకు తమను, తమ కుటుంబాన్ని చంపేస్తామని బెదిరింపులకు దిగారని, ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నమయ్య జిల్లా చిన్నమండలానికి చెందిన పిరభి తాను స్వయంగా సాగు చేసుకుంటున్న భూమి రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల్లో మరో వ్యక్తి పేరిట నమోదై ఉందని తెలిపారు. రికార్డుల్లో పేరున్న వ్యక్తి కూడా ఈ భూమిని అసలు సాగుదారు పేరు మీదకు మార్చడానికి అభ్యంతరం లేదని అగ్రిమెంట్ రాసిచ్చి, రెవెన్యూ అధికారుల ఎదుట స్పష్టం చేసినప్పటికీ ఆన్‌లైన్ రికార్డుల్లో మార్పు ఇంకా పూర్తి కాలేదని, దీన్ని వెంటనే సరిచేయాలని కోరారు.

కర్నూలు జిల్లా మంత్రాలయం మండలానికి చెందిన వడ్ల తిక్కస్వామి తనకున్న భూమిలో కొంత భాగం మాత్రమే ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదైందని, మిగిలిన భూమి నమోదు కావాల్సి ఉందని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు, రిజిస్టర్డ్ పత్రాలు, ప్రభుత్వ సర్వేయర్ కొలిచిన హద్దుల పటంతో సహా అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నా, మూడేళ్లుగా తహశీల్దార్, సబ్ కలెక్టర్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఏ అధికారీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, తన వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి భూమిని తన పేరిట నమోదు చేయాలని కోరారు.

అనంతపురం జిల్లా అక్కమ్మపల్లికి చెందిన వన్నూర్ వలి తన తాత పేరిట ఉన్న భూమిని, ఆయన జీవించి ఉండగానే రిజిస్టర్డ్ వీలునామా ద్వారా తన పేరిట మార్చినప్పటికీ, రెవెన్యూ అధికారులు ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా ఆన్‌లైన్ రికార్డుల నుంచి తాత పేరును తొలగించి, ఇద్దరు ఇతర వ్యక్తుల పేరిట నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, చర్యలు తీసుకోవాలని కోరారు.

గుంటూరు జిల్లా ఓబులనాయుడుపాలేనికి చెందిన యార్లగడ్డ సాంబశివరావు గత రీ-సర్వేలో దొర్లిన తప్పులను ఆసరాగా చేసుకుని ఇద్దరు వ్యక్తులు తన భూమిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. మండల సర్వేయర్ కొలతల్లోనూ తన భూమి తగ్గించి చూపారని, ఆ మేరకు తగ్గిన భూమిని ఒక వ్యక్తి ఆక్రమించుకున్నాడని, పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోతూ, నిష్పక్షపాతంగా మరోసారి రీ-సర్వే జరిపించి న్యాయం చేయాలని కోరారు.

తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లికి చెందిన ఎద్దుల వెంకటేశ్వరి ప్రభుత్వం తనకు మంజూరు చేసిన భూమిని కేటాయించిన నాటి నుంచి తానే స్వయంగా సాగు చేసుకుంటున్నా, ఇప్పటికీ అది తన పేరిట ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు కాలేదని తెలిపారు. అధికారులను పలుమార్లు అభ్యర్థించినా పట్టించుకోవడం లేదని, పాత రికార్డులను పరిశీలించి తన పేరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ఆలమూరుకు చెందిన అనకల రామలక్ష్మి తన కుమార్తె విష్ణుప్రియను భర్త పదేళ్లుగా అనుమానిస్తూ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. పోలీసుల కౌన్సెలింగ్, బంధువుల పంచాయితీలు జరిపినా భర్త ప్రవర్తనలో మార్పు రాలేదని, ఇటీవల మళ్లీ తీవ్ర వేధింపులకు దిగాడని, స్థానిక పోలీసులకు, పెద్దలకు తెలిపినా తక్షణ చర్యలు తీసుకోలేదని, కూతురి ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు.

గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలేనికి చెందిన ఏసుప్రసాద్ తమ సోదరుడి పేరిట ఉన్న భూమి పొరపాటున రెవెన్యూ రికార్డుల్లో 'ప్రభుత్వ భూమి'గా నమోదైందని, దీన్ని సరిదిద్దాలని తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకోగా, క్షేత్రస్థాయి విచారణ జరిపి తమకు అనుకూలంగా నివేదిక ఇచ్చారని తెలిపారు. అయితే ఆ నివేదికను ఆమోదించి రికార్డులు సవరించాల్సిన గుంటూరు ఆర్డీఓ కార్యాలయం రెండేళ్లుగా ఫైలును పెండింగ్‌లో ఉంచడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు అందించగా, మరికొందరు ఉద్యోగాల కోసం రెజ్యూమ్‌లు సమర్పించారు. ఆర్థిక సాయం, ఆరోగ్య సమస్యలకు తోడ్పాటు కోరుతూ మరికొందరు అభ్యర్థనలు అందించారు.

---

## మెడికల్ విద్యార్థినులకు

# మెరుగైన వైద్య సేవలందించండి

### కడప కలెక్టర్, డీఎంహెచ్‌వోకు ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశం



అమరావతి (చైతన్య రథం): కలుషిత ఆహారం కారణంగా రిమ్స్ మెడికల్ హాస్టల్ విద్యార్థినులు అస్వస్థత గురికావడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థినుల ఆర్యోగంపై ఆరా తీస్తూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చెరకూరి శ్రీధర్, డీఎంహెచ్‌వో డాక్టర్ రవి రాథోడ్‌ను ఫోన్‌లో ఆదేశించారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని రిమ్స్ ఆసుపత్రికి చెందిన మెడికల్ హాస్టల్ విద్యార్థినులు కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురి కావడంపై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లా కలెక్టర్ చెరకూరి శ్రీధర్‌ను, డీఎంహెచ్‌వో డాక్టర్ రవి రాథోడ్, రిమ్స్ ఆసుప్రతి సూపరింటెండెంట్‌తోనూ ఫోన్లో మాట్లాడారు. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంపై నివేదికివ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, రిమ్స్‌లో ఉంచే వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి సవితకు జిల్లా కలెక్టర్ చెరకూరి శ్రీధర్, డీఎంహెచ్‌వో రవి రాథోడ్ వివరించారు. బుధవారం రాత్రికి కొందరిని డిశ్చార్జి చేసే ఆలోచన చేస్తున్నామని,శారీరకంగా బలహీనంగా ఉన్న విద్యార్థినులకు వైద్య సేవలు అందించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ, విద్యార్థినులను నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం చూపితే సహించేది లేదన్నారు. హాస్టల్‌లో మిగిలిన విద్యార్థినులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలని, తాజా ఆహారంతోపాటు వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. వాతావరణంలో మార్పులు దృష్ట్యా మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు.

# భక్తుల విశ్వాసాలపై రాజకీయాలా?

- దేవాలయాలపై అసత్య ప్రచారాలు అత్యంత బాధ్యతారాహిత్యం
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆగ్రహం

అమరావతి (చైతన్య రథం): దేవుడిపై భక్తిని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం, ఆలయాలపై అసత్య ప్రచారాలు చేయడం, కోట్లాది భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రంగా ఖండించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఎలాంటి కుట్రలనైనా రాష్ట్ర ప్రభుత్వం సహించబోదని హెచ్చరించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ హిందూ ధార్మిక సంస్థలపై అనుమానాలు సృష్టించడం, భక్తుల్లో అపోహలు కల్పించడం, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడం అనే రాజకీయ ఉద్దేశంతో నిరాధారమైన కథనాలతో వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమైన విషయం అన్నారు.

అదేవిధంగా దేవాదాయ శాఖపై అసంపూర్ణ గణాంకాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ధర్మ పరిరక్షణ, ఆలయాల సమగ్రాభివృద్ధి, భక్తులకు అత్యుత్తమ సేవలందించడం, పారదర్శక పాలనను మరింత బలోపేతం చేయడం పట్ల ప్రభుత్వం సంపూర్ణ నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. వాస్తవాలు, పూర్తి గణాంకాలు, పారదర్శక సమాచారంతో చర్చించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

**దేవాలయాలు రాజకీయ ప్రయోగశాలలు కావు...**

దేవాలయాలు కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకలని, వాటిని రాజకీయ ప్రయోగాలకు వేదికలుగా మార్చే ప్రయత్నాలను ప్రజలు ఎన్నటికీ అంగీకరించరని మంత్రి స్పష్టం చేశారు. అసంపూర్ణ గణాంకాలు, వక్రీకరించిన సమాచారం ఆధారంగా ప్రజల్లో అపోహలు సృష్టించడం ఎంతో బాధ్యతారాహిత్యమని అన్నారు. విమర్శలు చేయాలంటే పూర్తి వాస్తవాలు, సమగ్ర గణాంకాలు, నిర్ధారిత సమాచారం ఆధారంగానే చేయాలని, అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

**మా ప్రభుత్వం మాటల్లో కాదు... చేతల్లో చూపిస్తోంది...**

కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి, ధర్మ పరిరక్షణ, భక్తులకు మెరుగైన సేవల కల్పనను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని పనిచేస్తోందని మంత్రి తెలిపారు. చారిత్రక దేవాలయాల పునరుద్ధరణ, పారదర్శక పరిపాలన, మౌలిక వసతుల విస్తరణ, డిజిటల్ సేవలు, అన్నప్రసాద కార్యక్రమాల విస్తరణ వంటి అనేక సంస్కరణలు చేపట్టామని చెప్పారు. ఈ అభివృద్ధిని కప్పిపుచ్చేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేయడం విచారకరమన్నారు.

**గతంలో ఎందుకు స్పందించలేదో సమాధానం చెప్పాలి...**

ఈరోజు దేవాలయాలపై ఆవేదన వ్యక్తం చేస్తున్న వారు, గత పాలనలో రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకున్న దేవాలయాలపై దాడులు, విగ్రహాల విధ్వంసాలు, రథాల దహన ఘటనల సమయంలో ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి ప్రశ్నించారు. కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నప్పుడు అదే స్థాయిలో స్పందించారా? ప్రధాన కథనాలు ప్రచురించారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు మాత్రం వాస్తవాలను వక్రీకరించి భక్తుల్లో అనవసర అనుమానాలు సృష్టించే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు.

**దేవాదాయ శాఖ వ్యాపార సంస్థ కాదు...**

దేవాదాయశాఖ లక్ష్యం ఆదాయం ఆర్జించడం కాదని, ధర్మపరిరక్షణ, ఆలయాల అభివృద్ధి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడమేనని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్ణయించిన రుసుములనే కొనసాగిస్తున్నామని, అదనపు భారం మోపకుండా కోట్లాది రూపాయలతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. భక్తులను హుండీలు నింపేవారిగా కాకుండా ధర్మసంరక్షకులుగా చూస్తున్నామనిఅన్నారు.

**ఆదాయాలపై అసత్య ప్రచారం...**

కొన్ని గణాంకాలను మాత్రమే చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగిందని మంత్రి విమర్శించారు. వాస్తవానికి విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ దేవస్థానం, అన్నవరం, శ్రీశైలం, సింహాచలం, ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం తదితర ప్రధాన దేవాలయాల్లో మొత్తం ఆదాయం,




హుండీ ఆదాయం, భక్తుల సంఖ్య అన్నీ పెరిగాయని స్పష్టం చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా నమోదైన వాస్తవ గణాంకాలు...**

రాష్ట్రంలోని 22 ప్రధాన దేవాలయాల మొత్తం ఆదాయం 2023-24లో రూ. 1,379.19 కోట్లు ఉండగా, 2025-26 నాటికి రూ. 1,503.90 కోట్లకు చేరుకుందని మంత్రి వెల్లడించారు. మొత్తం రూ. 124.71 కోట్ల అదనపు ఆదాయం నమోదై దాదాపు 9 శాతం వృద్ధి సాధించినట్టు తెలిపారు. అదేవిధంగా 2023-24లో 634.68 లక్షల మంది భక్తులు ప్రధాన దేవాలయాలను సందర్శించగా, 2025-26లో ఆ సంఖ్య 805.04లక్షలకు చేరుకుందని తెలిపారు. అంటే అదనంగా 170.36 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, ఇది సుమారు 27శాతం వృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా శ్రీశైలం దేవస్థానంలో ఆదాయం రూ. 178.82 కోట్ల నుంచి రూ. 217.24కోట్లకు పెరిగిందని, భక్తుల సంఖ్య 82.18 లక్షల నుంచి 119.71 లక్షలకు చేరుకుందని తెలిపారు. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి ఆలయంలో ఆదాయం రూ. 23కోట్ల నుంచి రూ. 56 కోట్లకు పెరిగిందన్నారు. విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో భక్తుల సంఖ్య 93.40 లక్షల నుంచి 119.34 లక్షలకు, అన్నవరం దేవస్థానంలో 45.50 లక్షల నుంచి 57.87 లక్షలకు పెరిగిందని వెల్లడించారు.

**ఆదాయం ఒక్కటే భక్తికి కొలమానం కాదు...**

ఆలయాల పనితీరును కేవలం నికర ఆదాయం ఆధారంగా అంచనా వేయడం సరైన పద్ధతి కాదని మంత్రి పేర్కొన్నారు. భక్తుల సంఖ్య, హుండీ ఆదాయం, సేవల విస్తరణ, దాతల విరాళాలు, అన్నప్రసాద కార్యక్రమాలు, డిజిటల్ సేవలు, ఇతర ఆదాయ వనరులు వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించినప్పుడే వాస్తవ పరిస్థితి తెలుస్తుందని అన్నారు.

**అన్నప్రసాద సేవల విస్తరణ...**

ప్రస్తుతం రాష్ట్రంలోని 111 ఆలయాల్లో అన్నప్రసాద వితరణ జరుగుతోందని మంత్రి తెలిపారు. ప్రతిరోజూ సుమారు 80 వేల మంది, నెలకు 24 లక్షల మంది, సంవత్సరానికి దాదాపు 3 కోట్ల మంది భక్తులకు అన్నదానం అందిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ. 84 కోట్లు వెచ్చిస్తోందని, త్వరలో మరో 59 ఆలయాలకు ఈ సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు.

**పారదర్శక పాలన -డిజిటల్ సంస్కరణలు...**

హుండీ లెక్కింపును పూర్తిగా సీసీటీవీ పర్యవేక్షణలో, అధికారులు, బ్యాంకు ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎక్కడైనా ఫిర్యాదు అందితే వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దాదాపు 70 శాతం మంది భక్తులు ఆన్‌లైన్, మనమిత్ర తదితర డిజిటల్ సేవలను వినియోగిస్తున్నారని, హెల్ప్‌డెస్కులు, కియోస్కులు, డిజిటల్ వ్యవస్థల ద్వారా సేవలను మరింత పారదర్శకంగా అందిస్తున్నామని తెలిపారు.

**ఆలయాల అభివృద్ధిలో అపూర్వ పురోగతి...**

గత ప్రభుత్వం 919 దేవాలయాలకు నిధులు మంజూరు చేసినప్పటికీ కేవలం 372 పనులు మాత్రమే పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం పెండింగ్ పనులను వేగవంతం చేసి ఇప్పటికే 282 పనులు పూర్తి చేసిందని, మరో 236 పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. అదనంగా 659 దేవాలయాలకు రూ. 789.92 కోట్లతో అభివృద్ధి పనులకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని 276 దేవాలయాల అభివృద్ధికి రూ. 87.03 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే టీటీడీ సహకారంతో రూ. 750 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఆలయం లేదా భజన మందిరం ఏర్పాటు చేసే మహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించినట్లు వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సలహాదారులు సీతారామాంజనేయ ప్రసాద్, కమిషనర్ రామచంద్రమోహన్ పాల్గొన్నారు.

# గూటుపల్లి రైతులకు ఊరట

- నిషేధిత జాబితా నుండి 2074 ఎకరాలు తొలగింపు
- రైతుల సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్
- గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తున్నామన్న మంత్రి ఫరూక్

అమరావతి (చైతన్య రథం): నంద్యాల జిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గం బేతంచర్ల మండలంలోని గూటుపల్లి గ్రామ భూములకు నిషేధిత భూముల జాబితా నుండి విముక్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గూటుపల్లి పరిధిలో నిషేధిత జాబితాలో కొనసాగుతూ వస్తున్న 2074.59 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితానుంచి తొలగిస్తూ జీవో నెంబర్-77ను బుధవారం ప్రభుత్వం జారీ చేసింది. రైతుల వినతి మేరకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని గూటుపల్లి గ్రామ పరిధిలోని 142 సర్వే నెంబర్లలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేసినట్లు మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తున్నామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

**వక్ఫ్ ఆస్తుల జాబితాలోకి చేర్చడంతో ఇబ్బందులు**

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వ ఐదేళ్లకాలంలో రెవిన్యూ శాఖలో తీసుకున్న అసంబద్ధమైన నిర్ణయాలతో రైతులకు సంబంధించిన, సాగు చేసుకుంటున్న భూములను నిషేధిత 22ఏ జాబితాలోకి చేర్చడంతో పట్టాదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామ పరిధిలోని భూములు కూడా ఆనాడు 22ఏ జాబితాలోకి చేరాయి. గ్రామంలో ఉన్న 215 సర్వే నంబర్లను (195 పట్టా భూములు, 18 సర్వీస్ ఇనామ్ భూములు మరియు 2 ఎండోమెంట్ భూములు) రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ(1)(సి) కింద నిర్వహించబడుతున్న నిషేధిత ఆస్తుల జాబితాలో వక్ఫ్ ఆస్తులుగా చేర్చారు. దీని ఫలితంగా దాదాపు 1,000 మంది ఖాతాదార్లు రిజిస్ట్రేషన్లు, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులు పడుతూ వచ్చారు. గూటుపల్లి సమస్య మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వద్దకు వచ్చింది. వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్ విచారణ చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, వక్ఫ్ బోర్డు సీఈఓ యాకుబ్ భాషాలను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు విచారణ చేసిన అధికారులు గూటుపల్లి గ్రామంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చబడి, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనని నివేదించారు. ఫలితంగా 142 సర్వే నంబర్లలోని 2074.59 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22-ఎ(1)(సి) కింద నిర్వహించబడుతున్న నిషేధిత ఆస్తుల జాబితా నుండి తొలగించాలని ఆదేశిస్తూ జీవో నెంబర్-77ను ప్రభుత్వం జారీ చేసినట్టు మంత్రి ఫరూక్ తెలిపారు. నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న మరో 613.84 ఎకరాల విస్తీర్ణంగల మిగిలిన 74 సర్వే నంబర్ల విషయంలో తదుపరి సవివరమైన పరిశీలన, ధృవీకరణ అవసరముందని,




త్వరలో దీనిని కూడా పరిష్కరిస్తామని మంత్రి అన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టి ఉత్తర్వులు జారీ చేసిందని మైనారిటీ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా తమ గ్రామ సమస్యను, రైతుల ఇబ్బందులను ప్రత్యేకంగా గుర్తించి నిషేధిత జాబితా నుండి తమ భూములను తొలగించడంపట్ల గూటుపల్లి రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# కుల వృత్తుదారులకు ఆధునిక పరికరాలు

- మంత్రులు డోలా శ్రీ బాలవీరంజనేయ స్వామి, ఎస్ సవిత
- సచివాలయంలో లిడ్ క్యాప్ ఔట్ లెట్‌ను ప్రారంభించిన మంత్రులు
- 10 శాతం డిసౌంట్లపై ఉద్యోగులకు లెదర్ ఉత్పత్తుల అమ్మకాలు
- లెదర్ ఉత్పత్తులు కొనుగోలు చేసిన మంత్రులు




అమరావతి (చైతన్య రథం): కుల వృత్తుదారులకు ఆర్థిక భరోసా కల్పించేలా ఆధునిక పరికరాలను కూటమి ప్రభుత్వం అందజేస్తోందని సాంఘిక సంక్షేమ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, బీసీ సంక్షేమ మంత్రి ఎస్. సవిత తెలిపారు. చర్మకారుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ఏపీ సచివాలయంలోని నాల్గవ భవనంలో లిడ్ క్యాప్ లెదర్ షోరూమ్ (ఔట్ లెట్)ను మంత్రులు ఇరువురు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మీడియాతో మాట్లాడుతూ లిడ్ క్యాప్ ద్వారా చర్మకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి బాల వీరాంజనేయస్వామి తెలిపారు. చర్మకారులకు ఉపాధి కల్పనకు మార్కాపురం జిల్లా యడవల్లి, కృష్ణాజిల్లా జి కొండూరులో లెదర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక లిడ్ క్యాప్‌కి పూర్వ వైభవం తీసుకొస్తున్నామన్నారు.

రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత మాట్లాడుతూ కుల వృత్తిదారులకు ఏడాదిపాటు ఉపాధి కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. శాశ్వత ఉపాధితోపాటు ఆర్థిక భరోసా కలిగేలా కుల వృత్తిదారులకు ఆధునిక పరికరాలు అందజేస్తున్నామన్నారు. సచివాలయంలో లిడ్ క్యాప్ అవుట్ లెట్ ఏర్పాటుతో నాణ్యమైన వివిధ రకాల లెదర్ ఉత్పత్తులు సచివాలయ ఉద్యోగులకు, సందర్శకులకు లభించే అవకాశం కలిగిందన్నారు. పదిశాతం డిస్కౌంట్లపై సచివాలయ సిబ్బంది లెదర్ ఉత్పత్తులు విక్రయిస్తారన్నారు. లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ చర్మకారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వ కబ్జాకోరులనుంచి లిడ్ క్యాప్ సంస్థ భూముల్ని కాపాడామన్నారు. లిడ్ క్యాప్ ద్వారా మంచి నాణ్యత కలిగిన వివిధ రకాల తోలు ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

### లెదర్ ఉత్పత్తులను స్వయంగా కొనుగోలు చేసిన మంత్రులు

సచివాలయంలో లిడ్ క్యాప్ అవుట్ లెట్ ప్రారంభం సందర్భంగా మంత్రులు డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, సవిత లెదర్ ఉత్పత్తులు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, లిడ్ క్యాప్ ఎండీ ప్రసన్న వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటికి ఆధునిక ఫుట్‌బాల్ కోర్ట్

- ఏపీలో స్పోర్ట్ అభివృద్ధికి రూ.1000 కోట్లు
- కేంద్రానికి లేఖ రాసిన మంత్రి మండిపల్లి



ఢిల్లీ (చైతన్య రథం): ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఖేలో ఇండియా నుంచి రూ.1000 కోట్లు మంజూరు చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు. ఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి వినీల్ కృష్ణకు లేఖ రాస్తూ.. ఏపీలో రూ.1000 కోట్ల నిర్మాణ పనులు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, మల్టీపర్పస్ హాల్, అథ్లెటిక్స్ ట్రాక్, ఫుట్‌బాల్ మైదానం, స్విమ్మింగ్ పూల్‌తోపాటు ఇతర ఆధునిక క్రీడా సదుపాయాలు ఏర్పాటు ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి క్రీడా మౌలిక వసతులు గణనీయంగా మెరుగుపడటంతోపాటు.. గ్రామీణ యువతకు నాణ్యమైన శిక్షణ, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించే అవకాశాలు లభిస్తాయని వివరించారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లాలో ఆధునిక ఫుట్‌బాల్ నిర్మాణానికి కేంద్రం తక్షణమే నిధులు మంజూరు చేయాలని మంత్రి మండిపల్లి కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనలపై కేంద్రం సానుకూలంగా పరిశీలించి, నిర్మాణాలకి అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

### ఏపీలో బాక్సింగ్ అకాడమీ

ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో బాక్సింగ్ అకాడమీ ఏర్పాటు లక్ష్యంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఢిల్లీలో భారత మాజీ బాక్సర్ విజేందర్ సింగ్ బనీవాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో బాక్సింగ్ క్రీడాభివృద్ధి, యువతకు ప్రపంచస్థాయి శిక్షణా అవకాశాలు కల్పించడం, అకాడమీ స్థాపనకు సంబంధించిన అంశాలపై ఈ సందర్భంగా ఇద్దరూ చర్చించారు.

# గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ ఉపకులపతి



విజయవాడ (చైతన్య రథం): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఉపకులపతి పులాల చంద్రశేఖర్ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం బుధవారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది. బృందంలో వర్శిటీ రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డైరెక్టర్ (రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్), డైరెక్టర్ ఆఫ్ పబ్లికేషన్స్ విభాగాధిపతులు పాల్గొన్నారు. ఇటీవల గవర్నర్ అధ్యక్షతన నిర్వహించిన వర్శిటీ స్నాతకోత్సవ విశిష్ట ఘట్టాలను ప్రతిబింబించే స్మారక ఫోటో ఆల్బమ్‌ను ఉపకులపతి పులాల చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా గవర్నర్‌కు అందజేశారు. స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయడంలో గవర్నర్ అందించిన మార్గదర్శకత్వం, సహకారం, ప్రోత్సాహానికి విశ్వవిద్యాలయం తరపున ఉపకులపతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ యూనివర్సిటీ విద్య, పరిశోధన, ఆరోగ్యశాస్త్రాల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్ అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ఇదే నిబద్ధతతో ప్రజలకు, వైద్య విద్యకు సేవలందించాలని ఆకాంక్షించారు.

# స్వర్ణాంధ్ర సాకారానికి వరప్రదాయిని పోలవరం

## 20 సూత్రాల పథకం చైర్‌పర్సన్ లంకా దినకర్



ఏలూరు/ పోలవరం (చైతన్య రథం): రాష్ట్రానికి జీవనాడిలాంటి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే సంకల్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పట్టుదల, ప్రధాని మోదీ సహకారం ప్రత్యక్షంగా కనిపిస్తోందని ఏపీ 20 సూత్రాల పథకం చైర్‌పర్సన్ లంకా దినకర్ వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు పనులను బుధవారం ఎంపీ పాకా వెంకట సత్యనారాయణతో కలిసి సందర్శించారు. ముందుగా స్పిల్ వే, కాపర్ డ్యామ్, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్, టన్నెల్స్ తదితర పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులు ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్, మ్యాపులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజనీరింగు అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. "పోలవరం ఆంధ్రప్రదేశ్ జీవనాడి. స్వర్ణాంధ్రప్రదేశ్‌ను వికసిత్ భారత్‌లో భాగస్వామ్యం చేయడానికి కీలకమని" ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. లక్ష్యంమేరకు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన పనులు సాగిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ.. మొదటి దశ పూర్తయితే రాష్ట్రానికి తాగు, సాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు జలాలు పుష్కలంగా అందుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకి అనుసంధానంగా పర్యాటక రంగ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పన అవసరమని ఎంపీ పాకా సత్యనారాయణ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వీరివెంట ఐటిడిఏ పీవో కె.రాములు నాయక్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సిఇ రమేష్‌కుమార్, యస్ఇ కె.రామచంద్రరావు, ఇఇలు డి శ్రీనివాసు, పివి వెంకటరమణ, డిఇ మాధవరావు, ఇంజనీరింగు బృందం, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 11న విజయవాడలో మెగా జాబ్‌మేళా

- మైనార్టీ యువత సద్వినియోగం చేసుకోవాలి
- టీడీపీ మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ నూర్



విజయవాడ(చైతన్యరథం): రాష్ట్ర మైనారిటీ శాఖ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి మెగా జాబ్‌మేళాను మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మొహమ్మద్ నూర్ కోరారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఏర్పాటు చేయడం ఒక సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మైనారిటీ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు సుమారు 2500 నుంచి 3000 వరకు వివిధ హోదాల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారని వివరించారు. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్ కేర్, లాజిస్టిక్ రిటైల్ రంగాల్లో సుమారు 60 నుంచి 70 కంపెనీలు జాబ్‌మేళాలో నేరుగా ఇంటర్వ్యూ నిర్వహిస్తాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కోర్సులు చేసిన నిరుద్యోగ యువత అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శనివారం ఉదయం 9 గంటలకు విజయవాడ వన్‌టౌన్‌లోని ముసాఫిర్ ఖానాలో ఈ జాబ్‌మేళా ప్రారంభం అవుతుందని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే 9010243633 నెంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

# లోకేష్ వేగంతో వైసీపీలో వణుకు!

- ద.కొరియా పర్యటన సక్సెస్‌తో గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు
- తాడేపల్లిలో 'అబద్ధాల యూనివర్సిటీ' నడుస్తోంది..
- 22 ప్రధాన దేవాలయాల ఆదాయం గణనీయం
- 2025-26లో రూ.1,503.90 కోట్లకు చేరిన వైనం
- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్




మంగళగిరి (చైతన్య రథం): మంత్రి నారా లోకేష్ దక్షిణకొరియా పర్యటన సక్సెస్ కావడాన్ని ఓర్వలేకనే.. వైసీపీ నేతలు దేవాలయాలపై అబద్ధపు ప్రచారాలకు తెరలేపి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ ధ్వజమెత్తారు. బుధవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తాడేపల్లి ప్యాలెస్ వేదికగా సాగుతున్న 'జగనన్న అబద్ధాల యూనివర్సిటీ'లో పదవుల కోసం, జగన్ దగ్గర మార్కులు కొట్టేందుకే విజయవాడకు చెందిన వైసీపీ 'హాఫ్ టికెట్లు' వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. యువగళం పాదయాత్రలో నిరుద్యోగ యువతకు ఇచ్చినహామీ ప్రకారం లోకేష్ రాత్రింబగళ్లు కష్టపడుతుంటే, ఆ ప్రయత్నాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఆలయాల ఆదాయం తగ్గిందంటూ దౌర్భాగ్యపు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌కు క్యూ కడుతున్నాయని దూండి రాకేష్ స్పష్టం చేశారు. ఎస్ఐబీపీ సమావేశాల ద్వారా కేవలం కొన్ని నెలల్లోనే 339 ప్రాజెక్టులు, రూ.12లక్షల కోట్ల పెట్టుబడులతోపాటు సుమారు 11లక్షల ఉద్యోగాలకు ఈ రాష్ట్రం గేట్‌వేగా నిలిచిందని గుర్తుచేశారు. ఐఫోన్, ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్,రాయల్ ఎన్‌ఫీల్డ్‌లాంటి దిగ్గజాలు ఇప్పటికే వచ్చాయని, ఇప్పుడు కొరియా పర్యటనలో ఎల్‌జీ, శామ్‌సంగ్, హ్యుందాయ్‌లాంటి తయారీ కంపెనీలతో లోకేష్ జరుపుతున్న చర్చలు చూసి వైసీపీ ముఠా వణికిపోతోందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ దుర్మార్గపు పాలనలో ప్రజలకు రోడ్లు,నీళ్లు ఇవ్వకుండా గ్రీవెన్స్ సెల్‌ను కూడా ఎత్తేసి తీవ్ర మానసిక క్షోభకు గురిచేసిన చరిత్ర జగన్‌రెడ్డిదని నిప్పులు చెరిగారు.

దేవాలయాల ఆదాయం తగ్గిందంటూ వైసీపీ చేస్తున్న ప్రచారంలో అణాపైసా నిజం లేదని పక్కా లెక్కలతో రాకేష్ కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలోని 22 ప్రధాన దేవాలయాల ఆదాయం 2023-24లో రూ.1,379.19కోట్లు ఉంటే,కూటమి ప్రభుత్వ సమర్థ పరిపాలనవల్ల 2025-26నాటికి అది రూ.1,503.90 కోట్లకు పెరిగిందని వెల్లడించారు. వెల్లంపల్లి ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న విజయవాడ దుర్గగుడి స్థూల ఆదాయం 2023-24లో రూ.207.16 కోట్ల నుంచి 2025-26లో రూ.219 కోట్లకు పెరిగిందని, అందులో హుండీ ఆదాయమే రూ.66.58కోట్ల నుంచి రూ.77.50కోట్లకు పెరగడం కూటమి ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమన్నారు. ప్రతి ఆలయంలో ఆన్‌లైన్ టికెటింగ్ ప్రవేశపెట్టి, సీసీ కెమెరాల నిఘాలో పెద్ద అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపులు జరుపుతుంటే అవినీతి ఎక్కడ జరుగుతుందని ప్రశ్నించారు.

వెల్లంపల్లి శ్రీనివాస్ దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో వందలాది ఆలయాలపై దాడులు జరిగాయని, దుర్గగుడిలో మూడు వెండి సింహాలు మాయమైతే ఇప్పటికీ పత్తా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రథాలు తగలబడినా, హనుమంతుడి చెయ్యి విరిగితే 'పది లక్షలు పోతే పోయింది, మేం పెడతాం' అని హిందూ ధర్మాన్ని హేళన చేసిన అహంకార పార్టీ వైసీపీ అని దుయ్యబట్టారు. నాడు దుర్గగుడి పరకామణి విభాగంలో 'దొంగ రవి' హుండీ సొమ్ము దోచుకుంటే ఆ నిందితుడిని కాపాడటానికి వైసీపీ పెద్ద దొంగలంతా తాపత్రయపడిన బాగోతాన్ని భక్తులు ఇంకా మర్చిపోలేదన్నారు. సోషల్ మీడియాలో హిందూ దేవుళ్లను అసభ్యంగా దూషించే 'రావణ' లాంటి వ్యక్తికి అండగా నిలబడింది వైసీపీ పార్టీ కాదా అని నిలదీశారు.

కూటమి ప్రభుత్వం హిందూ ధర్మానికి, భక్తుల మనోభావాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని, ఆలయాల్లో ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా తక్షణమే సిబ్బందిపై సస్పెన్షన్లు, క్రిమినల్ కేసులు పెడుతున్నామని రాకేష్ స్పష్టం చేశారు. హిందూ దేవాలయాల పేర్లు కూడా సరిగ్గా పలకలేని జగన్‌రెడ్డి తీర్థమిస్తే చేతులు కడుక్కునే రకం, పంచ కట్టమంటే చుట్టూ తిప్పుకునే రకమని విమర్శించారు. అలాంటి నాయకుడిని పెట్టుకుని వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు అనే హాఫ్ టికెట్లు చొక్కాలు చింపుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు, దొంగే దొంగ దొంగ అన్నట్లు ఉన్న వెల్లంపల్లి తీరుపై జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

సొంత కులానికి కూడా న్యాయం చేయలేని వెల్లంపల్లి శ్రీనివాస్ ఈరోజు వచ్చి పెద్ద పెద్ద మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. నాడు దేవాదాయ మంత్రిగా వెల్లంపల్లి చేయలేని పనిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఫైల్ కదిలించి అధికారిక ఉత్సవంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పెనుగొండ క్షేత్రానికి వాసవి పెనుగొండగా పేరు మార్చింది కూడా కూటమి ప్రభుత్వమేనని, దానికి వ్యతిరేకంగా సంతకాలు చేయించిన దౌర్భాగ్య చరిత్ర వైసీపీ నేతలదన్నారు. రాజకీయాల కోసం దేవాలయాలను వాడుకుంటూ హిందూ సనాతన ధర్మంపై బురదజల్లితే కూటమి ప్రభుత్వం కఠినంగా బుద్ధి చెబుతుందని దూండి రాకేష్ హెచ్చరించారు.

# దళితులపై జగన్‌ది కపట ప్రేమ!

## రాజకీయ పావులుగా వాడుకోవడమే వైసీపీ వ్యూహం

కుట్రలు, విద్వేషాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టడం, అమాయకులను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఏ వర్గాన్నీ రాజకీయ పావులుగా ఉపయోగించకూడదు. అయితే రాష్ట్రంలో 2024 ఎన్నికల తరువాత కుల, మత, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందడం వైసీపీ రాజకీయాలకు ట్రేడ్‌మార్క్‌గా మారింది. ముఖ్యంగా దళితులను భావోద్వేగాల పేరుతో రెచ్చగొట్టి, చట్టపరమైన ఇబ్బందుల్లోకినెట్టి తన గుప్పెట్లోకి తెచ్చుకోవాలని జగన్‌రెడ్డి దళితులను రాజకీయ పావులుగా వాడుకుంటున్న ఘట్టాలు లెక్కలేనన్ని.

జగన్ అధికారంలో ఉన్నప్పుడు కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ పాలన కొనసాగించి రాష్ట్రాభివృద్ధిని అడ్డుకున్నారు. అధికారం కోల్పోయిన తర్వాతా అదే వైఖరి కొనసాగిస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నారు. అరాచకమే ఆయుధంగా చేసుకొని విష ప్రచారాలు చేస్తూ రాజకీయ లాభాలు పొందుతున్నారు. అధికారం కోసం ఎన్ని కుట్రలకైనా దిగజారడం, సొంతవారిని కూడా పావులుగా వాడుకోవడం జగన్‌రెడ్డికి అలవాటుగా మారింది. ఇందులో భాగంగానే ఏలూరు దళిత క్రైస్తవుల సభతోపాటు, తన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వేదికలుగా కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేలా బచ్చులకూర జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ అనే వ్యక్తిని రాజకీయ పావుగా ఉపయోగించుకొని జగన్‌రెడ్డి కుల, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన పాస్టర్ ప్రవీణ్ మృతిని రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నాయకులు హత్యగా, క్రైస్తవులపై దాడిగా చిత్రీకరించి, మత విద్వేషంతో ముడిపెట్టి రాజకీయంగా వాడుకునేందుకు కుట్రలు చేశారు. కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని, క్రైస్తవుల్లో అసంతృప్తి రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం రాష్ట్ర ప్రజలకు తెలీంది కాదు. చిత్తూరు జిల్లా దేవళంపేటకు చెందిన వైసీపీ సర్పంచ్ గోవిందయ్య, కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ఉద్దేశంతో అంబేద్కర్ విగ్రహానికి నిప్పంటించి కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రకు పాల్పడటం వెలుగులోకి రావడం తెలిసిందే. ప్రభుత్వంపై బురద చల్లి, మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు పాస్టర్ అభినయ్ దర్శన్ అల్లూరి జిల్లా వేదికగా ఆడిన 'దాడి' డ్రామా రాష్ట్రం మొత్తాన్ని నివ్వెరపరిచింది.

2024 ఎన్నికల ప్రచారం సందర్భంగా విజయవాడలో గులకరాయి డ్రామాకు దిగారు జగన్. ఇందులో దళితులను బలిచేశారన్న విమర్శలు లేకపోలేదు. అంతకుముందు, 2019 ఎన్నికలకు ముందు కోడికత్తి డ్రామాతో దళిత యువకుడు శ్రీనుని ఐదేళ్లపాటు జైల్లో పెట్టి అతని జీవితాన్ని నాశనం చేశారన్న ఆరోపణలూ ఉన్నాయి.



### దళితులపట్ల జగన్ ప్రేమ ఎలాంటిది?

"అధికారం కోసమే జగన్‌రెడ్డికి దళితులు కావాలి. అధికారంలోకి రాగానే వారిని అంటరాని వారిగా చూస్తారు" అని విమర్శకులు ఆరోపిస్తున్నారు. జగన్‌రెడ్డికి నిజంగా దళితులపై ప్రేమ ఉంటే, ఆయన పాలనలో డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఎమ్మెల్సీ అనంతబాబుకు ఎందుకు అండగా నిలుస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం లేదు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి ఆత్మహత్యకు పురిగొల్పారన్న ఆరోపణలపైనా ప్రభుత్వం మౌనం వహించింది. జగన్ సొంత జిల్లాలో దళిత మహిళ నాగమ్మపై అత్యాచార ఘటన జరిగినా స్థానిక ఎమ్మెల్యేగా పట్టించుకోలేదు. పైగా ప్రశ్నించిన దళితులపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయించిన ఉదంతాలు లేకపోలేదు. రాజమండ్రిలో 16 ఏళ్ల బాలికపై గ్యాంగ్‌రేప్ ఘటనలో నిందితులపై తీసుకున్న చర్యలపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దళిత జాతిపై అంత ప్రేమ ఉంటే వారికి అందాల్సిన 27 పథకాలను జగన్ ఎందుకు రద్దు చేశారు? ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి దళితులకు అన్యాయం చేసిన మాట వాస్తవం కాదా? వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులపై 56,981 దాడులు, 192 హత్యలు జరిగాయన్నది వాస్తవం కాదా? దళితులపట్ల జగన్ చూపిస్తున్న ప్రేమ, తన పిల్లలనే తినే పాము ప్రేమలా ఉందని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. జగన్ మాయమాటలు నమ్మి మోసపోవద్దని దళితులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

### దళితులకు విజ్ఞప్తి

మీ జీవితమే మీ కుటుంబానికి ఆస్తి. రాజకీయ కుట్రల్లో బలికావద్దు. ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టినా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని ప్రేరేపించినా, అలాంటి ప్రయత్నాలను తిరస్కరించండి. ప్రజాస్వామ్యంలో మీ ఓటు, మీ ఆలోచన, మీ భవిష్యత్తు అత్యంత విలువైనవి. రాజకీయ ప్రయోజనాల కోసం మిమ్మల్ని ఉపయోగించుకునే ప్రయత్నాలను గుర్తించండి. విద్య, ఉపాధి, స్వాభిమానం, అభివృద్ధి వైపు అడుగులు వేయండి. శాంతి, సామరస్యం, సామాజిక న్యాయం, చట్టబద్ధమైన ప్రజాస్వామ్య మార్గమే దళిత సమాజ పురోగతికి నిజమైన బాట అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- మంగినపల్లి ఎలీషా,
అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

చైతన్యరథం

# ఆంధ్రుల జీవనాడికి మళ్లీ జీవం

- పోలవరాన్ని నాశనం చేసిన గొడ్డలి పార్టీ సర్కారు
- ఐదేళ్ల పాలనలో 2 శాతం పనులు కూడా చేయని వైనం
- రెండేళ్లలోనే 15 శాతం పోలవరం పనులు పూర్తి
- నిర్వాసితులకు రూ.2,250కోట్ల పరిహారం అందజేత
- 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్ర శేషు

మంగళగిరి (చైతన్య రథం): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును జగన్‌రెడ్డి విధ్వంసం చేస్తే, కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుకు తిరిగి జీవం పోస్తుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.దాసరి శ్యామ్‌చంద్ర శేషు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2019-24 మధ్య అధికారంలో ఉన్న జగన్‌రెడ్డి పోలవరం పనులను పూర్తిగా పక్కనబెట్టి, ప్రాజెక్టును తీవ్ర విధ్వంసానికి గురిచేశారని అన్నారు. ఆనాడు గొడ్డలి పార్టీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే డయాఫ్రం వాల్ ధ్వంసమైందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు హెచ్చరించినా జగన్‌రెడ్డి ఏమాత్రం పట్టించుకోలేదని, ఫలితంగా పోలవరం ప్రాజెక్టు వరదల్లో మునిగిపోవడమే కాకుండా, 15 నెలల పాటు పనులను పూర్తిగా నిలిపివేయడంతో వేల కోట్ల రూపాయల అదనపు వ్యయ భారం ప్రాజెక్టుపై పడిందని పేర్కొన్నారు. వైసీపీకి చెందిన ఇద్దరు మంత్రులు పోలవరంపై ఐదుసార్లు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ, "పర్సెంటా, అర పర్సెంటా" అంటూ కేవలం డైలాగులు పేల్చారే తప్ప, పనుల్లో ఎలాంటి పురోగతి చూపించలేదని విమర్శించారు. జగన్ హయాంలో ఐదేళ్ల కాలంలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా నిర్మించలేదు సరే కదా, కనీసం అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 39మంది ప్రాణాలు కోల్పోతే జగన్‌రెడ్డి బాధితులను కనీసం పరామర్శించలేదని ఆరోపించారు. పోలవరం నిర్వాసితులకు వరదల సమయంలో ఒక్క అర్ధ రూపాయి సహాయం కూడా చేయకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, జగన్ హయాంలో పోలవరం పనులు కేవలం 2 శాతం కూడా జరగలేదని, నేడు శరవేగంగా పూర్తి చేస్తుంటే నిత్యం విషం చిమ్ముతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

గొడ్డలి పార్టీ విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు పోలవరం పనులను పరుగులు పెట్టిస్తున్నారని ఆయన తెలిపారు. గతంలో



2014-19 మధ్యే దాదాపు 72 శాతం పోలవరం పనులను పూర్తి చేసి, ప్రతి సోమవారాన్ని పోలవరంగా మార్చి ప్రాజెక్టును నిరంతరం పర్యవేక్షించారని, ఆనాడు 7 ముంపు మండలాలను ఏపీలో విలీనం చేశాకే ఆయన సీఎంగా ప్రమాణస్వీకారం చేయడం విశేషమని పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.990 కోట్లతో డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.12,157 కోట్ల నిధులను సాధించి పనులను వేగవంతం చేశారని తెలిపారు. గత ప్రభుత్వం నిర్వాసితులను మీటింగులకు రాకుండా అడ్డుకుందని, రూపాయి కూడా వారికి ఆర్ అండ్ ఆర్ సాయం ఇవ్వలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం కేవలం 24 నెలల్లోనే రూ.2,250 కోట్లను ఆదివాసి గిరిజన నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసి వారిని ఆదుకుందని తెలిపారు. అఖండ గోదావరి పుష్కరాలు ప్రారంభం కాకముందే, 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు చకచకా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

దేశంలోనే అతిపెద్ద బహుళార్ధ సాధక ప్రాజెక్టు అయిన పోలవరం ద్వారా 28.5 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా సాకారం కాబోతోందని ఆయన తెలిపారు. ఈ ఒక్క ప్రాజెక్టు పూర్తయితే అటు రాయలసీమ, ఇటు ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ఇది వరప్రదాయినిగా మారి రాష్ట్రమంతా సస్యశ్యామలం కానుందని అన్నారు. అలాగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా 40 టీఎంసీ నీటిని పరిశ్రమలకు, విశాఖవాసులకు తాగునీటిగా అందించనున్నట్లు తెలిపారు. గతంలో పట్టిసీమను రికార్డు టైంలో పూర్తి చేసి రూ.50 వేల కోట్ల విలువైన పంటలను కాపాడామని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాలుగా విడిపోయినా అన్నదమ్ముల్లా కలిసి ఉంటూ, కలిసి ఎదగాలనేదే చంద్రబాబు విధానమని పేర్కొన్నారు. పోలవరంపై గానీ, ఇతర సాగునీటి ప్రాజెక్టులపై గానీ గొడ్డలి పార్టీ నాయకులు చర్చకు సిద్ధమా అని ప్రశ్నిస్తూ, తాము ఎప్పుడైనా, ఎక్కడైనా పోలవరం, సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు సిద్ధంగా ఉన్నామని దాసరి శ్యామ్‌చంద్ర శేషు స్పష్టం చేశారు.

---

## అంకితభావమే ఆయన పాలిట శ్రీరామ రక్ష!

### ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా రావి రాధాకృష్ణ..

ప్రజా జీవితంలో పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ పదవులు వ్యక్తిని వెతుక్కుంటూ రావడం చాలా అరుదు. అలాంటి అరుదైన గుర్తింపును తన సేవా తపన, నిబద్ధత, అంకితభావంతో, సాధించిన గుర్తింపు నాయకత్వంతో సాధించుకున్న వ్యక్తి రావి రాధాకృష్ణ. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది ప్రవాసాంధ్రుల ఆశలు, ఆకాంక్షలు, సమస్యలు మరియు భావోద్వేగాలను ప్రభుత్వానికి చేరవేస్తూ వారి తరఫున నిరంతరం గళమెత్తి సేవను సాధనగా,ప్రజల విశ్వాసాన్ని బలంగా చేసుకుని ముందుకు సాగిన రావి రాధాకృష్ణ ప్రస్థానం నేడు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి బాధ్యతల వరకు చేరుకోవడం అనేక మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. సేవ,సమర్పణ, నాయకత్వం ఉంటే గుర్తింపు తప్పకుండా వస్తుందనే విషయానికి ఆయన జీవితం ఒక ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. కోనసీమ నేలలో జన్మించి, సౌదీ అరేబియాలో వ్యాపారవేత్తగా ఎదిగిన రావి రాధాకృష్ణ, ప్రవాసాంధ్రుల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. ముఖ్యంగా ఎన్ఆర్ఐ టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఇప్పటి వరకు ఆయన చేసిన సేవలు, పోషించిన పాత్ర గల్ఫ్ దేశాలలో మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రుల కుటుంబాలతో అనుసంధానం చేస్తూ పార్టీ విజయానికి తనవంతు పాత్ర పోషించి తెలుగు సమాజంపై చెరగని ముద్ర వేశాయి.



#### క్లిష్ట పరిస్థితుల్లో కూడా అదే నిబద్ధత

నేడు ఆయనకు లభించిన ప్రత్యేక ప్రతినిధి బాధ్యతకేవలం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు; గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న లక్షలాది మంది ప్రవాసాంధ్రుల విశ్వాసానికి, వారి సమిష్టి కృషికి, పార్టీ పట్ల ఉన్న అంకితభావానికి దక్కిన గౌరవప్రదమైన గుర్తింపు. సేవతో ప్రారంభమైన ఈ ప్రస్థానం, ప్రవాసాంధ్రుల గళాన్ని ప్రభుత్వానికి చేరవేసిన సమర్థ నాయకత్వంగా, ప్రజల హృదయాలను గెలుచుకున్న స్ఫూర్తిదాయక ప్రయాణంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అరుదైన సన్నివేశంగా నిలిచింది. వ్యక్తిగత విజయాన్ని సామూహిక గౌరవంగా మలుచుకున్న ఈ ఘట్టం, గల్ఫ్ ప్రవాసాంధ్రుల సేవా తపనకు, విశ్వాసానికి, అంకితభావానికి ప్రతీకగా తరతరాలకు స్ఫూర్తినిచ్చే మైలురాయిగా నిలవనుంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాదు, ప్రతిపక్షంలో ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఆయన అదే నిబద్ధతతో పనిచేశారు. ఎన్నో సవాళ్లు ఎదురైనా కార్యకర్తలలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, గల్ఫ్ దేశాలలో తెలుగుదేశం పార్టీ జెండాను నిరంతరం ఎగురవేశారు. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతర్, ఒమాన్, బహ్రెయిన్ దేశాలలోని తెలుగు వారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి పార్టీకి బలమైన సంస్థాగత నిర్మాణాన్ని కల్పించారు.

#### సామాజిక సేవలోనూ ముందు వరసలో

2024 ఎన్నికల సమయంలో ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. తన వ్యాపార బాధ్యతలను సైతం పక్కనపెట్టి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో రేయింబవళ్లు శ్రమించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులను వారి కుటుంబాలతో అనుసంధానం చేస్తూ, ప్రతి ఓటు విలువను తెలియజేస్తూ పార్టీ విజయానికి అహర్నిశలు కృషి చేశారు. గల్ఫ్ దేశాల నుంచి వేలాది మంది ప్రవాసాంధ్రులు ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించారు. రాజకీయ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, సామాజిక సేవలోనూ ఆయన ముందుంటారు. గల్ఫ్ దేశాలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు కార్మికులకు అండగా నిలవడం, అవసరమైన సమయంలో సహాయం అందించడం, సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రవాసాంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు.

ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన ప్రపంచవ్యాప్త అభిప్రాయ సేకరణలో రావి రాధాకృష్ణ అత్యధిక సానుకూల స్పందన పొందిన నాయకులలో అగ్రస్థానంలో నిలవడం ఆయన ప్రజాదరణకు నిదర్శనంగా నిలిచింది. గల్ఫ్ దేశాలలో ఆయనకు ఉన్న ఆదరణ, విశ్వాసం, నాయకత్వంపై ఉన్న గౌరవం ఈ గుర్తింపులో ప్రతిబింబించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్యప్రాచ్య మరియు ఆగ్నేయాసియా దేశాలకు ప్రత్యేక ప్రతినిధిగా ఆయనను నియమించడం ద్వారా ప్రవాసాంధ్రుల సేవలకు, ఆయన కృషికి సముచిత గౌరవం దక్కింది. ఈ నియామకాన్ని గల్ఫ్ ప్రాంతంలోని తెలుగు ప్రజలు తమ విజయంగా భావిస్తూ సంబరాలు జరుపుకున్నారు. దుబాయి నుంచి కువైట్ సిటీ వరకు, రియాధ్ నుంచి గల్ఫ్ ప్రాంతంలోని ఇతర నగరాల వరకు ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. "జయ జయ" నినాదాలతో గల్ఫ్ గడ్డ మారుమ్రోగింది. ప్రవాసాంధ్రుల ఆశయాలకు, వారి కృషికి, వారి స్వరానికి ఈ నియామకం గుర్తింపుగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

---

## హస్త కళాకారులకు ఆరోగ్య భరోసా

- డిప్యూటీ సీఎం చొరవతో వైద్య శిబిరాలు
- హస్తకళాకారులకు ప్రత్యేక వైద్య పరీక్షలు




అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ హస్తకళ మహోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఇచ్చిన మాటను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరుసటి రోజే ఆచరణలో పెట్టారు. పవన్ సూచనతో హస్త కళాకారుల ఆరోగ్యానికి భరోసానిచ్చేలా క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. బుధవారం నరసాపురం లేస్ కళాకారులు, శ్రీకాళహస్తి కలంకారీ కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. నరసాపురంలో 105మంది లేస్ కళాకారులకు పరీక్షలు నిర్వహించగా, 37మందికి కంటి సంబంధిత సమస్యలున్నట్టు నిర్ధారించారు. అందులో 16మందికి కళ్లలో శుక్లాలున్నట్టు వైద్యులు గుర్తించారు. అవసరమైన వారికి వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో శస్త్ర చికిత్స చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నపాటి దృష్టి దోష సమస్యలున్న 21మందికి కళ్ల జోళ్లు వేయించే ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తిలో మొత్తం 53మంది హస్తకళాకారులకి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక పరీక్షలతోపాటు అన్ని రకాల ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

#### మహాలక్ష్మికి శంకర నేత్రాలయలో పరీక్షలు

హస్తకళ మహోత్సవం సందర్భంగా నరసాపురం నియోజకవర్గం పసలదీవికి చెందిన లేస్ కళాకారిణి మహాలక్ష్మి తమకు నేత్ర సంబంధిత ఇబ్బందులు వస్తున్నాయన్న విషయాన్ని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం మహాలక్ష్మితోపాటు, అందే లక్ష్మి అనే మరో లేస్ కళాకారిణిని పవన్ కళ్యాణ్ ప్రత్యేక వాహనంలో పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రికి పిలిపించి పరీక్షలు చేయించారు. ఇరువురికీ దృష్టి దోష సమస్యలున్నట్టు వైద్యులు నిర్ధారించారు. కళ్లజోళ్లు, ఐ డ్రాప్స్, మందులు ఇప్పించి పంపారు.

# రైతన్న ఆత్మహత్యలకు చెక్!

- కూటమి పాలనలో సగానికి తగ్గిన బలవన్మరణాలు
- జాతీయ నేర గణాంక సంస్థ -2024 నివేదిక వెల్లడి
- వైసీపీ దగా పాలననుంచి తేరుకుంటున్న రైతాంగం
- అన్నదాత సుఖీభవతో రైతన్నలో ఆత్మవిశ్వాసం




ఆంధ్రప్రదేశ్ అనగానే ఒకప్పుడు దేశానికే అన్నపూర్ణగా వెలుగొందింది. కానీ,ఐదేళ్ల వైసీపీ దగా పాలన వల్ల 'రైతు ఆత్మహత్యల నిలయం'గా మారిపోయింది. వ్యవసాయ వ్యతిరేక విధానాలు, కౌలు రైతులపట్ల మొండి వైఖరి,పాలకుల అనాలోచిత నిర్ణయాలు వెరసి అన్నదాతలను అప్పుల ఊబిలోకి నెట్టి ప్రాణాలు తీసుకునేలా చేశాయి. అయితే, గత ప్రభుత్వ చీకటి పాపాలను కడుగుతూ, 2024 జూన్‌లో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న విప్లవాత్మక రైతు అనుకూల నిర్ణయాలు రాష్ట్రంలో సరికొత్త కాంతులు నింపుతున్నాయి. ఇందుకు తాజా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) 2024నివేదికే సజీవ సాక్ష్యంగా నిలిచింది. పాలకుల ఆలోచన మారితే అన్నదాతల ఆయుష్షు ఎలా పెరుగుతుందో ఈ నివేదిక సాక్ష్యాలతో సహా నిరూపించింది.

జాతీయ నేర గణాంక సంస్థ విడుదల చేసిన 'ప్రమాద మరణాలు-ఆత్మహత్యల సమాచార నివేదిక-2024' ప్రకారం,ఆంధ్రప్రదేశ్‌లో రైతులు, వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత గణనీయంగా తగ్గాయి. జగన్‌రెడ్డి నిర్లక్ష్యపు పాలనలో 2022లో 917మంది, 2023లో 925 మంది వ్యవసాయ రంగంపై ఆధారపడిన వారు బలవన్మరణాలకు పాల్పడగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చిన 2024లో ఆమొత్తం 780కిచేరింది. వ్యవసాయరంగంపై ఆధారపడినవారి ఆత్మహత్యల్లో 2023లో ఏపీ దేశంలోనే 3వ స్థానంలో (మహారాష్ట్ర, కర్ణాటక తర్వాత) ఉండి భయానక స్థితిని తలపించగా, కూటమి ప్రభుత్వం కల్పించిన ధైర్యంతో 2024 నాటికి ఏపీ 4వ స్థానానికిచేరింది. 2023లో దేశవ్యాప్త రైతు ఆత్మహత్యల్లో ఏపీ వాటా 8.57శాతం ఉంటే, 2024నాటికి అది 7.42శాతానికితగ్గడం గమనార్హం.

## సగానికిపైగా తగ్గిన మరణాలు

ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం వ్యవసాయ రంగంలో సాగుదారులు (సొంత/కౌలు భూమి సాగుదారులు), వ్యవసాయ కూలీలు (పొలం పనులకు వెళ్లేవారు) అని రెండు విభాగాలుంటాయి. ఈ రెండింటిలోనూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 2023లో జరిగిన మొత్తం ఆత్మహత్యల్లో రైతులు/ సాగుదారులు 201మంది కాగా, వ్యవసాయ కూలీలు 724 మంది ఉన్నారు. ఈరెండు కలిసి వైసీపీ పాలనలో 925 ఆత్మహత్యలు నమోదయ్యాయి. అదే 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తీసుకున్న రైతు అనుకూల చర్యల వల్ల రైతులు/ సాగుదారుల ఆత్మహత్యల సంఖ్య 88కి తగ్గింది. అంటే సగానికిపైగా రైతుల బలవన్మరణాలు తగ్గాయి. ఇందులో 50 మంది సొంత భూమి ఉన్నవారే కావటం గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం రైతుల మూలాలను ఎంతలా దెబ్బతీసిందో అద్దం పడుతోంది. అలాగే వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు కూడా 692కి పడిపోయి, మొత్తం సంఖ్య 780గా నమోదైంది.

## వ్యవసాయాన్ని భ్రష్టుపట్టించిన వైసీపీ గంజాయి సంస్కృతి

గత జగన్ రెడ్డి పాలనలో అన్నదాతలు మద్దతు ధర, సాగునీరు, సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల భరోసా లేక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటుంటే, వైసీపీ పాలకులు మాత్రం గంజాయి సాగుకు, అక్రమ రవాణాకు రాజకీయ ప్రోత్సాహం అందించారు. పచ్చని పంటలతో విలసిల్లాల్సిన ఏపీని ఐదేళ్ల కాలంలో దేశానికే గంజాయి హబ్‌గా మార్చి, గ్రామీణ యువత భవిష్యత్తు నాశనం చేశారు. అధికార పార్టీ అండదండలతో సాగిన గంజాయి గ్యాంగుల అరాచకాలు పల్లెల్లో శాంతిభద్రతలను క్షీణింపజేసి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించాయి. పంటలకు గిట్టుబాటు ధర అడిగితే లాఠీఛార్జీలు చేసిన నాటి పాలకులు, గంజాయి సాగు చేసే అసాంఘిక శక్తులకు మాత్రం రెడ్ కార్పెట్ పరిచారు. వైసీపీ సృష్టించిన ఈ విధ్వంసక సంస్కృతి వల్లే పల్లెల్లో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి, అన్నదాతలు గత్యంతరం లేని స్థితిలో బలవన్మరణాలకు పాల్పడ్డారని జాతీయ నేర గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.

## 'అన్నదాత సుఖీభవ' -చంద్రన్న నేతృత్వంలో సరికొత్త విప్లవం

గత పాలకుల చేతకానితనానికి భిన్నంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, పంటలకు గట్టి భరోసా కల్పిస్తూ వ్యవసాయ రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చింది. అన్నదాతలను ఆర్థికంగా ఆదుకోవడమే ధ్యేయంగా 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ప్రతి రైతు ఖాతాలో ఏడాదికి రూ. 20 వేల పెట్టుబడి సహాయాన్ని జమ చేస్తూ కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులకు సైతం ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా చేస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది.

దీనికి తోడు, సాగు ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచేందుకు డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) పథకానికి భారీగా సబ్సిడీలను పునరుద్ధరించడమే కాకుండా, అధునాతన డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ టెక్నాలజీని రైతులకు అందుబాటులోకి తెచ్చింది. విత్తనాలనుంచి కోతల వరకు అవసరమయ్యే అత్యాధునిక ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను సబ్సిడీపై అందిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. రైతులు తమ పంటల సమాచారం, వాతావరణ వివరాలు, మార్కెట్ ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా డిజిటల్ విప్లవానికి నాంది పలుకుతూ ప్రత్యేక కిసాన్ యాప్‌ను సైతం ప్రవేశపెట్టింది. వీటితోపాటు గత ప్రభుత్వం నిలిపివేసిన సబ్సిడీ విత్తనాల పంపిణీని పునరుద్ధరించడం, ఆర్బీకేల స్థానంలో రైతులకు మేలు చేసేలా శాస్త్రవేత్తలతో కూడిన 'రైతు సేవా కేంద్రాల'ను బలోపేతం చేయడం ద్వారా చంద్రబాబు సర్కార్ అన్నదాతకు కొండంత భరోసానిస్తూ సరికొత్త సాగు విప్లవానికి శ్రీకారం చుట్టింది.

## సాగునీటి రంగానికి పూర్వవైభవం.. ప్రతి ఎకరాకూ జలసిరి

సాగునీటి రంగంలో సైతం కూటమి ప్రభుత్వం నదుల అనుసంధానం, పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ధ్యేయంగా యుద్ధప్రాతిపదికన అడుగులు వేస్తోంది. చంద్రబాబు మునుపటి ప్రభుత్వ హయాంలో (2014-19) సాగునీటి ప్రాజెక్టుల కోసం ఏకంగా రూ. 68 వేల కోట్లు ఖర్చు చేస్తే, జగన్ రెడ్డి ప్రభుత్వం (2019-24) కేవలం రూ. 30 వేల కోట్లతోనే సరిపెట్టింది. అందులోనూ రూ. 18 వేల కోట్లను బకాయిలుగా పెట్టి సాగునీటి రంగాన్ని పూర్తిగా ముంచేసింది. గత పాలకుల ఘోర అలక్ష్యంవల్ల దెబ్బతిన్న సాగునీటి వ్యవస్థలను ప్రక్షాళన చేస్తూ, మళ్లీ బాధ్యతలు చేపట్టిన 24 నెలల్లోనే కూటమి ప్రభుత్వం ఏకంగా రూ. 24 వేల కోట్లు ఖర్చు చేసి రికార్డు సృష్టించింది. 2027 నాటికి రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ఎలాగైనా పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో పనులు వేగవంతం చేసింది. అటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఇటు రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి, చివరి ఆయకట్టు వరకు సకాలంలో నీరందించి అన్నదాతలకు సాగు భరోసా కల్పిస్తోంది.


## ఏపీలో మళ్లీ మొదలైన సువర్ణాధ్యాయం

గత ఐదేళ్ల వైసీపీ చీకటి పాలన నుంచి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం ఇప్పుడు కూటమి ప్రభుత్వ నేతృత్వంలో సువర్ణ అధ్యాయంవైపు అడుగులు వేస్తోంది. ప్రభుత్వ సత్వర స్పందన, పారదర్శకత, రైతు సంక్షేమ ప్రాధాన్యత కారణంగానే నేడు అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం పెరిగి ఆత్మహత్యలు తగ్గాయని ఎన్‌సీఆర్‌బీ-2024 గణాంకాలు నొక్కిచెబుతున్నాయి. అన్నదాత సుఖీభవ పథకం, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణతో చంద్రబాబు ప్రభుత్వం రైతుల గుండెల్లో కొండంత ధైర్యాన్ని నింపిందని, ఏపీ మళ్లీ సస్యశ్యామల అన్నపూర్ణగా మారుతుందని నివేదిక స్పష్టం చేస్తోంది.

- బి నిర్మలాజ్యోతి,
అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

## స్పష్టమైన గణాంకాల పోలిక పట్టిక

| సంవత్సరం/పాలన | రైతులు/సాగుదారులు | వ్యవసాయ కూలీలు | మొత్తం |
|---|---|---|---|
| 2023 (జగన్‌రెడ్డి పాలన) | 201మంది | 724 మంది | 925 మంది |
| 2024 (కూటమి పాలన) | 88 మంది | 692 మంది | 780 మంది |
| తగ్గిన రైతు ఆత్మహత్యలు | 113 మంది | 32 మంది | 145 మంది |



# కార్యకర్త కుటుంబానికి అండగా టీడీపీ : ప్రభుత్వ విప్ గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు పేర్కొన్నారు. పార్టీ కోసం, ప్రజల కోసం ఎంతో సేవ చేసి అకాల మరణం చెందిన 57వ వార్డు, అసివానిపాలెంకి చెందిన టీడీపీ కార్యకర్త దివంగత పోతురాజు భార్య కుటుంబానికి పార్టీ తరపున రూ.5,00,000/- (ఐదు లక్షల రూపాయలు) ప్రమాద బీమా మంజూరైంది. ఈ బీమాకు సంబంధించిన అధికారిక పత్రాన్ని ప్రభుత్వ విప్ గణబాబు బుధవారం తమ కార్యాలయంలో పోతురాజు భార్య, నామినీ అయిన గౌరిబార్లకి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... కష్టకాలంలో పార్టీ వెన్నంటే నడిచిన పోతురాజు మరణం టీడీపీ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నేతృత్వంలో కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా ఈ క్లెయిమ్ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలు ఆత్మస్థైర్యంతో నిలబడేందుకు ఈ బీమా సాయం ఎంతగానో ఉపయోగపడుతుందని, పార్టీ ఎల్లప్పుడూ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్, స్థానిక టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గల్లంతైన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండ... రూ.10 లక్షలు చొప్పున ఆర్థికసాయం



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ తీరంలో గల్లంతైన మత్స్యకార బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఫిషింగ్ హార్బర్ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్‌లో బాధిత కుటుంబాలను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జులై 4న జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. ఈ ఘోర ప్రమాదానికి గురైన బాధితుల కుటుంబాలను ఆయన నేడు (బుధవారం) స్వయంగా పరామర్శించి, ప్రభుత్వం తరపున తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. సముద్రంలో బోటు ప్రమాదం జరిగి మత్స్యకారులు గల్లంతయ్యారనే సమాచారం అందిన వెంటనే కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించిందని మంత్రి తెలిపారు. ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ వంటి రక్షణ దళాల సమన్వయంతో యుద్ధప్రాతిపదికన సహాయక, గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. లభించిన ప్రాథమిక, చిన్న సమాచార ఆధారంగా గల్లంతైన మత్స్యకారులంతా దురదృష్టవశాత్తూ మరణించి ఉంటారని భావిస్తున్నట్లు ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**పిల్లల చదువులకు ప్రభుత్వం భరోసా :** బాధిత కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల పరిహార చెక్కులను పంపిణీ చేసిందని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాల్లోని పిల్లల చదువుల బాధ్యతను పూర్తి స్థాయిలో ప్రభుత్వమే తీసుకుంటుంది, వారి భవిష్యత్తుకు ఎలాంటి ఢోకా లేకుండా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. దేశంలో లేదా మరే ఇతర రాష్ట్రంలోనూ బోటు ప్రమాద బాధితులకు ఇవ్వనంత గరిష్ట స్థాయి పరిహారాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఇదే తరుణంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులు ఇలాంటి ప్రమాదాలకు గురైతే ఒక్క రూపాయి కూడా ఇచ్చి ఆదుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు.

**ఆరుగురు జాలర్ల ఆచూకీ ఎక్కడ?:** విశాఖ తీరంలో సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఉదంతం తీవ్ర విషాదాన్ని నింపింది. నాలుగు రోజులుగా సాగిన ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ సంయుక్త రెస్క్యూ ఆపరేషన్ ముగిసింది. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు అధికారులు సముద్రంలో ముమ్మరంగా గాలింపు చేపట్టినప్పటికీ దురదృష్టవశాత్తూ తప్పిపోయిన ఆరుగురు జాలర్ల ఆచూకీ మాత్రం లభించలేదు.

**త్రిసభ్య కమిటీ వాస్తవ నివేదిక విడుదల:** విశాఖ తీరంలో గల్లంతైన మత్స్యకారులపై త్రిసభ్య కమిటీ వాస్తవ నివేదికను విడుదల చేసింది. ఈ నెల 4న బోటు ప్రమాదం జరిగిందని నిర్ధారించింది. ఈ నెల 5 ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రమాద సమయంలో ఏడుగురు మత్స్యకారులు ఉన్నారని నివేదికలో వెల్లడించారు. ప్రమాదం నుంచి కారె చిన్న అనే వ్యక్తి బయటపడ్డారని తెలిపారు. 72 గంటలపాటు గాలింపు చర్యలు చేపట్టారని కమిటీ నివేదికలో వెల్లడించింది. కారె చిన్నయ్య, కారె సితోడు, కారె గరగయ్య, రాగోతు బందయ్య, మేడా చినఅమ్మోరు, అప్పలరాజు గల్లంతైనట్లు ప్రకటించారు. గల్లంతైనవారి కుటుంబసభ్యులకు బీమా, ఇతర సాయానికి కమిటీ సమ్మతించిందని తెలిపారు. అలాగే గల్లంతైనవారి కుటుంబసభ్యులకు పరిహారం, ఇతర ధ్రువపత్రాలు ఇచ్చేందుకు కమిటీ సమ్మతించిందని త్రిసభ్య కమిటీ వాస్తవ నివేదికలో వెల్లడించింది.

# భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కట్టుదిట్టమైన భద్రత



విజయనగరం (చైతన్యరథం): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కట్టుదిట్టమైన భద్రత కల్పించనున్నట్లు విశాఖ రేంజ్ ఐజీపీ గోపీనాథ్ జెట్టి పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని విశాఖపట్నం ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఎయిర్ పోర్టు ప్రాంగణంలో నిర్మించిన కమాండ్ కంట్రోల్, ఏటీసీ బ్యాగేజ్, ఇతర లాంజ్లను సందర్శించి భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం, ఎయిర్ పోర్టు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ద్వారా చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీపీ మాట్లాడుతూ.. భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ త్వరలో ప్రారంభంకానున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లును సమీక్షించామన్నారు. ఒక సంవత్సరంలో సుమారు 4 కోట్ల మంది ప్రయాణికులు విమానయాన ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్న అంచనాతో భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విమానాశ్రయానికి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అంతర్గత భద్రత కల్పిస్తున్నామని, విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

# రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అభివృద్ధికి కార్యాచరణ

● విజయవాడలో కూన రవికుమార్ అధ్యక్షతన రాష్ట్ర అసోసియేషన్ సమావేశం



పలాస (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆముదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షతన విజయవాడలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ, జిల్లా స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలు, శిక్షణ శిబిరాల నిర్వహణ, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీల నిర్వహణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ... సాఫ్ట్‌బాల్ క్రీడకు రాష్ట్రంలో మరింత ప్రాచుర్యం కల్పించేందుకు అసోసియేషన్ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, సౌకర్యాలు కల్పించేందుకు అసోసియేషన్ కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సాఫ్ట్‌బాల్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సభ్యులు తమ తమ జిల్లాల్లో క్రీడాభివృద్ధికి సంబంధించిన సూచనలు, ప్రతిపాదనలు వెల్లడించగా, వాటిపై అధ్యక్షులు కూన రవికుమార్ సానుకూలంగా స్పందించి, అసోసియేషన్ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని అన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంజీఆర్

● స్వగృహంలో ఎన్యూమరేషన్ పత్రాలను స్వీకరించి వివరాలు నమోదు

● ఓటర్ల జాబితాల్లో పారదర్శకత, ఖచ్చితత్వానికి సర్ కార్యక్రమం దోహదం



పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గ కేంద్రంలోని తన స్వగృహంలో గురువారం నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారి నుంచి ఎన్యూమరేషన్ పత్రాలను స్వీకరించి, వాటిని పరిశీలించి, అవసరమైన వివరాలను నమోదు చేసి సంతకం చేసి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఓటర్ల జాబితాలను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, అవసరమైన వివరాలను సకాలంలో సమర్పించి కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పీఎం శ్రీ పాఠశాలలు



ఆనందపురం (చైతన్యరథం): పీఎం శ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ కేజీబీవీ కార్యదర్శి దేవానంద రెడ్డి తెలిపారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యా, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలో రికార్డు స్థాయిలో 193 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. వారిలో సుమారు 90 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి రావడంతో ఉపాధ్యాయులను అభినందించారు. సైన్స్ ప్రయోగశాలలు, గ్రంథాలయం, ఏఐ ల్యాబ్, వృత్తి విద్య విభాగం, క్రీడా సదుపాయాలు, మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినుల సెల్ఫ్ డిఫెన్స్ ప్రదర్శనను ప్రశంసించారు. అనంతరం ఆనందపురం కేజీబీవీని సందర్శించి బేస్లైన్ పరీక్ష పత్రాలు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్లు, గ్రంథాలయం, డార్మిటరీలు, శౌచాలయాలు పరిశీలించారు. కిచెన్ గార్డెన్లో లో మొక్క నాటి పచ్చదనాన్ని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జోగేంద్రనాథ్, గంగరాజు, ఏఎంఓ లక్ష్మి, సీఆర్పీ శివాజీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## తాడిపూడి ఎత్తిపోతల నుంచి నీరు విడుదల



తాళ్లపూడి (చైతన్యరథం): మండలంలోని తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం సాగునీరు విడుదల చేశారు. ముందుగా వేదపండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్టేజ్-1 మోటారుపంపు వద్ద మంత్రితో పాటు కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు మద్దిపాటి వెంకటరాజులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదికి పసుపు, కుంకుమ, పుష్పాలతో పూజలు చేసి గోదావరికి హారతులు ఇచ్చారు. మంత్రి రామానాయుడు మోటార్ స్విచ్ ఆన్ చేసి గోదావరి నీరును విడుదల చేశారు. పథకం పరిస్థితిని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా అధికార ప్రతినిధి పరమేశ్వరరావు, డీఈ రమేషానాయుడు, అప్పారావు, ఇతర శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పశుపోషణతో అదనపు ఆదాయం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**●రైతులు వ్యవసాయ నష్టాలను పశుపోషణతో అధిగమించాలి : ప్రత్తిపాటి**

**● రైతుల సహకారంతో సంగం వ్యవస్థను మరింత వృద్ధిలోకి తెస్తాం**

**●తెలంగాణ, రాయలసీమలో త్వరలో సంగం కొత్త ప్లాంట్లు : ధూళిపాళ్ల**



చిలకలూరిపేట (చైతన్యరథం): 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై వైసీపీ, సాక్షి మీడియా కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు అక్రమమార్గాల్లో సృష్టించిన దొంగఓట్లు పోతాయన్న భయంతోనే ఓటర్ల జాతీయ సమగ్ర సర్వేను తప్పుపడుతున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆక్షేపించారు. బుధవారం ఆయన సంగం డెయిరీ ఛైర్మన్, పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌తో కలిసి యడ్లపాడు మండలం జగ్గాపురంలో పర్యటించారు. గ్రామస్తులు, పశుపోషకుల ఆర్థిక పురోగతి కోసం నిర్మించిన సంగం డెయిరీ నూతన పాలకేంద్రాన్ని ప్రారంభించి, స్వర్గీయ ధూళిపాళ్ల వీరయ్య చౌదరి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తుల్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. తాము సృష్టించిన దొంగ ఓట్లు పోతాయన్న భయంతోనే వైసీపీ 'సర్' పై దుష్ప్రచారం చేస్తోంది. 'సర్' ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా నిష్పక్షపాతంగా జరుగుతోందని, ప్రజా ప్రభుత్వంలో జవాబుదారీ తనం ఉంటుందని, జగన్ ప్రభుత్వంలా దుర్మార్గాలకు పాల్పడదని ప్రత్తిపాటి చెప్పారు. ఎవరి ఓటును ఎవరూ తొలగించే అవకాశమే లేదని, అలా చేయడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ప్రత్తిపాటి తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు తాము సృష్టించిన దొంగ ఓట్లు పోతాయన్న భయంతోనే వైసీపీ తప్పుడు ప్రచారానికి తెరలేపిందన్నారు. 'సర్'పై కావాలనే వైసీపీ తమ సాక్షి మీడియాలో దుష్ప్రచారం చేయిస్తూ ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఓట్లు తొలగిస్తున్నారంటూ వైసీపీ, ఆ పార్టీ అవినీతి మీడియా చేసే విషప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ప్రత్తిపాటి కోరారు.

**ధూళిపాళ్ల.. సంగం టర్నోవర్ పెంచి లాభాల్ని రైతు కుటుంబాల సంక్షేమానికి వెచ్చిస్తున్నారు**

పశుఫోషణతో రైతు కుటుంబాలకు అదనపు ఆధాయం లభిస్తుందని, వ్యవసాయంలో వచ్చే నష్టాలను కొంత వరకు అధిగమించవచ్చని ప్రత్తిపాటి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, రాయితీలతో రైతులు పశు పోషణతో పాటు, గొర్రెలు, కోళ్ల పెంపకం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. సంగం డెయిరీకి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ధూళిపాళ్ల నరేంద్రకే దక్కుతుందని, సంస్థ టర్నోవర్ ను రూ.2 వేలకోట్లకు పెంచారని ప్రత్తిపాటి తెలిపారు. బహిరంగ మార్కెట్లో సంగం డెయిరీ పాల ఉత్పత్తులకు మంచి నాణ్యత, బ్రాండింగ్ కల్పించారన్నారు. సంస్థ లాభాల్ని రైతు కుటుంబాల సంక్షేమానికి వినియోగిస్తున్నారని, పాడి రైతులు ఎవరైనా అకస్మాత్తుగా చనిపోతే వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

**కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం ఓర్వలేకే దుష్ప్రచారం : ధూళిపాళ్ల నరేంద్ర**

గత ప్రభుత్వంలో కక్షలు, కార్పణ్యాలు, అవినీతి, దుర్మార్గపు రాజకీయాలకు ప్రజలు బలైపోయారని, అభివృద్ధికి దూరమయ్యారని ధూళిపాళ్ల నరేంద్ర తెలిపారు. కూటమి ప్రభుత్వం నేడు ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధికోసం శ్రమిస్తుంటే, అది ఓర్వలేని కొందరు స్వార్ధ రాజకీయ నాయకులు నిత్యం దుష్ప్రచారం చేస్తున్నారని నరేంద్ర అసహనం వ్యక్తంచేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొనే సంగండెయిరీని ఏర్పాటు చేయడం జరిగిందని, సంస్థ లాభాల్లో కొంత భాగాన్ని రైతుకుటుంబాల ఆర్థిక అభ్యున్నతికి వెచ్చిస్తున్నామని సంగం డెయిరీ ఛైర్మన్, శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర తెలిపారు. సంగం డెయిరీ వ్యవస్థను మరింత వృద్ధిలోకి తీసుకొచ్చి, రాబోయే తరాలకు కూడా మరిన్ని సేవలు అందించాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. త్వరలోనే రాయలసీమ, తెలంగాణలో డెయిరీ తరుపున కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నట్టు ధూళిపాళ్ల చెప్పారు. జగ్గాపురం గ్రామపెద్దలు, గ్రామస్థుల సహకారం, ఐక్యత వల్లే స్థానిక పాల ఉత్పత్తిదారుల సేవా కేంద్రం తక్కువకాలంలోనే బాగా వృద్ధి చెందిందని ఆయన ప్రశంసించారు.

# పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీరు

**●కృష్ణాడెల్టా రైతులకు, ప్రభుత్వం తీపి కబురు...**

**●పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా పోలవరం కుడికాలువకు సాగునీరు విడుదల**

**●పూజలు చేసి పంపులు ఆన్ చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు**



పట్టిసీమ (చైతన్యరథం): ఎల్‌నినో ప్రభావంతో సాగు ఆశలు సన్నగిల్లి దిగాలు పడిన కృష్ణాడెల్టా రైతులకు, ప్రభుత్వం తీపి కబురు అందించింది. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా పోలవరం కుడికాలువకు సాగునీరు విడుదల చేసింది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పట్టిసీమ వద్ద పూజలు చేసి పంపులు ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను, కృష్ణా జలాలతో అనుసంధానం చేసి నదుల అనుసంధానానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారని అన్నారు. 2014-19లో రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టిసీమ, నేడు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించిందన్నారు. ఎత్తిపోతల పథకాన్ని గొడ్డలి పార్టీ వట్టిసీమ అని విమర్శించిందని, ఇప్పుడు అదే పథకం ద్వారా ఇప్పటివరకు 450 టీఎంసీలు తరలించామని, దీనికి జగన్ ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.

దూరదృష్టి, ముందుచూపు, నిర్మాణాత్మక ఆలోచన కలిగిన నాయకుడు ఉంటే ప్రజలకు ఏవిధంగా మేలు జరుగుతుందో పట్టిసీమే ఉదాహరణ అని పేర్కొన్నారు. పాలనా అనుభవం లేకపోవడం, విధ్వంసపు ఆలోచనలు, ముందుచూపు లేకపోవడం వల్లే జగన్ పట్టిసీమ వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. కర్ణాటకలో ఆలమట్టి నుంచి నాగార్జునసాగర్ వరకు పాజెక్టులు డెడ్‌స్టోరేజీలో ఉన్నాయని, గోదావరికి ఎగువ నుంచి వస్తున్న నీరు సముద్రంలోకి పోకుండా ఒడిసిపట్టుకుని కృష్ణా డెల్టాకు తరలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలవరం, కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు సిరి బాలరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి ధర్మరాజు, కలెక్టర్ వెట్రిసెల్వి తదిరుతుల పాల్గొన్నారు. ప్రయోజనం: శ్రీశైలం నుంచి కృష్ణా నదికి వరద వచ్చే వరకు వేచి చూడకుండా, గోదావరి వరద జలాలను ముందుగానే ఒడిసిపట్టి డెల్టాకు తరలిస్తారు. ఈ నీటి విడుదల ద్వారా కృష్ణా డెల్టా రైతులకు మొదటి ప్రాధాన్యతగా సాగునీరు అందనుంది. ఈ పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టా తూర్పు, పశ్చిమ కాలువల కింద ఉన్న దాదాపు 13 లక్షల ఎకరాలకు సాగునీరు మరియు తాగునీరు అందుతుంది.

## సేవా దృక్పథమే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం : టీడీపీ నేత గద్దె క్రాంతి



విజయవాడ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీలో కింది స్థాయి కార్యకర్త నుంచి అత్యున్నత నాయకత్వం వరకు ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతోనే పనిచేస్తారని, టీడీపీ శ్రేణులు ఏ కార్యక్రమం చేసినా అందులో సేవ దాగి ఉంటుందని టీడీపీ నాయకులు గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 20వ డివిజన్ కృష్ణలంక ఎం. హోటల్ వద్ద దివంగత గల్లా కామేశ్వరరావు 36వ వర్ధంతి సందర్భంగా డివిజన్ అధ్యక్షులు గల్లా శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో టీడీపీ నాయకులు గద్దె క్రాంతి కుమార్, కాట్రగడ్డ శ్రీనులు పాల్గొని పేద కుటుంబాలకు చెందిన 20 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువైన చేసే నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. తొలుత గల్లా కామేశ్వరరావు, కాట్రగడ్డ వెంకట నారాయణల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్, కాట్రగడ్డ శ్రీనులు మాట్లాడుతూ... ప్రతి నెలా పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందిస్తూ గల్లా శ్రీను చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కూడా ప్రజాసేవే లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సొంత నిధులతో కొనసాగిస్తున్నారని తెలిపారు. వేలాది మంది నిరుపేదలకు స్వయం ఉపాధి కోసం టిఫిన్ బండ్లు, ఇస్త్రీ పెట్టెలు, కుట్టు మిషన్లు అందించడంతో పాటు, వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం, దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ, పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం సొంత నిధులతో ఆర్థిక సహాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అండగా ఉండటం, వారి జీవితాల్లో వెలుగులు నింపడం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న సంప్రదాయమని, భవిష్యత్తులోనూ ఇదే సేవా స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు పేద విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తున్నారని తెలిపారు. అలాగే బసవతారం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా అత్యల్ప ఖర్చుతో క్యాన్సర్ బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ఎన్టీఆర్ ట్రస్ట్ బాధితులను ఆదుకుంటూ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైలమూరి ఫీరుబాబు, వాస పల్లపు రాజు, పోనమోలు లక్ష్మి, భాగం సాయి ప్రసాద్, రాయి రంగమ్మ, పెద్ది అన్నారావు, గోగుల ఏసు, పోడూరు పవన్, గల్లా సుబ్బారావు, బండారు కుమారి, రాధా, రేమల సత్యనారాయణ, మహేష్, రాజేష్, సుభాని, అమీనా తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బారు లక్ష్యం : ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



మైలవరం (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్ వ్యాఖ్యానించారు. బుధవారం గొల్లపూడి తన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఆయన... అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా ఆలకించిన వారి సమస్యల పరిష్కారానికి భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ... ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ, పింఛన్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వచ్చినట్లు మంత్రి తెలుపుతూ, వచ్చిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్ చేసి వాటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల కాలనీల్లో సరైన మౌలిక వసతులు లేక లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని, అలాంటి వాటిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తున్నామని, అందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్రంలో ఉమ్మడి శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకు, పశ్చిమగోదావరి నుంచి ప్రకాశం వరకు, అదేవిధంగా నెల్లూరు జిల్లా నుంచి రాయలసీమ జిల్లాలతో మూడు ఎకనామిక్ జోన్లు ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేసిందని తెలిపారు.

# రైతులకు సాగునీటి భద్రత కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే వెనిగండ్ల



గుడివాడ (చైతన్యరథం): రైతాంగానికి సాగునీటి భద్రత కల్పించేలా కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.పట్టిసీమ 24 పంపుల ద్వారా సరఫరాతో డెల్టాకు నీటి భద్రత కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్లో నియోజకవర్గ రైతులకు సాగునీటి అవసరాల ముందస్తు ప్రణాళికలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం సాయంత్రం గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు, వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు మండలాల వారీగా నీటి నిల్వల వివరాలు ఎమ్మెల్యే రాముకు వివరించారు. నందివాడ, రూరల్ మండలాల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, గుడ్లవల్లేరు మండలంలో ప్రస్తుతం 2 వేల క్యూసెక్కుల నిల్వలు ఉన్నాయని, రేపు ఉదయానికల్లా రైతుల అవసరాలకు సరిపడా 3 వేల 5 వందల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుందని తెలిపారు. రైతులు వేస్తున్న పంట అంచనాలు, నీటి అవసరాలను ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారుల దృష్టికి వ్యవసాయ అధికారులు తీసుకెళ్లాలని, RSK కేంద్రాల్లో ఆయా పరిధిలోని రైతులకు అవసరమైన నీటి అవసరాల నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజాదర్బార్ నిర్వహించారు. బుధవారం పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి పార్టీ నాయకులు, కార్యకర్తల నుండి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు తమ సమస్యలు, ప్రజా అంశాలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన సూచనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ముదిరాజు కమ్యూనిటీ నిర్మాణం చేపట్టిన రామాలయానికి లక్ష రూపాయలు తన చేతుల మీదుగా రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్‌కి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గళ్ళా మాధవి చేతుల అందజేయడం జరిగింది. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని డివిజన్ అధ్యక్షులకు సూచించారు.

# ఎంపీ కేశినేని కృషితో ఏ కొండూరు మండలానికి మరో మేలు

**●తిరువూరు నియోజకవర్గం ఏ కొండూరు మండలంలో నివాస ప్రాంతాలకు అనుసంధాన రోడ్డు మంజూరు**

**●1.815 కోట్ల అంచనా వ్యయంతో 1.71 కిలోమీటర్ల రోడ్డు పనులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**




తిరువూరు (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఏ కొండూరు మండలానికి ఎంపీ కేశినేని శివనాథ్ చొరవతో మరో లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే విజయవాడ పార్లమెంట్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు అంబాసిడర్‌గా మారిన కేశినేని చిన్ని తాజాగా మరో అభివృద్ధి కార్యక్రమానికి తోడ్పాటు అందించారు తిరువూరు నియోజకవర్గంలో ఏ కొండూరు మండలంలో నివాస ప్రాంతాలకు అనుసంధానం చేసే రోడ్డుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముందుగా తన విజ్ఞప్తి మేరకు ఏ కొండూరు మండలంలో రోడ్డు పనికి ఆమోదం తెలిపిన కేంద్రానికి ఎంపీ చిన్ని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి ఆమోదం పొందిన లేఖను విడుదల చేశారు ప్రధానంగా విజయవాడ పార్లమెంటు పరిధిలోని ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన-4, బ్యాచ్-1 2026 -27 కింద1.815 కోట్ల అంచనా వేంతో1.71 కిలోమీటర్ల రోడ్డు పనిని కేంద్రం ఆమోదించింది ముఖ్యంగా రహదారులు గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే కాకుండా రాష్ట్ర సామాజిక ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడంలో కీలక పాత్ర ఈ రహదారులు పోషిస్తాయని లేఖలో పేర్కొంది. ఇప్పటికే కిడ్నీ సమస్యలతో ఎంతోమంది బాధితులు ఏ కొండూరు మండలంలో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారికి మంచి త్రాగునీరు అందించడంతోపాటు తాజాగా కనెక్టివిటీ రోడ్లను కూడా ఎంపీ కేశినేని చిన్ని ఏ కొండూరు మండలానికి అందించారు. ఎంతో కాలం నుండి సరైన కనెక్టివిటీ రోడ్లు లేక ఇబ్బంది పడుతున్న ఏ కొండూరు మండలానికి ఎంపీ చిన్ని కనెక్టివిటీ రోడ్ను తీసుకువచ్చి అక్కడి ప్రజలకు బాసటగా నిలిచారు. అడిగిన వెంటనే విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏ కొండూరు మండలానికి రోడ్డు పనిని మంజూరు చేసిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు ఎంపీ చిన్ని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు రాబోయే రోజుల్లో విజయవాడ పార్లమెంట్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలియజేశారు.

# 300 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ : ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం, సింగ్‌నగర్‌లోని స్వామి వివేకానంద పాఠశాలలో ఆల్ ఇండియా ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఆలా తారకరామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 8వ, 9వ, 10వ తరగతులకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు, జ్యామెట్రీ బాక్సులు, స్కూల్ బ్యాగులు తదితర విద్యా సామగ్రిని ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ప్రతి కార్యక్రమం సమాజాభివృద్ధికి పునాది అని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలను కలిసే నాయకుడిగా కాకుండా, ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారంతో పాటు భావి భారత పౌరులైన విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. మంచి విద్యను అందిస్తూ విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తున్న స్వామి వివేకానంద పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసే దిశగా అనేక సంస్కరణలు చేపడుతోందని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

# రైతుల అవసరాలకు అనుగుణంగా గ్రామీణ మౌలిక సదుపాయాలు : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): వత్సవాయి మండలం, మంగొల్లు రవికంపాడు మేజర్-1, 2 కాల్వగట్ల మరమ్మత్తు పనులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శ్రీకారం చుట్టారు. వత్సవాయి మండలంలోని మంగొల్లు పరిధిలో ఉన్న రవికంపాడు మేజర్-1,2 కాల్వల పరిధిలో రైతులు తమ పంట పొలాలకు సులభంగా చేరుకునేలా చేపట్టనున్న కాల్వగట్ల మరమ్మత్తు పనులకు కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన జొన్నలగడ్డ శ్రీ భాగ్యం, సత్యనారాయణకి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 1,16,361 చెక్కును, అలాగే అన్నెపాక ప్రసాదు (యోబు)కి మంజూరైన రూ. 25,846 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ... రైతుల అవసరాలకు అనుగుణంగా గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాల్వగట్ల మరమ్మత్తులతో రైతులు తమ వ్యవసాయ పొలాలకు సులభంగా చేరుకోవడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా మరింత సౌకర్యవంతంగా సాగుతుందన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రైతుల సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు అందించే దిశగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన అన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జల సంరక్షణలో కూటమి ప్రభుత్వ మరో ముందడుగు

**●నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఇంకుడు గుంతల ప్రారంభం**



నందిగామ (చైతన్యరథం): ప్రతి ప్రభుత్వ కార్యాలయం నీటి సంరక్షణకు ఆదర్శంగా నిలవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వ్యాఖ్యానించారు. జల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా నందిగామ సి.ఎం. రోడ్డు పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఇంకుడు గుంతల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పోలీస్ శాఖ అధికారులతో పాటు కూటమి నాయకులతో కలిసి పాల్గొని ఇంకుడు గుంతలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రకృతి వనరుల పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టే లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పోలీస్ స్టేషన్లు తదితర ప్రాంగణాల్లో ఇంకుడుగుంతల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్లలో, సంస్థల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించే బాధ్యతను స్వీకరించాలని ఆమె పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలమట్టాల పెంపునకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసిపి శ్రీనివాస్, స్టేషన్ హౌస్ ఆఫీస్ శ్రీనివాస్, పోలీస్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నున్నలో శ్రీవరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠా

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని టీచర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం నిర్వహించిన ఈ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖరంపై కలశ స్థాపన కార్యక్రమాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వెల్లడి



కోవూరు (చైతన్యరథం): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సంక్షేమం, ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే కూటమి ప్రభుత్వ తొలి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయం పనులు పురోగతిని పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, శ్రీకాంత్, ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరే కీలకం




## రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు

రాయచోటి (చైతన్యరథం): భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు తమ వివరాలను ఒకసారి పరిశీలించి, ఎన్యుమరేషన్ ఫారమ్‌ను సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా బీఎల్వోలకు అందజేయాలన్నారు. ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చన్నారు. ప్రతి ఇంటికీ ఈ సమాచారాన్ని చేరవేసి, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, యువత అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా సహకరించాలని కోరారు.




# ఎస్ఐఆర్ సహాయ కేంద్రానికి విశేష స్పందన

నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని 47వ డివిజన్ మురళీకృష్ణ మందిరం సెంటర్‌లో సహాయ కేంద్రం కార్యక్రమం మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు నాయకత్వంలో, 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పేర్లు నమోదు, అవసరమైన పత్రాలు, ఫారం నింపే విధానం, ఓటరు వివరాల ధృవీకరణపై అవగాహన పొందారు. సందేహాల నివృత్తి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో ప్రజలకు ఉచితంగా మార్గదర్శకత్వం అందించారు. ఈ కార్యక్రమంలో అన్ని బూత్ కన్వీనర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా పాల్గొని ప్రజలకు నమోదులో సహకరించారు. ఈ కార్యక్రమంలో మదనబేటి మునిశేఖర్ (ఉపాధ్యక్షులు), కలవకుంట భాస్కర్, కంచి కృష్ణ, ఉమా మహేశ్వరి, సునీత గణేశన్, సుహాసిని, కవిత సుధ, రాళ్ల సురేష్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని, ప్రజల్లో ఉన్న అపోహలను నమ్మకుండా సందేహాలుంటే ాౢ×= సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమైన సహాయం పూర్తిగా ఉచితంగా అందించబడుతుందని తెలిపారు.

# అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

## తెదేపా రాష్ట్ర కార్యదర్శి అంకెం ఇందిరా ప్రియదర్శిని పిలుపు

దెందులూరు (చైతన్యరథం): దెందులూరు నియోజకవర్గం క్లస్టర్-7 పరిధిలోని యూనిట్ 24,27లో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు అంకెం ఇందిరా ప్రియదర్శిని గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ: సర్ ప్రక్రియ పూర్తి అయ్యేందుకు కేవలం కొద్ది రోజుల సమయం మాత్రమే ఉందని, అందరూ బాధ్యత తీసుకుని ప్రతి ఒక్క ఓటరుకు ఓటు నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను సంప్రదించి, వారి సమస్యలను తెలుసుకుని, ఓటు హక్కు వినియోగించుకునేలా చేయాలని కోరారు.





# మంత్రి నారాయణ సంకల్ప బలంతో వైద్య శిబిరాలు విజయవంతం

నెల్లూరు (చైతన్యరథం): నగరంలో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఉన్నత ఆశయంతో, నిరుపేద మధ్యతరగతి ప్రజల కోసం ఏర్పాటు చేసిన నారాయణ నేత్ర జ్యోతి , నారాయణ దంత సురక్ష ఉచిత మెగా హెల్త్ క్యాంప్ 49వ డివిజన్లో దిగ్విజయంగా జరుగుతుంది. ఈ సందర్భంగా కో-క్లస్టర్ ఖాదర్ బాషా, ప్రెసిడెంట్ ప్రసాద్ మరియు వైద్యాధికారులు డాక్టర్ సుధ, రఫీ మాట్లాడుతూ కోట్ల రూపాయల భారీ వ్యయంతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని నిరుపేదల ముంగిటకే తెచ్చేందుకు మంత్రి 3 కోట్ల వ్యయంతో అత్యాధునిక నారాయణ ఆన్ వీల్స్ మొబైల్ క్లినిక్ వాహనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సేవా యజ్ఞంలో భాగంగా ఇప్పటివరకు నారాయణ నేత్రజ్యోతి ద్వారా 9,617 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, 5,461 మందికి పైగా ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశామని, అలాగే తీవ్రమైన దృష్టి లోపాలతో బాధపడుతున్న 143 మంది రోగులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి కంటిచూపును పునరుద్ధరించడం జరిగిందని వెల్లడించారు. దీనితో పాటు నారాయణ దంత సురక్ష విభాగంలో ఇప్పటివరకు 6,257 మందికి నాణ్యమైన దంత పరీక్షలు నిర్వహించామని వారు పేర్కొన్నారు. గతంలో ఉచిత వైద్య శిబిరాల పట్ల ప్రజల్లో కొంత అపనమ్మకం ఉన్నప్పటికీ, ఇక్కడ కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో నిపుణులైన సీనియర్ డాక్టర్లు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ నిశితంగా పరీక్షలు నిర్వహిస్తుండటంతో ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోందని వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి క్యాంప్‌లోనూ వైద్యుల ప్రత్యేక శ్రద్ధ కోసం 60 మందికి మించకుండా పరీక్షలు చేస్తున్నామని, కంప్యూటర్ కంటి పరీక్షలు చేసి కేవలం ఒకటి లేదా రెండు రోజుల్లోనే రోగులకు ఉచితంగా కళ్లద్దాలు అందిస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు. అంతేకాకుండా మధుమేహం ఉన్నవారికి డయాబెటిక్ రెటినోపతి, గ్లకోమా వంటి సమస్యలపై అవగాహన కల్పిస్తూ అంధత్వం రాకుండా ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని వివరించారు. ప్రజల ఇళ్ల వద్దకే ఈ ఉచిత సేవలు అందుతుండటంతో పేదలకు సమయం, వేలాది రూపాయల డబ్బు ఎంతో ఆదా అవుతోందని, మంచి చేయాలనే తపన ఉన్న నాయకుడు మంత్రిగా ఉంటే ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో చెప్పడానికి నారాయణ గారి చొరవే నిదర్శనమని కొనియాడుతూ డివిజన్ ప్రజల తరఫున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోక్లస్టర్ షేక్ ఖాదర్ బాషా, ప్రెసిడెంట్ బండి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ నారా శ్రీనివాసులు, యూత్ ప్రెసిడెంట్ కరిముల్లా, యూనిట్ ఇంచార్జ్ ముజీబ్, కన్వీనర్ పవన్, మహిళా సెక్రెటరీ లక్ష్మీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న మంత్రి పయ్యావుల

## వ్యాధితో బాధ పడుతున్న చిన్నారి కుటుంబానికి చేయూత, సీఎం చంద్రబాబుకు, మంత్రికి లబ్దిదారుల కృతజ్ఞతలు



అనంతపురం (చైతన్యరథం): రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఉరవకొండ పట్టణానికి చెందిన హనుమంతు కుమారుడు, ఆరు నెలల వయసున్న చిన్నారి కుమ్మరి లోకేష్ అరుదైన ప్రైమరీ హీమోఫాగోసైటిక్ లింఫోహిస్టియోసిస్ వ్యాధితో బాధపడుతుండగా, చిన్నారి కుమ్మరి లోకేష్ చికిత్స కోసం ఇటీవల, కొద్దిరోజుల క్రితం చిన్నారి తల్లిదండ్రులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ని కలిసి ఆర్థిక సహాయం కోరింది. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మంత్రి, తక్షణమే స్పందించి ఐదు రోజుల క్రితం సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకుని తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు. అనంతరం హైదరాబాద్‌లోని సింధు హాస్పిటల్ యాజమాన్యంతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, చిన్నారికి ఎలాంటి ఆలస్యం లేకుండా అత్యుత్తమ వైద్యం అందించాలని మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. మంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 7.5 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. చెప్పినట్లుగానే ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 7,50,000 చెక్కును అనంతపురంలోని తన స్వగృహంలో చిన్నారి తల్లి కుమ్మర లత పేరుపై మంత్రి అందజేశారు. ఈ సహాయంతో చిన్నారి చికిత్సకు ఆర్థిక భారం కొంత తగ్గడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో వెంటనే స్పందించి తమ బిడ్డకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు చిన్నారి తల్లితండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# రెచ్చగొట్టే రాజకీయాలు మానుకో తోపుదుర్తి

## శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి హనుమప్ప




పుట్టపర్తి (చైతన్యరథం): తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవి, ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ఉన్నాయని శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమప్ప తీవ్రంగా ఖండించారు. మీడియాతో మాట్లాడుతూ హనుమప్ప "వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చేసే ప్రయత్నాలను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాలతో రాజకీయాలు చేయడం దురదృష్టకరం" అని అన్నారు. అలాగే, "తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం పనిచేసే పార్టీ. అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం. ఎవరైనా అసత్య ఆరోపణలు చేస్తే వాటికి వాస్తవాలతోనే సమాధానం చెబుతాం. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు తగిన తీర్పు ఇస్తారు" అని పేర్కొన్నారు. చివరగా, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని, బాధ్యతాయుతమైన రాజకీయాలు చేయాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి హనుమప్ప సూచించారు.

# రైతు భూమికి రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

## పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడి



కొత్తచెరువు (చైతన్యరథం): "మన ఆస్తి, మన భద్రత" అనే లక్ష్యంతో ప్రతి రైతు భూమికి పూర్తి రక్షణ కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్లే రాష్ట్రంలో అనేక భూ సమస్యలు తలెత్తాయని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. కొత్తచెరువు మండలం బైరాపురం గ్రామంలో 820 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను బుధవారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, భూమిపై రైతులకు సంపూర్ణ హక్కులు, భద్రత కల్పించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానాల కారణంగా భూ యాజమాన్యానికి సంబంధించిన అనేక వివాదాలు, సమస్యలు ఉత్పన్నమయ్యాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎంతో పారదర్శకమైన చర్యలు చేపడుతున్నారని అన్నారు. రైతుల ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల భూముల రక్షణకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చారిత్రాత్మకమని అన్నారు. రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం నెరవేరుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు , కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు ,సర్పంచ్ రవి ,మండల తహసిల్దార్ నారాయణరెడ్డి ఎంపిడిఓ నటరాజ్, సీఐ రాజశేఖర్ ,సిడిపిఓ జయంతి, సూపర్ వైజర్ రజిత ,అంగన్వాడి టీచర్లు, కార్యకర్తలు టీడీపీ మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా, మాజీ మున్సిపల్ చైర్మెన్ బెస్త చలపతి,సహకార సొసైటీ అధ్యక్షులు అధికారులు శంకర్ , రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సాయికుమార్ ,రైతులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



# పని చేసిన కార్యకర్తలకు సన్మానం

## కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం (చైతన్యరథం): పని చేసిన కార్యకర్తలను, నాయకులను గుర్తించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో వందశాతం పూర్తి చేసిన ఓర్వకల్ మండలానికి చెందిన 22 మంది బూత్ ఇన్‌చార్జ్‌లను నంద్యాల పార్లమెంట్ అధ్యక్షురాలు, పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, అలాగే నందికొట్కూరు ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి ప్రత్యేకంగా పిలిపించి సన్మానించారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గంలోని మిగతా బూత్ ఇన్‌చార్జ్‌లందరూ కూడా తమ తమ బూత్‌లలో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేసి, ఎమ్మెల్యే అభినందనలు పొందాలని పిలుపునిచ్చారు.



# నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

## కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్

కదిరి (చైతన్యరథం): ఖాద్రీ వడ్డెర్ల సంక్షేమ సంఘం కమ్యూనిటీ కళ్యాణ మండపం నిర్మాణ పనులను కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పరిశీలిం మ్యూనిటీ కళ్యాణ మండపం నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. పజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఎఆర్ఐపై అప్రమత్తంగా ఉండాలి

## బీఎల్వోలకు ఎమ్మెల్యే దగుపాటి పిలుపు

అనంతపురం (చైతన్యరథం): అర్బన్ టీడీపీ నేతలతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్లస్టర్, యూనిట్, బూత్, రాష్ట్ర, జిల్లా, నగర కమిటీల నాయకులతో మాట్లాడారు. ఎస్ఐఆర్ పై బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 14వ తేది లోగా నిర్దేశించిన టార్గెట్ ను పూర్తి చేయాలన్నారు. 2002 ఓటర్ లిస్టును పూర్తిగా వెరిఫై చేసి అర్హుల వివరాలను నిర్ధారించాలన్నారు. 12రకాల గుర్తింపు కార్డుల్లో ఏవైనా 2కార్డులను సమర్పించేలా అవగాహన కల్పించాలి. దివ్యాంగులకు సదరం స్లాట్ బుకింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో స్లాట్ బుక్ అయ్యేలా చేయాలన్నారు. ప్రతి నెల మొదటి బుధవారం యూనిట్ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష జరపాలన్నారు.



# తెలుగు న్యాయవాదికి అరుదైన గౌరవం

## చట్టం, మానవ హక్కుల పరిరక్షణలో డాక్టర్ శ్రీనివాస్‌రావు కావటి సరికొత్త చరిత్ర

## నెల్సన్ మండేలా అవార్డుతో పాటు నాలుగు అంతర్జాతీయ పురస్కారాలు కైవసం



అమరావతి: ప్రముఖ న్యాయవాది, కావటి లాఫామ్ ఫౌండర్, రామ్సేయర్ అండ్ అసోసియేట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రావు కావటి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. న్యాయ వ్యవస్థలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలు, మానవ హక్కుల కోసం చేస్తున్న పోరాటం, అంతర్జాతీయ చట్టపరమైన వ్యవహారాల్లో ఆయన చూపిస్తున్న నాయకత్వానికి గాను పలు ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయి.

**అందుకున్న ప్రధాన అవార్డులు:**

నెల్సన్ మండేలా అవార్డు: యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌లో ఈ అవార్డును ప్రదానం చేశారు. సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, అందరికీ న్యాయం అందుబాటులోకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది.

ఇంటర్నేషనల్ కౌన్సిల్ లీడర్‌షిప్ అవార్డు: అంతర్జాతీయ స్థాయిలో క్లిష్టమైన చట్టపరమైన వ్యవహారాలను డీల్ చేయడంలో, వ్యాపార సంస్థలకు సలహాలివ్వడంలో ఆయన చూపుతున్న నాయకత్వ పటిమకు ఈ గౌరవం దక్కింది.

గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ లీడర్‌షిప్ అవార్డు: మానవ హక్కుల ప్రచారం, న్యాయ విద్య, అంతర్జాతీయ సహకారం కోసం ఆయన చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ఈ అవార్డు లభించింది.

కెనడా లెగసీ అవార్డు: మానవతా దృక్పథంతో పేద, వెనుకబడిన వర్గాలకు న్యాయ సేవలందించడంలో చూపుతున్న అంకితభావానికి కెనడాలో ఈ పురస్కారం దక్కింది.

ప్రపంచస్థాయి గుర్తింపు...

డాక్టర్ కావటి వృత్తిపరమైన విజయాలను గుర్తించిన 'మార్క్విస్ హూ ఈజ్ హూ' సంస్థ ఆయన్ను తమ జాబితాలో చేర్చుకుంది. అలాగే లండన్‌లోని ప్రతిష్టాత్మక 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ జ్యూరిస్ట్స్'లో ఆయనకు సభ్యత్వం లభించింది. అంతర్జాతీయ సరిహద్దులు దాటి న్యాయ సేవలను అందించడంలో, ప్రపంచవ్యాప్తంగా న్యాయ వ్యవస్థలో మార్పు కోసం ఆయన చేస్తున్న కృషిని అంతర్జాతీయ సమాజం ఈ పురస్కారాల ద్వారా కొనియాడింది.





# ఆస్ట్రేలియాలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం

## ప్రవాస భారతీయుల 'వందేమాతరం' నినాదాలతో హోరెత్తిన మెల్‌బోర్న్

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా): మూడు దేశాల పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోదీ బుధవారం ఆస్ట్రేలియా చేరుకున్నారు. మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మెల్‌బోర్న్ చేరుకున్న ప్రధానికి విమానాశ్రయంలో అధికారిక లాంఛనాలతో ఘన స్వాగతం లభించింది. ఆస్ట్రేలియాలోని భారత సంతతి ప్రజలు, ప్రవాస భారతీయులు ప్రధాని మోదీకి అపూర్వ స్వాగతం పలికారు. సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై', 'మోదీ.. మోదీ' నినాదాలతో విమానాశ్రయ పరిసరాలు హోరెత్తాయి. 'ఆస్ట్రేలియన్ ఇండియన్ ఆర్కెస్ట్రా' అందించిన వందేమాతరం ఆలాపన ఈ స్వాగత వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇండోనేషియా పర్యటన ముగించుకుని ఆస్ట్రేలియా వచ్చిన ప్రధాని మోదీ, ఈ పర్యటన అనంతరం న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు.

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి సరికొత్త ఊపు

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో జరగబోయే ద్వైపాక్షిక చర్చలు ఇరు దేశాల 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత బలోపేతం చేస్తాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం Xలో స్పందిస్తూ... 'ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో చర్చల కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇరు దేశాల బంధానికి బలమైన స్తంభాలుగా నిలుస్తున్న ప్రవాస భారతీయులతో ముచ్చటించే అవకాశం కూడా ఈ పర్యటనలో నాకు లభించనుంది.' అన్నారు.

ఈ ఉన్నత స్థాయి భేటీలో ఇరు దేశాల ప్రధానమంత్రులు రక్షణ-భద్రత, వ్యాపారం-పెట్టుబడులు, విద్య, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలతో పాటు అభివృద్ధి చెందుతున్న కీలక సాంకేతికతలు, క్రీడలు, స్పోర్ట్స్ సైన్స్ రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లనున్నారు.

భారత్-ఆస్ట్రేలియా మధ్య వాణిజ్య సంబంధాలు గతంతో పోలిస్తే విపరీతంగా పుంజుకున్నాయి. ఆస్ట్రేలియా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ విక్టోరియా ట్రెజరర్ ప్రకాష్ గుప్తా తెలిపిన వివరాల ప్రకారం.. ఒకప్పుడు కేవలం 14 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల ద్వైపాక్షిక వ్యాపారం ప్రస్తుతం 55 బిలియన్ డాలర్లకు చేరుకుంది. రాబోయే 2030 నాటికి ఈ వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా ఇరు దేశాలు అడుగులు వేస్తున్నాయి.

మారుతున్న ప్రపంచ స్థితిగతుల నేపథ్యంలో భారత్‌కు అవసరమైన 'యురేనియం'ను ఆస్ట్రేలియా సరఫరా చేయగలదని, అలాగే ఆస్ట్రేలియాకు ఎంతో అవసరమైన ప్రొఫెషనల్ ఐటీ నిపుణులను భారత్ అందించగలదని, దీనివల్ల ఇరు దేశాల వ్యాపారాలు మరింత విస్తరిస్తాయని ప్రవాస భారతీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భారత్‌లో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ మెల్‌బోర్న్ నుంచి 'ఎక్స్'లో ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని పంచుకున్నారు. ప్రధాని మోదీ రాకతో మెల్‌బోర్న్ నగరం మొత్తం ఒక సరికొత్త ఉత్సాహంతో ఊగిపోతోందని ఆయన పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య మొదటి దశ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇప్పటికే అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని, ఈ పర్యటనతో వాణిజ్య బంధం మరింత పటిష్ఠం కానుందని ఆయన తెలిపారు. అలాగే సంస్కృతికి నిలయమైన మెల్‌బోర్న్ నగరంలో భారత్‌తో కలిసి కళలు, సాంస్కృతిక రంగాలలో మరిన్ని ఉమ్మడి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రీన్ వెల్లడించారు.



# సంస్కృతి బహ్రెయిన్ నూతన కార్యవర్గం ఎన్నిక

బహ్రెయిన్: భారతమాతకు దూరంగా అరేబియా ఎడారి దేశంలో మాతృభూమి సేవకోసం పరితపించే సంస్థ సంస్కృతి బహ్రెయిన్. భారత్‌లోని 27 రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులతో దశాబ్దకాలానికి పైగా సంస్కృతి బహ్రెయిన్ సామాజిక, సాంస్కృతిక సేవలందిస్తోంది. ఇటీవల ఈ సంఘం తన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అందులో హైదరాబాద్‌కు చెందిన దీపక్ నంద్యాల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



భారతీయ సనాతన ధర్మం, జాతీయ భావాల మధ్య విడదీయరాని బంధం ఉందని ప్రగాఢంగా విశ్వసించే దీపక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... సనాతన ధర్మం కేవలం ఒక మతం మాత్రమే కాదన్నారు. అది మానవాళికి శాంతిని, సమైక్యతను, ధర్మాన్ని బోధించే ఒక జీవన విధానమన్నారు. విదేశాల్లో భారత దేశ సంస్కృతి, జాతీయ సమగ్రతకు బలమైన పునాదిగా పనిచేస్తున్న మంత్రం సనాతనమని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో స్వచ్ఛ భారత్ మిషన్ ఆశయానికి అనుగుణంగా అరేబియా సముద్ర తీరంలో ప్రతి వారం శుభ్రతా కార్యక్రమాన్ని సంస్కృతి బహ్రెయిన్ నిర్వహిస్తోంది. ఆరోగ్య పరిరక్షణ, రక్తదాన శిబిరాలతో పాటు యాంత్రిక జీవితంలో అలసిపోయిన వారికి ప్రత్యేకంగా యోగా శిబిరాలను కూడా సంస్కృతి బహ్రెయిన్ నిర్వహిస్తోంది. ఈ సంస్థ నిర్వహించిన లిటిల్ ఇండియా కార్యక్రమం బహ్రెయిన్‌లో భారతీయ స్ఫూర్తిని రగిలించిందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. సంస్కృతి బహ్రెయిన్ కార్యవర్గానికి దీపక్ నంద్యాల అధ్యక్షుడిగా ఎన్నిక కాగా రేజు ఆండ్రూస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆనంద్.జె (ఉపాధ్యక్షుడు), హరీష్ నాయర్ (కోశాధికారి), హనుమంతరావు (సంయుక్త కార్యదర్శి), రంజిత్. పి (సభ్యత్వ కార్యదర్శి), వెంకట్‌స్వామి, ప్రేమ్‌సాగర్, రాజీష్, వినయ్ చండల్ (కార్యనిర్వాహక సభ్యులు), సురేష్‌బాబు (విదేశీ సమన్వయకర్త), ప్రవీణ్.ఎస్ (సలహాదారు), ప్రదీప్.ఎస్ (సంయోజక్) కూడా కార్యవర్గానికి ఎన్నికయ్యారు. ఆనంద్.జె స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన సమావేశం హరీష్‌నాయర్ వందన సమర్పణతో ముగిసింది. సమావేశంలో ప్రముఖులు డాక్టర్ అరుణ్‌కుమార్ ప్రహరాజ్, ప్రత్యేక అతిథులు అభిషేక్ దేవ్‌జీ, బ్రిజ్‌భూషణ్ కిషోర్ పాల్గొన్నారు.

# న్యూయార్క్‌లో రోడ్డు ప్రమాదం

## ఏపీ విద్యార్థిని అట్లూరి ప్రసన్న దుర్మరణం



న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన ఒక దురదృష్టకర రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువతి అట్లూరి ప్రసన్న (25) ప్రాణాలు కోల్పోయింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన ప్రసన్న దుర్మరణం చెందింది. న్యూయార్క్ స్టేట్ పోలీసుల కథనం ప్రకారం.... ప్రయాణిస్తున్న కారు స్టేట్ రూట్స్ 224, 13 కూడలి వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆపకుండా ముందుకు వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో గ్రీన్ సిగ్నల్‌తో వస్తున్న బ్రయాన్ జె.వుడ్‌వర్త్ అనే వ్యక్తి నడుపుతున్న మరో వాహనం ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో కారు వెనుక సీటులో కూర్చున్న ప్రసన్న అక్కడికక్కడే మరణించింది. రాబర్ట్ ప్యాకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కారులోని డ్రైవర్, మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

అయితే ప్రసన్న కుటుంబసభ్యులు, ఆమె బంధువు రవికుమార్ ఏర్పాటు చేసిన 'గోఫండ్‌మీ' పేజీలో పేర్కొన్న వివరాల ప్రకారం... ఎదురుగా వస్తున్న కారు రెడ్ లైట్ జంప్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రసన్న ఇటీవలే న్యూయార్క్‌లోని పేస్ యూనివర్సిటీ నుంచి తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని ఉద్యోగ వేటలో ఉన్న తరుణంలో ఈ విషాదం చోటుచేసుకోవడం ఆమె కుటుంబ సభ్యులను శోకసంద్రంలో ముంచెత్తింది. ప్రస్తుతం ప్రసన్న పార్థివదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారుల సోదాలు



దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు బుధవారం భారీగా సోదాలు చేపట్టారు. ఐసీస్, ఏక్యూఐఎస ఉగ్రవాద కార్యకలాపాల ప్రచారంపై సోదాలు చేశారు. భారత్‌లో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు 10 రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పరికరాలను ఫోరెన్సిక్

## ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం

పరీక్షలకు పంపనున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 11 మంది నిందితులు, ఓ బాలుడిని జువెనైల్ నుంచి అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. విజయవాడ పోలీసులు మార్చిలో నమోదు చేసిన కేసును మేలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలో ఐసీస్, ఏక్యూఐఎస్‌కు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ ఆధారంగా ఎన్ఐఏ అధికారులు ఇవాళ సోదాలు నిర్వహించారు. అరెస్టైన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా సంబంధాలు కొనసాగిస్తూ ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన వారిని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.

# భారీ వర్షాలతో మహారాష్ట్రలో బీభత్సం

## పూణే లో కూలిన మూడంతస్తుల భవనం

మహారాష్ట్రను ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణేలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడు అంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి, చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ (ప్రజవీజ) వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా నేలమట్టమైంది. అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది. మధ్యాహ్నం సుమారు 1.45



గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై వెంటనే సమాచారం అందుకున్న పీసీఎంసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాలింపు, సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దించారు.

# కాశీ విశ్వనాథుడి బాటలోనే ఆయోధ్య రాముడి భద్రత

ఆలయంలో దోపిడీ అంటే నగదు, బంగారం, వజ్రాలను చోరీ చేయడం మాత్రమే కాదు.. భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని కూడా దోచుకోవడం. ఇటీవల అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో, గతంలో జరిగిన కాశీ విశ్వనాథుడి ఆలయ దోపిడీ ఘటన మళ్లీ చర్చనీయాంశమైంది. నాలుగు దశాబ్దాల క్రితం, కాశీ విశ్వనాథ ఆలయంలో జరిగిన ఒక దొంగతనం కారణంగా దాని నిర్వహణను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. 1983 జనవరిలో, కాశీ విశ్వనాథ ఆలయ గర్భగుడిలో శివలింగం చుట్టూ ఉన్న 2.6 కిలోల బంగారు ఆభరణాలు, దాదాపు 9 కిలోల వెండి చోరీకి గురయ్యాయి. ఈ చోరీకి పాల్పడిన 11 మందిని అరెస్ట్ చేశారు. అప్పుడు కూడా ఆలయంలో పని చేసే వారి సహాయంతోనే దోపిడీ జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన అనంతరం కాశీ విశ్వనాథ ఆలయ భద్రత, ఆర్థిక నిర్వహణలో లోపాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఆలయ నిర్వహణను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు ఆధీనంలోకి తీసుకువచ్చింది. అప్పటి నుంచి భద్రతా వ్యవస్థలు, విరాళాల లెక్కింపు, పరిపాలనలో పలు సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. అయోధ్య రామమందిర విషయంలో కూడా ప్రభుత్వం నూతన సంస్కరణలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, రామ మందిర ఆలయ ట్రస్టుకు జవాబుదారీగా ఉండే సీఈవో నియామకానికి తాము అంగీకరిస్తామని, అయితే ప్రభుత్వ స్వాధీనాన్ని మాత్రం అనుమతించబోమని వీహెచ్‌పీ తెలిపింది, శ్రీ రామ్ జన్మభూమి ఆలయాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చే ఏ ప్రయత్నాన్నైనా తాము వ్యతిరేకిస్తామని వీహెచ్‌పీ పేర్కొంది.



# బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకలపై దర్యాప్తు ముమ్మరం

బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకలపై దర్యాప్తు చేయడానికి శ్రీ బద్రీనాథ్ కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (బీకేటీసీ) నలుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం నుంచే ఈ కమిటీ దర్యాప్తును మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలోనే శ్రీ బద్రీనాథ్ కేదార్‌నాథ్ టెంపులు కమిటీ ఓ సిబ్బందిపై వేటు వేసింది. విరాళాలు చోరీ చేశాడన్న ఆరోపణల కారణంగా అతడిని విధుల నుంచి సస్పెండ్ చేసింది. దీనిపై బీకేటీసీ చైర్మన్ హేమంత్ ద్వివేది స్పందిస్తూ.. 'ప్రైవేట్ సెక్రటరీగా పని చేసే ప్రమోద్ నౌతియాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశాం. ప్రాథమిక దర్యాప్తులో విరాళాల విషయంలో అతడు అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది' అని పేర్కొన్నారు. ఇక, సస్పెండ్ అయిన ప్రమోద్ నౌతియాల్‌పై మంగళవారం రాత్రి బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదైంది. అతనిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 306, 316(5) కింద కేసులు నమోదు అయ్యాయి.

## శరవేగంగా గవర్నమెంట్ కమిటీ దర్యాప్తు

ఆలయ విరాళాల వివాదంపై మరో వైపు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటైంది. ఈ హై లెవల్ కమిటీకి గర్వాల్ డివిజనల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ నాయకత్వం వహిస్తున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ తివారీ, మెడికల్ హెల్త్ సర్వీసెస్ ఫైనాన్స్ డైరెక్టర్ జగత్ సింగ్ చౌహాన్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. బద్రీనాథ్ ఆలయ విరాళాలు, కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఈ కమిటీని ఆదేశించారు.

# పోలీసు ఎన్‌కౌంటర్‌లో కామాంధుడి ఖతం

పశ్చిమ బెంగాల్‌కు చెందిన 11 ఏళ్ల బాలిక హత్యాచారం కేసులో అదుపులోకి తీసుకున్న ముగ్గురిలో ఓ అనుమానితుడు మంగళవారం పోలీసుల ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 11 ఏళ్ల బాలిక హత్యాచారం కేసులో పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం ముగ్గురిని బరూయ్‌పూర్ తీసుకెళ్లారు. అక్కడ క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్న సమయంలో ప్రవాశ్ పోలీసుల నుంచి తుపాకి లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలోనే పోలీసులు అతడిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ప్రవాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రవాశ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. దక్షిణ 24 పరగణాస్‌కు చెందిన 6వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలిక తన స్నేహితురాలి పుట్టినరోజు సందర్భంగా బహుమతి కొనడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కానీ, రాత్రి అయినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. గత శనివారం అదృశ్యం అయిన బాలిక శవం ఆదివారం ఓ చెరువులో కనిపించింది. బాలిక శవాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం రిపోర్టులో బాలిక అత్యాచారం అనంతరం హత్యకు గురైనట్లు బయటపడింది. ఈ నేపథ్యంలోనే పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

# తమిళనాడు సీఎం విజయానికి సవాల్



తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత జోసెఫ్ విజయ్‌కు మరో కొత్త సవాలు ఎదురైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీవీకే విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మద్రాస్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీవీకే గెలుపును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై న్యాయస్థానం ఈ మేరకు స్పందించింది. సీఎం విజయ్, కేంద్ర ఎన్నికల సంఘం మూడు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది. అలాగే సదరు పిటిషన్లపై కొన్ని ప్రక్రియాపరమైన అంశాలనూ లేవనెత్తుతూ, వాటిని సరిదిద్దుకోవాలని జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ ధర్మాసనం సూచించింది. పెరంబూర్‌లో విజయ్ చేతిలో ఓడిన డీఎంకేకు చెందిన ఆర్‌డీ.శేఖర్, అదే నియోజకవర్గానికి చెందిన దినేశ్, లక్ష్మీనరసింహన్ అనే మరో ఇద్దరు ఓటర్లతో కలిసి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తిరుచ్చి ఈస్ట్ ఫలితాన్ని సవాల్ చేస్తూ డీఎంకేకు చెందిన ఎస్.ఇనిగో ఇరుదయరాజ్ మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. విజయ్ ఎన్నికల ప్రచారంలో చిన్నారులను భావోద్వేగపూరితంగా ఉద్దేశించి, వారి ద్వారా కుటుంబ సభ్యుల ఓట్లను ప్రభావితం చేసేలా ప్రసంగించారని ఆరోపించారు. ఇది ఎన్నికల ప్రచారంలో చిన్నారులను వినియోగించరాదన్న ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొన్నారు. సాక్ష్యంగా చెన్నైలోని వైఎంసీఏ మైదానంలో ఏప్రిల్ 21న విజయ్ ప్రచార ప్రసంగానికి సంబంధించిన వీడియోలను సమర్పించారు. అదేవిధంగా ప్రచార గీతాల రూపకల్పనకు సంబంధించిన ఖర్చులను ఎన్నికల వ్యయాల్లో చూపలేదని, ఆస్తుల అఫిడవిట్‌లో ఆదాయపు పన్ను బకాయిల వివరాల్లోనూ వ్యత్యాసాలున్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అలాగే ఏప్రిల్ 19న సెయింట్ ఆంటోనీ చర్చిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారన్న అంశాన్నీ ప్రస్తావించారు. మరోవైపు.. విల్లివాక్కం ఎమ్మెల్యే, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఆధవ్ అర్జున్ ఎన్నికల విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పైనా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అలాగే తిరువణ్ణామలై ఎమ్మెల్యే ఈవీ.వేలు, టీవీకేలో చేరిన మాజీ డీఎంకే ఎమ్మెల్యే ఎస్.జయకుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్యే తరగై కుత్‌బర్ట్ ఎన్నికల విజయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపైనా న్యాయస్థానం వారికి నోటీసులు పంపింది. కొందరు ప్రతివాదులు జులై 21లోపు తమ సమాధానాల్ని తెలపాలని ఆదేశించింది.

# చర్చలతో కాలయాపనే : ట్రంప్



ఇరాన్‌లోని పలు ప్రాంతాలపై భీకర దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. బుధవారం రాత్రి ఇరాన్‌పై మళ్లీ దాడులు జరగవచ్చని హెచ్చరించారు. తుర్కియే వేదికగా జరుగుతున్న నాటో సమావేశాల్లో పాల్గొన్న ట్రంప్ విలేకరులతో కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై మళ్లీ దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'వాళ్లకు ఒక చిన్న వార్నింగ్ ఇస్తున్నా. మేము నేటి రాత్రి వారిపై మళ్లీ భీకర దాడులు చేయవచ్చు. వాళ్ల తీరు ఏమాత్రం బాలేదు. గత 47 ఏళ్లుగా ఇలాగే చేస్తున్నారు' అని ట్రంప్ హెచ్చరించారు. వ్యక్తిగత చర్చల్లో చెప్పిన మాటలకు బహిరంగంగా వారు చేసే వ్యాఖ్యలకు పొంతన లేదని అన్నారు. 'వాళ్ల తీరు పిచ్చిగా ఉంది. ఏదో తేడా కనిపిస్తోంది' అని అన్నారు. ఇదిలా ఉంటే, ఇరాన్‌తో శాంతి ఒప్పందం కథ ముగిసిందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రపంచ వ్యాప్తంగా కలకలం రేపాయి. పలు దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలగా ముడి చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ఇటీవల హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ సైన్యం దాడులతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. ఈ దాడులపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా ఇరాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత రాడార్ వ్యవస్థలు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, 60కి పైగా నౌకలపై దాడులు చేసింది. ఇక అమెరికా చేస్తున్న ఆరోపణలను ఇరాన్ తోసిపుచ్చింది.

శాంతిస్థాపన కోసం జరిగిన అవగాహన ఒప్పందాన్ని మొదట అమెరికానే ఉల్లంఘించిందని తేల్చి చెప్పింది. ముడి చమురును డాలర్లలో విక్రయించేందుకు గతంలో ఇచ్చిన అనుమతులను యూఎస్ ఉపసంహరించుకోవడంపై ఇరాన్ విమర్శలు గుప్పించింది.



# ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు

శాంతి ఒప్పందాన్ని పక్కన పెట్టేసి ఇరాన్ హోర్ముజ్‌లో వాణిజ్య నౌకలపై దాడులు చేయడంతో అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. మంగళవారం ఖేష్మ్ ఐల్యాండ్, బందర్ అబ్బాస్, సిరిక్ వంటి 10 ప్రాంతాల్లో దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ రెవల్యూషనరీ కార్ప్స్ గార్డ్స్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు నౌకలపై ఐఆర్‌జీసీ మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ దాడుల్లో నౌకలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. అయితే.. ఈ దాడుల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. మరో ఘటనలో.. ఒమన్‌లోని లిమా తీరంలో దక్షిణ దిశగా ప్రయాణిస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను పేలుడు వస్తువు బలంగా ఢీకొట్టింది. ట్యాంకర్ దెబ్బతింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఇరాన్ దాడులకు పాల్పడటంపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

# అదృశ్యమైన పాకిస్థాన్ కార్గో విమానం




పాకిస్థాన్‌కు చెందిన ఓ కార్గో విమానం అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది. కే2 ఎయిర్‌వేస్‌కు చెందిన బోయింగ్ 737 విమానం మంగళవారం షార్జా నుంచి కరాచీకి బయలుదేరింది. మంగళవారం రాత్రి కరాచీకి సుమారు 155 నాటికల్ మైళ్ల

## అరేబియా సముద్రంలో గాలింపు

దూరంలో అరేబియా సముద్రంపై ప్రయాణిస్తున్న సమయంలో నావిగేషన్ వ్యవస్థలో సమస్య ఉందని పైలట్లు తెలియజేశారు. నావిగేషన్‌లో సమస్య ఉందని తెలియజేసిన కాసేపటికే ఆ విమానం రాడార్, రేడియో సంప్రదింపులను కోల్పోయింది. విమానంలో ఐదుగురు సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. విమానం అరేబియా సముద్రంపై ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రాథమిక రాడార్, ఫ్లైట్ ట్రాకింగ్ సమాచారం ప్రకారం విమానం చివరి నిమిషాల్లో అసాధారణంగా ఎత్తు మారుస్తూ, వేగంగా కిందకు దిగినట్లు తెలుస్తోంది. ఆ విమానం కచ్చితంగా ప్రమాదానికి గురైందా అనే విషయాన్ని అధికారులు ఇంకా ధ్రువీకరించలేదు. ఘటన అనంతరం పాకిస్థాన్ అధికారులు భారీ స్థాయిలో గాలింపు చర్యలు ప్రారంభించారు. పాకిస్థాన్ నేవీ, ఎయిర్ ఫోర్స్, కోస్ట్ గార్డ్, వాణిజ్య నౌకలను రంగంలోకి దింపి అరేబియా సముద్రంలో విమానం కోసం వెతుకుతున్నారు.



# చిన్నారుల గుండె ఆపరేషన్ల కోసం...
# యావదాస్తిని దానం చేసిన పుణ్యదంపతులు

పిల్లలు లేని ఓ జంట గొప్ప మనసు చాటుకుంది. గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్న పిల్లల కోసం తమ ఆస్తినంతా ఇచ్చేసింది. తమతో ఎలాంటి సంబంధం లేని 455 మంది పిల్లల కోసం 7 కోట్ల రూపాయల ఆస్తిని ఇచ్చేశారు. ఈ సంఘటన చైనాలో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. షాంగైకి చెందిన డూ ఇంగ్రోంగ్, సూయింగ్ భార్యాభర్తలు. 2018లో డూ ఓ ఆస్పత్రి దగ్గర ఓ పోస్టర్ చూశాడు. ఆ పోస్టర్‌లో.. 'గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్న పిల్లలకు ఆర్థిక సాయం చేయండి' అని ఉంది. ఆ పోస్టర్‌ను చూడగానే డూ చలించిపోయాడు. ఇంటికి వెళ్లిన తర్వాత భార్యకు విషయం చెప్పాడు. డూ, సూయింగ్‌లు ఏమాత్రం ఆలోచించకుండా అదే రోజు 10 మంది పిల్లల ఆపరేషన్ కోసం ఏకంగా 70 లక్షల రూపాయలు సాయం చేశారు. అంతేకాదు.. తమ ఆస్తిని మొత్తం పిల్లల గుండె ఆపరేషన్‌ల కోసం దానం చేశారు. దాదాపు 7 కోట్ల రూపాయలను చారిటీకి ఇచ్చేశారు. 'మీకోసం కొంతైనా ఉంచుకోండి' అని ఎంతమంది చెప్పినా వాళ్లు వినలేదు. డూ మాట్లాడుతూ.. 'మేము ఎక్కువ కాలం ఈ భూమ్మీద ఉండలేము. మా దగ్గర కొంత డబ్బు ఉంది. పెన్షన్ కూడా వస్తోంది. మాకు పెద్దగా డబ్బు అవసరం లేదు' అని తేల్చి చెప్పాడు. అలా.. డూ దంపతులు తమ కోట్ల ఆస్తిని 455 మంది పిల్లల గుండె ఆపరేషన్ల కోసం ఇచ్చేశారు. డూ దంపతులకు దాన గుణం ఎక్కువ. చైనాలో ఏ ప్రకృతి విపత్తు, ప్రమాదాలు జరిగినా సాయం చేసేవారు. డూ 2018లో 81 ఏళ్ల వయసులో చనిపోయాడు. సూయింగ్ 2025లో 92 ఏళ్ల వయసులో చనిపోయింది. దంపతులిద్దరూ ప్రాణాలతో లేకపోయినా.. వారు చేసిన సేవలు మాత్రం చరిత్రలో నిలిచిపోయాయి.

## వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు

హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ రెవల్యూషనరీ కార్ప్స్ గార్డ్స్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు నౌకలపై ఐఆర్‌జీసీ మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ దాడుల్లో నౌకలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. అయితే.. ఈ దాడుల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. మరో ఘటనలో.. ఒమన్‌లోని లిమా తీరంలో దక్షిణ దిశగా ప్రయాణిస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను పేలుడు వస్తువు బలంగా ఢీకొట్టింది. ట్యాంకర్ దెబ్బతింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఇరాన్ దాడులకు పాల్పడటంపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

# అమెరికా ఉద్యోగాధారిత కార్డు మరింత దూరం

## పెర్మ్ లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తుల పరిశీలనలో జాప్యం




అమెరికాలో ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విదేశీ ఉద్యోగులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ లేబర్ విడుదల చేసిన తాజా ప్రాసెసింగ్ అప్‌డేట్ ప్రకారం, పెర్మ్ లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తుల పరిశీలనలో దాదాపు ఒక సంవత్సరం బ్యాక్‌లాగ్ కొనసాగుతోంది. దీంతో గ్రీన్ కార్డు ప్రక్రియ మొత్తం మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. పెర్మ్ అనేది ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డు పొందే ప్రక్రియలో మొదటి, అత్యంత కీలకమైన దశ. ఒక అమెరికన్ కంపెనీ, విదేశీ వ్యక్తిని శాశ్వత ఉద్యోగిగా నియమించుకోవాలంటే ముందుగా అమెరికాలో ఆ ఉద్యోగానికి తగిన స్థానిక అభ్యర్థులు అందుబాటులో లేరని నిరూపించాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే యజమాని ఉద్యోగి తరఫున పెర్మ్ దరఖాస్తు చేస్తాడు. పెర్మ్ దశ పూర్తైన తర్వాతే ఇమిగ్రెంట్ పిటిషన్ దాఖలు చేయడానికి అవకాశం ఉంటుంది. పెర్మ్‌లో జాప్యం ఏర్పడితే మొత్తం గ్రీన్ కార్డ్ ప్రక్రియ కూడా వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం అధికారులు 2025 జూన్‌లో లేదా అంతకుముందు దాఖలైన పెర్మ్ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. దీంతో కొత్తగా దరఖాస్తు చేస్తున్నవారికి గ్రీన్ కార్డు ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇక, ఆడిట్‌కు ఎంపికైన కేసుల్లో 2025 డిసెంబర్ వరకు దాఖలైన దరఖాస్తులను మాత్రమే ప్రాసెస్ చేస్తున్నారు. అంటే ప్రస్తుతం కొత్తగా పెర్మ్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కనీసం 10–12 నెలలు వేచి ఉండాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అమెరికాలో హెచ్–1బీ వీసాపై పనిచేస్తున్న భారతీయులలో చాలా మంది ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డు కోసం పెర్మ్ ప్రక్రియను అనుసరిస్తారు. పెర్మ్ దశలోనే ఏడాది ఆలస్యం అయితే.. గ్రీన్ కార్డు ప్రక్రియ ప్రారంభం ఆలస్యమవుతుంది. ఉద్యోగ మార్పులు, ప్రమోషన్లు వంటి కెరీర్ నిర్ణయాలపై ప్రభావం పడవచ్చు. అలాగే కుటుంబ సభ్యుల వీసా ప్రణాళికలు కూడా ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

# ఇది నా జీవితంలోనే అత్యుత్తమ

## పుట్టినరోజు కానుక: దాదా





భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ బుధవారం 54వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఆయన జీవిత కథ ఆధారంగా తెరుక్కుతున్న చిత్రం 'దాదా: ది సౌరభ్ గంగూలీ స్టోరీ'. గంగూలీ పుట్టినరోజు సందర్భంగా సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇందులో ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానం బాల్కనీలో చొక్క విప్పి ఊపుతూ చేసుకున్న ఐకానిక్ సెలబ్రేషన్స్ ఫొటోను రీక్రియేట్ చేశారు. ఈ పోస్టర్‌పై గంగూలీ స్పందించాడు. తన జీవితంలోనే ఇది అత్యుత్తమ పుట్టిన రోజు కానుక అంటూ ఆనందం వ్యక్తం చేశాడు. ఈ మేరకు 'ఎక్స' వేదికగా పోస్ట్ పెట్టాడు.

జాతీయ అవార్డు గ్రహీత రాజ్‌కుమార్‌రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ బయోపిక్ వచ్చే ఏడాది మే 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ అనంతరం గంగూలీ మాట్లాడాడు. 'పుట్టినరోజు ఎప్పుడూ ప్రత్యేకమే. కానీ నా బయోపిక్ ఫస్ట్ లుక్‌ను ఇదే రోజున విడుదల చేయడం ఈ రోజును మరింత చిరస్మరణీయంగా మార్చింది. ఇంతకంటే గొప్ప బహుమతి ఇంకొకటి ఉండదు. ఈ పోస్టర్ చూసిన వెంటనే నా కెరీర్‌లోని ఓ అద్భుతమైన క్షణం కళ్ల ముందు మెదిలింది. రాజ్‌కుమార్‌రావు ఈ పాత్ర కోసం ఎంతో నిబద్ధతతో సిద్ధమయ్యాడు. అతను నా ప్రయాణాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తాడనే నమ్మకం ఉంది. ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. అభిమానులంతా థియేటర్లలో చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని గంగూలీ వెల్లడించాడు.

గంగూలీ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పి గాల్లో ఊపుతున్న గంగూలీ ఐకానిక్ సెలబ్రేషన్‌ను రాజ్‌కుమార్‌రావు అచ్చం అలాగే రీక్రియేట్ చేశాడు. బ్యాగౌండ్రోలో త్రివర్ణ పతాకం కనిపించేలా పోస్టర్‌ను డిజైన్ చేశారు. 2002 నాట్‌వెస్ట్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై భారత్ సాధించిన చిరస్మరణీయ విజయానంతరం గంగూలీ లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పి సంబరాలు జరుపుకోవడం భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఘట్టం. అదే సన్నివేశాన్ని ఈ బయోపిక్ ఫస్ట్ లుక్‌కు కేంద్ర బిందువుగా మలిచారు.

# టీమిండియాకు మరో హెడ్ కోచ్
# వీవీఎస్ లక్ష్మణ్‌కూ బాధ్యతలు!



టీమిండియా వరుస సిరీస్‌లతో బిజీ షెడ్యూల్ ఎదుర్కొంటున్న వేళ.. బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రెగ్యులర్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పాటు నేషనల్ క్రికెట్ అకాడమీ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌కు కూడా కోచింగ్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు సమాచారం. రానున్న జింబాబ్వే పర్యటనతో పాటు ఆసియా క్రీడల్లో భారత జట్టుకు వీవీఎస్ లక్ష్మణ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరించనున్నట్లు క్రీడా వర్గాలు పేర్కొన్నాయి. అతడికి బ్యాటింగ్ కోచ్ హృషికేశ్ కనిట్కర్, బౌలింగ్ కోచ్ సునీల్ జోషి సహకారం అందించనున్నారు. ఇంగ్లండ్ వన్డే సిరీస్ ముగిసిన తర్వాత గౌతమ్ గంభీర్‌కు బీసీసీఐ రెస్ట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనలో ఉంది. ఐర్లాండ్ చేతిలో 0-2తో సిరీస్ కోల్పోయిన తర్వాత ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ ఆడుతోంది. కాగా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ జులై 14, 16, 19 తేదీల్లో జరగనుండగా.. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే భారత్ జింబాబ్వే పర్యటనకు బయలుదేరాల్సి ఉంటుంది. దీంతో కోచింగ్ సిబ్బందికి కూడా విశ్రాంతి, ప్రయాణ పరంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండటంతో బీసీసీఐ ఈ మార్పు చేసినట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్ జులై 23 నుంచి ప్రారంభం కానుంది. రెండో, మూడో మ్యాచ్‌లు జులై 25, 26 తేదీల్లో జరగనున్నాయి. హరారే వేదికగా అన్ని మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

**ఆసియా క్రీడల్లోనూ..**

జపాన్ వేదికగా జరగనున్న ఆసియా క్రీడలకు కూడా వీవీఎస్ లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా కొనసాగే అవకాశం ఉంది. సెప్టెంబర్‌లో భారత్‌కు మరింత బిజీ షెడ్యూల్ ఉంది. సెప్టెంబర్ 13 నుంచి 19 వరకు అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుండగా, సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 3 వరకు ఆసియా క్రీడల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఇదే సమయంలో వెస్టిండీస్‌తో భారత్ వన్డే, టీ20 సిరీస్‌లు కూడా ఆడనుంది. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే ఈ పర్యటనలో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఉంటాయి. వెస్టిండీస్ సిరీస్‌కు గౌతమ్ గంభీర్ తిరిగి జట్టులో చేరనున్నట్లు తెలుస్తోంది.

**లక్ష్మణ్‌కు ఇది రెండోసారి..**

భారత ద్వితీయ శ్రేణి జట్టుకు లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి కాదు. 2024లో జింబాబ్వే పర్యటనలో శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో భారత టీ20 జట్టుకు లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరించాడు. అదే సిరీస్‌లో అభిషేక్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అలాగే 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల సమయంలోనూ లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా ఉన్నాడు. ఆ సమయంలో ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ వన్డే ప్రపంచ కప్ జట్టుతో బిజీగా ఉండటంతో ఆసియా క్రీడల బాధ్యతలను లక్ష్మణ్‌కు అప్పగించారు.

# క్వార్టర్ ఫైనల్స్‌కు లైన్ క్లియర్

ఫిఫా ప్రపంచ కప్ 2026 క్వార్టర్ ఫైనల్ దశకు చేరింది. రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లు ముగియడంతో క్వార్టర్ ఫైనల్స్ పోరుకు లైన్ క్లియర్ అయింది. ఇక్కడి నుంచి మ్యాచ్‌లు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి. లీగ్ దశలో 48 జట్లు పోటీపడితే అందులో 32 నాకౌట్ దశకు చేరాయి. అక్కడి నుంచి 16 జట్లు ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాయి. తాజాగా క్వార్టర్ ఫైనల్ స్టేజ్‌కి 8 జట్లు చేరాయి. ఈ ఫిఫాలో ఎన్నో ఆశ్చర్యకరమైన ఫలితాలు, ఉత్కంఠభరితమైన క్షణాల మధ్య సాగిన ఈ రౌండ్‌లో ఫేవరెట్ జట్లు కొన్ని ముందంజ వేయగా మరికొన్ని జట్లు ఇంటిబాట పట్టాయి. జర్మనీ, పోర్చుగల్, నెదర్లాండ్స్, క్రొయేషియా లాంటి జట్లు ప్రి క్వార్టర్స్‌లోనే టోర్నీ నుంచి నిష్క్రమించాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా సైతం ఈజిప్ట్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక దశలో 2-0తో వెనుకబడి, లీ మిస్సి అద్భుతమైన ఫామ్‌తో కేవలం 13 నిమిషాల్లో 3 గోల్స్ కొట్టి 3-2తో నాటకీయ విజయాన్ని అందుకుంది.

మరోవైపు మొరాకో 3-0తో కెనడాను, ఫ్రాన్స్ 1-0తో పరాగ్వేను, బెల్జియం 4-1తో యూఎసఏను ఓడించి క్వార్టర్స్‌కు చేరాయి. స్విట్జర్లాండ్-కొలంబియా మ్యాచ్ షూటౌట్‌కు దారితీయగా, స్విట్జర్లాండ్ విజయం సాధించింది. ఇంగ్లండ్ జట్టు 3-2తో మెక్సికోను ఓడించి ముందంజ వేసింది. అన్నీ కుదిరితే 2022 ఫిఫా ప్రపంచ కప్‌లో ఫైనల్లో తలపడిన అర్జెంటీనా, ఫ్రాన్స్ ఈసారి సెమీస్ లేదా మరోసారి ఫైనల్లో తలపడే ఛాన్స్ ఉంది. మొత్తంగా క్వార్టర్ ఫైనల్ దశ మరింత ఆసక్తికరంగా మారింది.

**క్వార్టర్ ఫైనల్స్ షెడ్యూల్:**

ఫ్రాన్స్ వర్సెస్ మొరాకో: జూలై 10 రాత్రి 1:30 గంటలకు (బోస్టన్ స్టేడియం)

స్పెయిన్ వర్సెస్ బెల్జియం: జూలై 11 రాత్రి 12:30 గంటలకు (లాస్ ఏంజెల్స్ స్టేడియం)

నార్వే వర్సెస్ ఇంగ్లాండ్: జూలై 12 తెల్లవారుజామున 2:30 గంటలకు (మయామి స్టేడియం)

అర్జెంటీనా వర్సెస్ స్విట్జర్లాండ్: జూలై 12 ఉదయం 6:30 గంటలకు (కాన్సాస్ సిటీ స్టేడియం)

**లైవ్ స్ట్రీమింగ్ వివరాలు:**

ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌లను భారత్‌లో ' యూనైట8 స్పోర్ట్స్' ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించవచ్చు. డిజిటల్ స్ట్రీమింగ్ కోసం 'జీ5' యాప్‌లో మ్యాచ్‌లు అందుబాటులో ఉంటాయి.



# వీరే టాప్!

### టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత యువ ఆటగాళ్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ

ఐసీసీ పురుషుల టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత యువ ఆటగాళ్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ తమ అగ్ర స్థానాలను నిలబెట్టుకున్నారు. తాజా ర్యాంకింగ్స్ అప్‌డేట్‌లో వీరిద్దరూ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. కాకపోతే..ఇప్పటివరకు అగ్రస్థానంలో కొనసాగిన అభిషేక్ శర్మ రెండో స్థానంలోకి పడిపోయాడు. మరోవైపు భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు ఘనమైన ఆరంభాన్ని అందుకోవడంతో ఆ జట్టు ఆటగాళ్లు తమ ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపర్చుకున్నారు.

తొలి మ్యాచ్ వర్షం వల్ల రద్దు కాగా... ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచిన ఇంగ్లండ్ ప్రస్తుతం 2-0 ఆధిక్యంలో ఉంది. ముఖ్యంగా మూడో టీ20లో ఇంగ్లండ్ 125 పరుగుల రికార్డు విజయాన్ని నమోదు చేసింది. టీ20 ఫార్మాట్‌లో భారత్‌కు ఇదే అత్యంత భారీ ఓటమి కావడం గమనార్హం. రెండో టీ20లో 46 బంతుల్లో 76 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ఇంగ్లాండ్‌ను గెలిపించిన జాకబ్ బెథెల్, ఏడు స్థానాలు ఎగబాకి బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 8వ స్థానానికి చేరుకున్నాడు.

అలాగే ఆల్‌రౌండర్ సామ్ కరన్ మూడు విభాగాల్లోనూ మెరుగైన ర్యాంకులు సాధించాడు. రెండో మ్యాచ్‌లో 3/33 వికెట్లు తీసి, మూడో మ్యాచ్‌లో 41 పరుగులతో రాణించిన కరన్.. బ్యాటింగ్‌లో 108, బౌలింగ్‌లో సంయుక్తంగా 71, ఆల్‌రౌండర్ల జాబితాలో ఆరు స్థానాలు మెరుగుపరుచుకుని 13వ స్థానానికి చేరుకున్నాడు. సీనియర్ లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ మూడో టీ20లో 2/14తో రాణించి బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి చేరాడు. తన రెండో టీ20లోనే 4 వికెట్లు తీసిన పేసర్ జోష్ టాంగ్ 301వ స్థానంతో ర్యాంకింగ్స్‌లోకి ప్రవేశించాడు. బంతితో రాణించిన విల్ జాక్స్ 6 స్థానాలు ఎగబాకి ఆల్‌రౌండర్ల విభాగంలో 7వ ర్యాంకుతో టాప్-10లోకి దూసుకొచ్చాడు.

చైతన్య రథం
సినిమా
గురువారం 9 జూలై 2026 X

# పెళ్లి పీటలెక్కిన 'కలర్స్' స్వాతి



కలర్స్ స్వాతిగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది స్వాతి రెడ్డి. క్యారెక్టర్ రోల్స్‌తో పాటు హీరోయిన్‌గా సూపర్ ఫ్యాన్ బేస్ ఖాతాలో వేసుకున్న ఈ ముద్దుగుమ్మ వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించింది. స్వాతి రెడ్డి దర్శకుడు, 'మంథ్ ఆఫ్ మధు' ఫేం శ్రీకాంత్ నగోటిను పెళ్లి చేసుకుంది. సంప్రదాయ పద్ధతిలో వివాహ వేడుక జరగ్గా...స్వాతి రెడ్డి తన భర్త చేయి పట్టుకున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ ఈ విష యాన్ని అభిమానులు, మూవీ లవర్స్‌తో షేర్ చేసుకుంది. ఇండస్ట్రీ స్నేహితులు, కోస్టార్లు, అభిమానులు కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న స్వాతికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. శ్రీకాంత్ నగోటి డైరెక్ట్ చేసిన రొమాంటిక్ డ్రామా 'మంథ్ ఆఫ్ మధు'లో స్వాతిరెడ్డి, నవీన్‌చంద్ర హీరో, హీరోయిన్లుగా నటించారని తెలిసిందే. ఈ ప్రాజెక్టు తర్వాత కొత్త సినిమాలకేం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు స్వాతి. స్వాతిరెడ్డికి ఇది రెండో వివాహం. స్వాతి రెడ్డి మొదట తన బాయ్‌ఫ్రెండ్, మలయాళి పైలట్ వికాస్ వాసును 2018 ఆగస్టు 30న వివాహం చేసుకుంది. అయితే ఈ ఇద్దరు 2022లో విడాకులు తీసుకున్నారు.

# పవన్‌కల్యాణ్, థమన్ భావోద్వేగం

## 'ఓజీ 2' ఆల్బమ్ హనుమకొండ చిన్నారి నిరంజన్‌కి అంకితం!



హనుమకొండకు చెందిన 17ఏళ్ల పవన్‌కల్యాణ్ వీరాభిమాని నిరంజన్ అకాల మరణం చిత్ర పరిశ్రమతో పాటు అభిమానుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. రాజకీయాల్లో తీరిక లేకుండా గడుపుతున్నప్పటికీ తన అభిమాని మృతి పట్ల పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి, వేదన వ్యక్తం చేశారు. గతంలో 'ఓజీ 2' సినిమా వేడుకకు నిరంజన్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తానని పవన్ కల్యాణ్ స్వయంగా మాట ఇచ్చారు. అయితే ఆ సినిమా పట్టాలెక్కే లోపే ఆ చిన్నారి కన్నుమూయడం అందరినీ కలచివేసింది. ఈ నేపథ్యంలో నిరంజన్‌కు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ చిత్ర సంగీత దర్శకుడు థమన్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ ప్రకటన చేశారు. మన లీడర్ పవన్‌కల్యాణ్ ఆకాంక్ష మేరకు 'ఓజీ 2' మ్యూజిక్ ఆల్బమ్ మొత్తాన్ని నిరంజన్ పవిత్ర ఆత్మకు అంకితం ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ కష్ట సమయంలో నిరంజన్ కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటూ పవన్‌కల్యాణ్, థమన్, అభిమాన లోకం ఘన నివాళులర్పించింది.

# నాడు నాన్న కోసం 'మనం'.. నేడు కొడుకు కోసం 'లెనిన'...

## రిలీజ్ ప్రెస్‌మీట్‌లో నాగార్జున ఎమోషనల్



అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎలఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ నిర్మించిన చిత్రం 'లెనిన'. ఈ సినిమాకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూలై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ క్రమంలో బుధవారం రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. కింగ్ నాగార్జున మాట్లాడుతూ .. "నందు ఈ కథ శ్రీరామపురంలో జరుగుతుందని చెప్పగానే నాకు మా నాన్న గారు గుర్తొచ్చారు. నందు ఈ కథను అద్భుతంగా రాశారు. డైలాగ్స్ గొప్పగా ఉంటాయి. నందు తన సొంతూరు శ్రీరామపురానికి అఖిల్‌ను తీసుకువెళ్లాడు. నందు ఇంట్లో అఖిల్‌ను సొంత బిడ్డలా చూసుకున్నారు. 'లెనిన' కథలో ఉండే పెయిన్‌ని అఖిల్ తన జీవితంలోనూ ఎదుర్కొన్నాడు. ప్రతీ సినిమాకి ఒకేలా కష్టపడతారంతా. అఖిల్‌లోని పెయిన్, ఈ కథలోని పెయిన్‌కి సింక్ కుదిరింది. నేను నిర్మాతగా ఇందులోకి వచ్చాను కాబట్టి కథ విషయంలోనూ ఎక్కువగా ఇన్వాల్వ్ అయ్యాను. షూటింగ్ టైంలో ఫుటేజ్ చూపించారు. ఇదొక గొప్ప సినిమా అవుతుందని అప్పుడే అనుకున్నాను. ప్రతీ ఒక్క పాత్రకు ఎంతో ఇంపార్టెన్స్ ఉంటుంది. భారతి పాత్ర (భాగ్యశ్రీ) ఈ సినిమాకి సోల్, హార్ట్ బీట్. ఎన్నో పాత్రలు, ఎన్నో లేయర్స్‌ని పెట్టి నందు గొప్ప కథను రాసుకున్నారు. వాటికి తగ్గట్టుగా తమన్ అద్భుతమైన ఆరఆర్ ఇచ్చారు. మేం తీసిన సినిమా ముందు మాకు నచ్చాలి. ఓటీటీల కోసం చిత్రాన్ని చేయలేదు. అందుకే మేం సంతృప్తి అయ్యే వరకు ఆగాం. జూన్‌లోనే మా మూవీ రెడీగా ఉంది. ఇంకో రెండు వారాల టైం ఇవ్వండని టెక్నీషియన్లు అడిగారు. దానివల్ల సినిమా ఇంకా ఎఫెక్టివ్‌గా వచ్చింది. నేను ఇంతగా ఇన్వాల్వ్ అయి చేసిన చివరి చిత్రం 'మనం'. అది నాన్న గారి కోసం చేశాను. ఇప్పుడు నా కొడుకు కోసం 'లెనిన' చేశాను. ఏ తండ్రి అయినా కొడుకు విజయం సాధించాలని కోరుకుంటాడు, కొడుకు సక్సెస్ అయితే తండ్రి సంతోషిస్తాడు. ప్రేమతో, ఇష్టంతో చేసిన 'లెనిన' సినిమాకి ఆడియెన్స్ కూడా అదే ప్రేమను తిరిగి ఇస్తారని ఆశిస్తున్నాను. ఈ మూవీతో కొత్త అఖిల్‌ను చూడబోతోన్నారు. ఎమోషనల్ సీన్స్, డైలాగ్ డెలివరీ విషయంలో అఖిల్ కొత్తగా కనిపిస్తాడు. సినిమా చూసిన కాన్ఫిడెన్స్‌తోనే చెప్తున్నా.. జూలై 10న వస్తున్నాం.. కొడుతున్నాం.. మనోడు కొడుతున్నాడు' అని అన్నారు.

హీరో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ .. "మన మూలాలకు, తెలుగు ప్రేక్షకుల మూలాలకు దగ్గరగా ఉండేలా 'లెనిన' కథ ఉంటుంది. 'లెనిన'ను కమర్షియల్ లెక్కల్లోంచి చూడలేదు. ఈ స్క్రిప్ట్‌ని నేను ఎక్కువగా గౌరవించాను. మేం నిజాయితీగా కష్టపడ్డాం. కథ విన్న వెంటనే సినిమాని ఒప్పుకున్నాను. ఇలాంటి ఓ గొప్ప కథను చెప్పాల్సిందే అని ఫిక్స్ అయ్యాను. 'లెనిన'ను నిజాయితీగా చేశాం. లెనిన్ పాత్రలోకి వెళ్లేందుకు నేను కష్టపడ్డాల్సి వచ్చింది. ఇందులో వయలెన్స్‌కి కూడా ఓ ఎమోషన్ ఉంటుంది. నందు గారు ఆర్గానిక్‌గా కథను రాశారు. మా కంటెంట్ మాట్లాడుతుంది. మా సినిమాకి ఫుల్ పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. నేను, నందు కొత్త వారిలానే కలిసి ఈ మూవీకి పని చేశాం.

# సుకుమార్ క్యాంప్ నుంచి మరో దర్శకుడు

## సిద్ధు జొన్నలగడ్డతో లాంచ్‌కు రంగం సిద్ధం

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ కేవలం విజయవంతమైన సినిమాలను తెరకెక్కించడమే కాకుండా ఇండస్ట్రీకి పలువురు ప్రతిభావంతులైన దర్శకులను అందించిన గురువుగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన వద్ద శిష్యరికం చేసిన అనేక మంది దర్శకులు ప్రస్తుతం టాలీవుడ్‌లో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తాజాగా ఆ జాబితాలోకి మరో కొత్త దర్శకుడు చేరనున్నట్టు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.తాజా సమాచారం ప్రకారం.. సుకుమార్ సోదరుడి కుమారుడు బాబీ త్వరలో దర్శకుడిగా పరిచయం కానున్నారు. గత కొంత కాలంగా సుకుమార్ వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన బాబీ.. ఆయన సినిమాలతో పాటు పలు ప్రాజెక్టుల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు పూర్తిస్థాయి దర్శకుడిగా తన తొలి చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



బాబీ దర్శకత్వంలో రూపొందనున్న తొలి చిత్రంలో యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించే అవకాశాలు ఉన్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కథను సిద్ధుకు వినిపించగా... ఆయనకు నచ్చడంతో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ సుకుమార్ క్యాంప్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడం, కథ కూడా నచ్చడంతో సిద్ధు ఈ సినిమాకు అంగీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సుకుమార్ వద్ద పనిచేసిన శిష్యుల తొలి చిత్రాలు ఎక్కువగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లోనే రూపొందాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ బాబీ తొలి సినిమాను కూడా సుకుమార్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముందని సమాచారం. ఈ సినిమాకు సుకుమార్ కేవలం నిర్మాతగానే కాకుండా, కథా అభివృద్ధి, స్క్రీన్‌ప్లే, మేకింగ్ విషయంలో కూడా కీలక పాత్ర పోషించే అవకాశాలున్నాయని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తన కుటుంబ సభ్యుడు దర్శకుడిగా పరిచయం అవుతుండటంతో, తొలి సినిమాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. సుకుమార్ శిష్యులుగా వచ్చిన పలువురు దర్శకులు ఇప్పటికే ఇండస్ట్రీలో సక్సెస్ సాధించారు. ముఖ్యంగా దర్శకుడు బుచ్చిబాబు సానా ఇటీవల తెరకెక్కించిన 'పెద్ది' చిత్రంతో భారీ విజయాన్ని అందుకుని తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారు. దీంతో ఇప్పుడు బాబీపై కూడా సహజంగానే అంచనాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం సుకుమార్ తన తదుపరి చిత్రాలపై దృష్టి సారించారు. ఇప్పటికే రామ్‌చరణ్‌తో కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించిన ఆయన, త్వరలో ఆ సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ ఇవ్వనున్నట్లు సమాచారం. ఆ ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందు బాబీ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులను పూర్తి చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

# యష్, కియారా అద్వానీ క్రేజీ రొమాన్స్..

## టాక్సిక్ నుంచి 'తబాహి' వీడియో సాంగ్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక' సినిమా నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'తబాహి' వీడియో సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ వీడియోలో యాష్, కియారా అద్వానీ మధ్య ఉన్న హాట్ కెమిస్ట్రీ స్క్రీన్‌పై మ్యాజిక్ క్రియేట్ చేసింది. ప్రతి ఫ్రేమ్‌లోనూ వీరిద్దరి లవ్ అండ్ ఇంటెన్సిటీ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. పాట యావరేజ్‌గా ఉన్నప్పటికీ విజువల్స్ మాత్రం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి.

గీతూమోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణీ వసంత, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ, ఫహీమ్ అబ్దుల్లా తదితరులు సంగీతం అందిస్తుండగా... తెలుగు వర్షన్ పాటకు రామజోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై




వెంకట్ కె.నారాయణ, యాష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్-2026 ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.